అక్టోబర్
2016

126

సంపుటి : 11 సంచిక : 5 వెల రు. 10 /-

## ఈ సంచికలో........


ఉత్తరాంధ్ర అభివృద్ధి వ్యూహం
సమిష్టి పని విధానం
దక్షిణ చైనా సముద్ర సమస్య - అమెరికా వ్యూహం
ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ : 'మేక్ ఇన్ ఇండియా'
అంగట్లో ప్రభుత్వ విద్య
జాతీయవాదం, హిందుత్వ, ఆలోచనలపై దాడి
దేశ రక్షణను ప్రైవేటీకరిస్తున్న నకిలీ దేశభక్తులు!
హిందూత్వవాదుల రాజకీయ జంతువు 'ఆవు'
బిజెపి టిడిపి వ్యతిరేక వైఖరి ఎవరు తీసుకున్నా సమర్థించాలి
విప్లవ యోధుడు మల్లు వెంకట నరసింహారెడ్డి

స్ఫూర్తి

## విప్లవ యోధుడు

# మల్లు వెంకట నరసింహారెడ్డి

యు రామకృష్ణ



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మార్క్సిస్టు పార్టీ అభివృద్ధిలో కీలక భూమిక పోషించిన వారిలో ఆయనొకరు. పార్టీ కార్యకర్తగా, తెలంగాణా సాయుధ పోరాటంలో దళ నాయకుడుగా, అనంతరం వ్యవసాయ కార్మిక, రైతు ఉద్యమ నాయకుడుగా, పార్టీ నాయకుడుగా నిర్వర్తించిన పాత్ర చిరస్మరణీయం. సాదా సీదాగా కనిపిస్తారు. అట్టహాసాలూ, ఆర్భాటాలూ ఉండవు.. భేషజం లేదు.. ఎంత సౌమ్యులో అంత సూటిగానూ, స్పష్టంగానూ ఉంటారు. తనకన్నా కింది స్థాయి బాధ్యతల్లో ఉన్న చిన్నవారితో పెద్దనాయకులంతటి సమానస్థాయి ఇచ్చి మాట్లాడతారు.. తెలంగాణా సాయుధ పోరాటంలో దళాల్లో తుపాకీ పట్టి పోరాడారు. తీవ్ర నిర్బంధంలో సైతం ఉద్యమాన్ని రక్షించుకోవడంలో మొక్కవోని దీక్షతో ఆనాటి నాయకత్వం విశ్వాసాన్ని పొంద గలిగారు. ఆయనే అవిభక్త ఆంధ్రప్రదేశ్ మార్క్సిస్టు నేత వీఎన్ అని కార్యకర్తలు ఆప్యాయంగా పిలుచుకునే మల్లు వెంకట నరసింహారెడ్డి.

మల్లు వెంకట నరసింహారెడ్డి (వీఎన్) 1930 మే 18న నల్గొండ జిల్లా నూతనకల్లు ప్రాంతంలోని మామిళ్లమడువ గ్రామంలో ఓ ధనిక కుటుంబంలో జన్మించారు. తల్లిదండ్రులు రామనర్సమ్మ, గోపాలరెడ్డి. తండ్రి జన్నారెడ్డి దేశ్‌ముఖ్ దగ్గర మునసబుగా పనిచేసేవారు. దీనివల్ల ఊరిలో అధికారం చెలాయించేవారు. ఆయన భూస్వాముల స్థాయిలోనే జీవించారు. ఎనిమిదో యేటే వీఎన్‌కు అమ్మ చనిపోయింది. దాంతో సూర్యాపేట ఇమాంపేటలోని అమ్మమ్మ మన్నెం రంగమ్మ ఇంట పెరిగారు. ఇమాంపేటలోనే రెండో తరగతి వరకూ చదువు సాగింది. మూడో తరగతి ఇమాంపేటకు సమీపంలోని ముకుందాపురంలోని నిజాం పాఠశాలలో చదివారు. సూర్యాపేట ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి నుంచి ఏడో తరగతి వరకూ చదివారు. అప్పట్లో జిల్లా మొత్తం మీద ఒక్క నల్గొండలోనే హైస్కూలు ఉండేది. కనుక సూర్యాపేటలో ఉన్న మాధ్యమిక పాఠశాలను హైస్కూలుగా మార్చాలని పోరాటం సాగించారు. ఆ ఉద్యమంలో వీఎన్ చురుగ్గా పాల్గొన్నారు. పోరాట ఫలితంగా సూర్యాపేటకు హైస్కూలు మంజూరైంది. ఆ సంవత్సరమే తండ్రి వీఎన్‌ను ఖమ్మం హైస్కూల్లో చేర్పించారు. ఆనాడు ఆందోళనలు, సమ్మెలు ఉధృతంగా సాగడం, కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థి ఉద్యమాలు నడుస్తుండటం వల్ల వీటికి తన కుమారుణ్ని దూరంగా ఉంచే ఉద్దేశ్యంతో వీఎన్‌ను ఖమ్మం హైస్కూల్లో చేర్పించారు. అప్పుడు ఆల్ హైదరాబాద్ స్టూడెంట్ యూనియన్ (ఏహెచ్ఎస్‌యు) ఏఐఎస్ఎఫ్‌కు అనుబంధంగా ఉండేది. తండ్రి ఖమ్మంలో చదువుకోవాలని చెప్పగానే సరేనన్నాడు. అక్కడ అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉండటం, కమ్యూనిస్టు ఉద్యమంతో సంబంధాలు ఏర్పరుచుకునేందుకు మంచి అవకాశాలుండటంతో ఒప్పేసుకున్నాడు. అయితే ఆయన ఒక ఏడాది పాటే చదివి ఎనిమిదో తరగతితోనే చదువుకు స్వస్తి చెప్పారు.

అది రెండో ప్రపంచ యుద్ధ ముగింపు కాలం. సోవియట్ రెడార్మీ సాధించిన విజయాలు విద్యార్థి ఉద్యమంపైనా, వీఎన్‌పైనా గొప్పగా ప్రభావం చూపించాయి. అప్పుడే విజయవాడలో అఖిలభారత రైతు మహాసభ, ఖమ్మంలో ఆంధ్రమహాసభ జరిగాయి. ఆ ఆంధ్ర మహాసభకు బూదగాని ధర్మభిక్షం నాయకత్వంలో సూర్యాపేట నుంచి ఖమ్మం వరకూ కాలినడకన వెళ్లిన బృందంలో వీఎన్ ఉన్నారు. అప్పటికే పార్టీతో వీఎన్‌కు సంబంధాలు ఏర్పడ్డాయి. పోస్టర్లు, బ్యానర్లు రాయడంలో కొంత నైపుణ్యం సంపాదించారు. తెలంగాణా సాయుధ పోరాట ప్రారంభ దినాల్లో, నిర్బంధ కాండ తీవ్రంగా ఉన్న సమయంలో వీఎన్ సూర్యాపేటలో బూదగాని ధర్మబిక్షం నడుపుతున్న హాస్టల్లో ఉంటూనే కొరియర్‌గా రహస్యంగా నాయకులకు సమాచారం అందించేవారు. ఓసారి పార్టీ సందేశాన్ని పార్టీ నాయకులకు రహస్యంగా అందివాల్సి వచ్చింది. ఉత్తరం తీసుకున్న పార్టీ నాయకులు రహస్య ప్రదేశంలోకి వెళ్లిపోగా, ఆ నిశిరాత్రివేళ కాలినడకన ఒంటరిగా సూర్యాపేటకు చేరుకున్నాడు. అప్పటికి వీఎన్‌కు పదహారేళ్లు. సూర్యాపేటలో సైన్యం గస్తీ తిరుగుతోంది. గస్తీ దగ్గరకు వస్తోంది. అప్పుడు వెంటనే ఆ దగ్గరలో ఉన్న ఒక సందులో ప్రవేశించి కొంతదూరం పోయాక ఎవరో విద్యార్థులుండే ఇల్లు కనిపించింది. వీఎన్ అక్కడకు వెళ్లి మెల్లగా వారి పక్కన పడుకున్నాడు. తెల్లవారుజామునే లేచి తిరిగి సొంతగూటికి చేరుకున్నాడు. ఇది విద్యార్థి దశలో వీఎన్ గడిపిన రహస్య జీవిత అనుభవం. రాత్రిపూట కొరియర్‌గానూ, పగటిపూట విద్యార్థిగానూ ఆయన బాధ్యతలు నిర్వహించారు.

అప్పట్లో పోలీసు నిర్బంధం తీవ్రంగా ఉంది. మల్లారెడ్డిగూడెం, బాలెంల, పాత సూర్యాపేటల్లో కాల్పులు జరిగాయి. ఆ తరువాత ఆ పోరాటాలను పరిశీలించేందుకు అంతర్జాతీయ ప్రతినిధిబృందం ఒకటి వచ్చింది. ఆ బృందంలో సోవియట్ యూనియన్‌కు చెందిన ప్రావ్దా పత్రిక సంపాదకవర్గ సభ్యులు, ఓల్గా, డెన్మార్క్, యుగోస్లావియాలకు చెందిన సభ్యులున్నారు. వారిని జాగ్రత్తగా పోరాట ప్రదేశాలకు తీసుకువెళ్లే బాధ్యతను వీఎన్‌తోపాటు మరి కొందరు విద్యార్థులకు అప్పగించారు. వారా బాధ్యతను అత్యంత చాకచక్యంగా నిర్వర్తించారు. నల్గొండ జిల్లాలో ఆంధ్రమహాసభ ముఖ్య కార్యకర్తలుగా ఉన్న ధర్మబిక్షం, దాయం రాజిరెడ్డి, తెట్ల దుర్గయ్య, తండు లక్ష్మయ్యలను అరెస్టు చేసి సూర్యాపేట జైల్లో పెట్టారు. వారిని విడిపించేందుకు వీఎన్, స్వరాజ్యం, మరికొందరు విద్యార్థులు ఎత్తుగడ వేసి వారిని విజయవంతంగా తప్పించారు. అయితే వారిలో ముగ్గురిని పోలీసులు తిరిగి పట్టుకున్నారు. వారిలో దాయం రాజిరెడ్డి మాత్రం సురక్షితంగా తప్పించుకున్నారు.

నైజాం స్వతంత్ర భారతదేశంలో చేరడానికి సుముఖత చూపనందుకు నిరసనగా క్విట్ కాలేజీ ఉద్యమంలో వీఎన్ చురుకైన పాత్ర నిర్వహించారు. జెన్నారెడ్డి భూస్వామితో వారి తండ్రి సాన్నిహిత్యంగా ఉన్నా ఆయన మాత్రం అతడిపై రాజీలేని పోరాటం సాగించారు. విద్యార్థి దశలో ధర్మబిక్షం, సాయుధ పోరాటంలోకి ప్రవేశించే సమయంలో ఎం.ఓంకార్, పోరాటంలోకి వచ్చాక భీమిరెడ్డి నరసింహారెడ్డి ఆయనకు ఎంతగానో సహకరించారు. ఒక విధంగా చెప్పాలంటే ఆయా దశల్లో వారే ఆయనకు గురువులు.

నల్లగొండ జిల్లా నుంచి మానుకోట ప్రాంతానికి వెళ్లాలని పార్టీ ఆయనను కోరింది. బయ్యారం ప్రాంత ఆర్గనైజర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. నాయకత్వంలేక కొన్ని దళాలు గమ్యం తెలియని స్థితిలో ఉన్నాయి. నీలాయగుట్ట అడవి ప్రాంతాల్లోకి దళాలు రక్షణకు వెళ్లాయి. అప్పుడక్కడ రాజకీయ క్లాసులు నిర్వహించారు. ఆ క్లాసులకు నండూరి ప్రసాదరావు హాజరయ్యారు. క్లాసులయ్యాక మళ్లీ మైదాన ప్రాంతానికి వెళ్లాలని పార్టీ ఆదేశించింది. పోలీసు దాడులు ముమ్మరమయ్యాయి. ఆరునెలల పాటు పైకమిటీతో సంబంధాలు తెగిపోయాయి. తన వెంట ఉన్న కొరియర్ లక్ష్మీనరసయ్య పోలీసు కాల్పుల్లో చనిపోయాడు. ఒంటరిగానే నడవాల్సి వచ్చింది. కొంతకాలం తరువాత నర్సంపేట అడవుల నుంచి పార్టీని విస్తరింప చేయాలని

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


1. విప్లవ యోధుడు మల్లు వెంకట నరసింహారెడ్డి
యు రామకృష్ణ ...................... 2
2. ఉత్తరాంధ్ర అభివృద్ధి వ్యూహం
బివి రాఘవులు...................... 4
3. సమిష్టి పని విధానం
ఎస్ వీరయ్య ........................ 7
4. దక్షిణ చైనా సముద్ర సమస్య - అమెరికా వ్యూహం
ఎస్ వెంకట్రావు ..................... 9
5. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ : 'మేక్ ఇన్ ఇండియా'
ఎ కోటిరెడ్డి ........................ 12
6. అంగట్లో ప్రభుత్వ విద్య
మధుప్రసాద్...................... 16
7. జాతీయవాదం, హిందుత్వ, ఆలోచనలపై దాడి
ప్రభాత్ పట్నాయక్.......... 20
8. దేశ రక్షణను ప్రైవేటీకరిస్తున్న నకిలీ దేశభక్తులు!
అతుల్ భరద్వాజ్ ............ 26
9. హిందూత్వవాదుల రాజకీయ జంతువు 'ఆవు'
డి.ఎన్. ఝా.................. 30
10. బిజెపి టిడిపి వ్యతిరేక వైఖరి ఎవరు తీసుకున్నా సమర్థించాలి
బి.వి రాఘవులు....... 33



**సంపాదకుడు:**
**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**
**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**



భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరఫున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ముద్రణ :** ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్,
ప్లాట్ నెం 21/1, అజామాబాద్, హైదరాబాద్-20
**ఫోన్: ఎడిటోరియల్ 0866-2577248**
**మేనేజర్: 040-27673787**
email:venkataraosankarapu@gmail.com
visit cpi(m) site at : cpim.org


# శ్రామిక మహిళ

దోపిడీ సమాజంలో శ్రామిక వర్గం అన్ని రకాలుగా శ్రమదోపిడీకి, పీడనకు గురవుతున్నారు. శ్రామిక వర్గంలో కూడా మహిళా శ్రామికుల పరిస్థితి మరీ దారుణం. కార్మికులందరితోపాటు వారు శ్రమదోపిడీకి గురికావడమే కాదు అదనంగా వేతనాల్లో వివక్షకూ, పని ప్రదేశాల్లో లైంగిక వేదింపులకూ గురియవుతున్నారు. ప్రపంచీకరణ యుగంలో అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడి క్రమంగా మరింత మంది మహిళలను కార్మికవర్గంలోకి తీసుకొస్తోంది. మహిళల శ్రమకు అతి తక్కువ వేతనం ఇవ్వడం ద్వారా పెట్టుబడిదారులు లాభాలను మరింత పెంచుకుంటున్నారు. ముఖ్యంగా టెక్స్‌టైల్స్, ఆహార ఉత్పత్తులు, ప్రయివేటు విద్య, వైద్యం వంటి రంగాల్లో మహిళలు అత్యధిక సంఖ్యలో పని చేస్తున్నారు. చట్టప్రకారం వీరికి అందాల్సిన సదుపాయాలు అందడం లేదు సరికదా పురుషులతో పోలిస్తే తక్కువ వేతనాలకే పని చేయాల్సి వస్తోంది. సమాజంలో తనకంటూ ఒక వ్యక్తిత్వం ఉండాలనీ, కుటుంబాన్ని నడపాలనీ, భర్తలు తెచ్చే వేతలనాలకు తోడవ్వాలనే ఉద్దేశ్యాలతో మహిళలు ఉద్యోగాల్లో చేరుతున్నారు. స్త్రీలు ఉద్యోగాలు చేయడం నామోషీగా భావించే మన సమాజంలో కుటుంబం నుండి సమాజం నుండి వస్తున్న వ్యతిరేకతలను అదిగమించి ఉద్యోగాలకు వస్తున్న మహిళలకు ఉద్యోగంలో చేరేటప్పుడు, జీతాలు నిర్ణయించడంలో, పదోన్నతుల్లో అన్నింటా వివక్ష ఎదురవుతోందని అనేక సర్వేలు చెబుతున్నాయి.

ప్రయివేటు సంస్థలే కాదు ప్రభుత్వాలు కూడా మహిళల పట్ల తీవ్రమైన వివక్షను ప్రదర్శిస్తున్నాయి. అంగన్‌వాడీ, ఆశా ఇతర స్కీం వర్కర్లకు చాలీ చాలని వేతనాలు ఇస్తున్నాయి. రోజంతా వారిచేత వెట్టి చాకిరీ చేయించుకుంటూ వారిని కనీసం కార్మికులుగా కూడా గుర్తించకపోవడం దారుణం. అంతే కాదు పురుషులతోబాటు మహిళలు పనిచేసే అనేక రంగాలను కాంట్రాక్టు, ఔట్ సోర్సింగుకు ఇవ్వడం ద్వారా మహిళల శ్రమ దోపిడీకి ప్రభుత్వాలే సహకరిస్తున్నాయి. విదేశీ పెట్టుబడులకు రాయితీలు, సదుపాయాలు కల్పించే పేరిట బహుళజాతి కంపెనీలు నెలకొల్పుతున్న సెజ్‌లలో మహిశా శ్రామికులకు కనీస మానవ హక్కులు కూడా లేకుండా చేస్తున్న ఘటనలు అనేకం వెలుగు చూస్తున్నాయి. శ్రామిక మహిళలకు ప్రసూతి ప్రయోజనాలు అందడం లేదు. శిశువులకు పరిశ్రమల్లో క్రచ్‌లు కనిపించవు. చట్ట ప్రకారం మహిళలచేత ప్రమాదకర పనులు చేయించకూడదు. రాత్రి షిఫ్టు పనుల్లో పెట్టకూడదు. కానీ ఈ చట్టాలేవీ అమలు జరగడం లేదు. పైగా చిన్న తరహా పరిశ్రమలకు ప్రోత్సాహాలు కల్పించే పేరిట మహిళా కార్మికులకు ఉన్న రక్షణలను కేంద్ర ప్రభుత్వం ఎత్తివేస్తున్నది.

శ్రామికులందరి సమస్యలతో బాటు మహిళలకు అదనపు సమస్యలున్నాయి. వారిపై దోపిడీ మరింత ఎక్కువగా సాగుతోంది. వేధింపులకు, వివక్షకు గురవుతున్నారు. అందుకే శ్రామిక మహిళలు రోజురోజుకూ మరింత ఎక్కువగా పోరాటాల్లోకి వస్తున్నారు. ప్రదర్శనలు, ధర్నాలు, సమ్మెలు ఏ పోరాటం తీసుకున్నా శ్రామిక మహిళల పాత్ర పెరుగుతోంది. అయితే ఇది సరిపోదు. ప్రతి వంటగత్తె ఒక రాజకీయ నాయకురాలు కావాలి అన్నాడు లెనిన్. మొత్తం శ్రామిక వర్గ పోరాటంలో అత్యధిక దోపిడీ పీడనలను ఎదుర్కొంటున్న శ్రామిక మహిళలే ఎక్కువగా పాల్గొనాలి. వాస్తవానికి ఈ పోరాటాలకు వారే నాయకత్వం వహించాలి. భారత దేశ శ్రామిక వర్గ అంతిమ విజమానికి అది తప్పనిసరి.


**చందా వివరాలు**
విడిపత్రిక: **రూ.10**, సంవత్సర చందా:**రూ.100**, పోస్టు ద్వారా **రూ. 120**
పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

**ఈ మాసం ముఖ్యాంశం**

# ఉత్తరాంధ్ర అభివృద్ధి వ్యూహం

**బివి రాఘవులు**



*రచయిత సిపిఐ (ఎం)*
*పొలిట్‌బ్యూరో సభ్యులు*

ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాలు అన్ని రకాలుగా వెనుకబడి ఉన్నాయన్న విషయం అందరికీ తెలుసు. విశాఖ పట్టణాన్ని మినహాయించి పరిశీలిస్తే ఈ వెనుకబాటు మరింత కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉత్తరాంధ్ర వెనుకబాటు తనం అనే అంశానికి తగినంత ప్రాధాన్యత రాలేదు. రాష్ట్రం నుండి తెలంగాణ విడిపోవడంతో వెనుకబాటు తనం అనే అంశం కూడా ఒక ముఖ్యమైన చర్చనీయాంశమైన నేపథ్యంలో నూతన ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడిన తరువాత అయినా ఉత్తరాంధ్ర వెనుకబాటు తనం అంశానికి తగిన ప్రాధాన్యత వస్తుందని ఆశించాం. కాని రాష్ట్రం ఏర్పడి రెండేళ్ళు దాటిపోతున్నా కొత్త పాలకుల ఆలోచనలలో ఈ అంశం ఉన్నట్లుగా అనిపించడం లేదు. గతంలోను ఇప్పుడు కూడా కొంత మంది ఆలోచనాపరులైన మేధావుల ఘోషగానే కనిపిస్తున్నది. అభివృద్ధి అంటే గతంలో హైదరాబాద్ అభివృద్ధిగా చలామణి అయ్యింది. ఇప్పుడు అమరావతి అభివృద్ధిగా, మహా అయితే దానికి తోడుగా విశాఖపట్నం అభివృద్ధిగా చలామణి అవుతున్నది. ఆనాడు ఈనాడు కూడా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి విస్మరించబడింది. ఇప్పుడైనా ఉత్తరాంధ్ర వెనుకబాటు తనం రాజకీయ ఎజెండాలోకి రావాలంటే పౌర సమాజం గట్టిగా పూనుకొని పాలకులు విస్మరించలేనంత స్థాయిలో ప్రజాభిప్రాయాన్ని కూడగడితేనే సాధ్యం అవుతుంది.

ఉత్తరాంధ్ర వెనుకబాటు తనం గురించి మేధావులు, క్రియాశీల ప్రజా సేవకులు ఇప్పటికే మన ముందు ఎంతో సమాచారాన్ని ఉంచారు. ఈ రోజు ఈ సదస్సులో ఇంకా అనేక తాజా విషయాలను మనకు వివరిస్తారు. అయినా సంక్షిప్తంగా ఉత్తరాంధ్ర అభివృద్ధి ఎంత నిర్లక్ష్యం చేయబడిందో అంచనా వేసుకొనేందుకు కొన్ని వివరాలను పేర్కొంటున్నాం. ఈ మధ్యనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం జిల్లా స్థూల ఉత్పత్తిలో విజయనగరం 12వ స్థానంలో, శ్రీకాకుళం 13వ స్థానంలో ఉన్నాయి. స్థూల విలువ పెరుగుదల (జివిఎ)లో విజయనగరం 12, శ్రీకాకుళం 13వ స్థానంలో ఉన్నాయి. విశాఖ నగరం ముఖ్య భాగంగా ఉన్నందున విశాఖ జిల్లా 2వ స్థానంలో ఉన్నది. నగరాన్ని మినహాయిస్తే మిగతా గ్రామీణ ప్రాంతం రాష్ట్రంలోని అన్ని గ్రామీణ ప్రాంతాల కన్నా వెనక ఉంటుంది. సగటు తలసరి ఆదాయం విషయంలోను మూడు జిల్లాల స్థానాలు పైన పేర్కొన్న దోరణిలోనే ఉన్నాయి. 2014-15 గణాంకాల ప్రకారం విజయనగరం జిల్లాలో 24 శాతం, విశాఖలో 10శాతం నికర సాగు భూమికి మాత్రమే సాగునీటి పారుదల సౌకర్యం (అన్ని రకాల వనరులను కలుపుకొని) ఉన్నది. శ్రీకాకుళం జిల్లా ఈ కాలంలో కొంత మెరుగై 62 శాతానికి చేరింది. మిగతా పశ్చిమ గోదావరి, కృష్ణ వంటి జిల్లాలతో పోల్చితే శ్రీకాకుళం కూడా 10 శాతం వెనుకబడి ఉన్నది. రెండు పంటలు పండే మాగాణిని పరిగణనలోకి తీసుకుంటే ఇంకా వెనుకబడి ఉంటుంది. వ్యవసాయం వెనుకబాటు తనానికి నీటిపారుదల సౌకర్యాలతో బాటు అంతకన్నా ఎక్కువగా వ్యవసాయ ఉత్పాదకత ముఖ్యమైన కొలబద్ద. అన్ని జిల్లాలలో ఎక్కువగా పండే వరి పంట ఉత్పాదకతను పరిశీలిస్తే ఉత్తరాంధ్ర ఎంత వెనుకబడి ఉందో కళ్లకుకట్టినట్లు కనిపిస్తుంది. రాష్ట్రంలో సగటున ఒక హెక్టారుకు వరి దిగుబడి 3094 కిలోలు ఉంటే శ్రీకాకుళంలో 1749 కిలోలు, విశాఖలో 1752 కిలోలు మాత్రమే ఉన్నది. 1980 దశకంలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందించటం మొదలైన తరువాత అన్ని ప్రాంతాల్లో బోర్ల కింద వ్యవసాయం పెద్ద ఊపు అందుకున్నది. కాని ఉత్తరాంధ్రలో మాత్రం బోర్‌వెల్స్ క్రింద వ్యవసాయం ఇంకా నామమాత్రంగానే ఉంది. ఇప్పటికీఉపయోగానికి అవకాశం ఉన్న మొత్తం భూ గర్భ జలాలలో విజయనగరంలో 21 శాతం, శ్రీకాకుళంలో 29 శాతం, విశాఖపట్నం 32 శాతం మాత్రమే వినియోగంలోకి వచ్చాయి. రుణ వితరణలో కూడా ఉత్తరాంధ్ర జిల్లాలు తీవ్రంగా నిర్లక్ష్యం చేయబడ్డాయి. క్రెడిట్ – డిపాజిట్ నిష్పత్తి శ్రీకాకుళంలో 92, విజయనగరం 88, విశాఖపట్నం 85 ఉంటే పశ్చిమ గోదావరిలో 163 ఉంది.

మానవ వనరుల అభివృద్ధి విషయంలో ఉత్తరాంధ్ర మరింత ఉపేక్షకు గురైంది. దేశంలో రాష్ట్రం వెనుకబడి ఉంటే, రాష్ట్రంలో ఉత్తరాంధ్ర జిల్లాలు అట్టడుగున ఉన్నాయి. రాష్ట్ర అక్షరాస్యత 67శాతం (2011) ఉంటే శ్రీకాకుళం 61, విజయనగరం 60, విశాఖపట్నం 61 శాతాలతో వెనుకబడి ఉన్నాయి. స్త్రీల అక్షరాస్యత మరింత శోచనీయంగా ఉంది. రాష్ట్ర సగటు 60శాతం ఉంటే విశాఖపట్నం 59, శ్రీకాకుళం 52, విజయనగరం 49.87 శాతంగా ఉన్నది. ఉత్తరాంధ్రలో గణనీయంగా ఉన్న గిరిజనులు చదువులో పూర్తిగా వెనుకబడి ఉన్నారు. శిశుమరణాల సంఖ్య కూడా రాష్ట్ర సగటు కన్నా ఉత్తరాంధ్రలో ఎక్కువగా ఉంది. రాష్ట్రంలో ప్రతి వెయ్యి జననాలకు 41 మరణాలు ఉంటే విశాఖలో 50, శ్రీకాకుళంలో 53, విజయనగరంలో 68 ఉన్నాయి. పిల్లల్లో (6నెలలు-5 సం॥లోపు) పోషకాహారలోపం రాష్ట్రంలో 60శాతం ఉంటే శ్రీకాకుళంలో 73, విజయనగరంలో 81, విశాఖలో 69 శాతం (2014-15) ఉంది. ఈ వాస్తవాలు ఉత్తరాంధ్ర వెనుకబాటు తనాన్ని ఇంత నిర్వివాదంగా స్పష్టం చేస్తున్నప్పటికీ సమస్యను పరిష్కరించడానికి పాలకులు పూనుకోకపోవడం అందరికీ ఆశ్చర్యం కలిగించే విషయం.

ఉత్తరాంధ్ర వెనుకబాటు తనాన్ని గత 6 దశాబ్దాల కాలంలో పాలకులు తగిన పద్ధతిలో పట్టించుకోకపోవడానికి కొన్ని సాధారణ కారణాలు, కొన్ని ప్రత్యేక కారణాలు ఉన్నాయి. చారిత్రకంగా చూసినప్పుడు ఉత్తరాంధ్రలో ఫ్యూడల్ జమీందారీ ప్రభావం ఎక్కువ. జమీందారీ వ్యవస్థ రద్దు అయినా ఫ్యూడల్ వ్యవస్థ అవశేషాలు, ప్రభావాలు ఇంకా బలంగానే ఉన్నాయి. బలమైన ఫ్యూడల్ ప్రభావాలను సమూలంగా తొలగించేందుకు అవసరమైన పథకాలను, సంస్కరణలను పాలకులు అమలు చేయలేదు. పాలకులతో నిమిత్తం లేకుండా

"ప్రజలకు ఉపయోగపడే నిజమైన అభివృద్ధి అంటే ఇదికాదు. వినియోగించుకో గలిగే శక్తి కలిగిన మానవ వనరులను అభివృద్ధి చేయడం ఏ అభివృద్ధి నమూనాలోనైనా కీలకంగా ఉండాలి. ఉత్తరాంధ్రలో ఈ అంశమే అత్యంత నిర్లక్ష్యానికి గురైంది."

ప్రజల్లో ఫ్యూడల్ విలువలను తొలగించే ఉద్యమాలు బలపడలేదు. ఇప్పటికీ ఉత్తరాంధ్ర రాజకీయాలను ఫ్యూడల్ శక్తులు, వారి అనుయాయులే నిర్దేశించే స్థితి కొనసాగుతుంది. ప్రజాస్వామ్య స్ఫూర్తి కన్నా ప్రజలను అణిచి వుంచే స్వభావం ఫ్యూడల్ సంస్కృతికి ప్రధాన రాజకీయ లక్షణం. ఈ పరిస్థితి ఇప్పటికీ కొనసాగడం శోచనీయం.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత అధికారాన్ని చేపట్టిన పాలక వర్గాలు ఉత్తరాంధ్రతో పాటు అన్ని వెనుకబడిన ప్రాంతాలను నిర్లక్ష్యం చేశాయి. భారీ ప్రాజెక్టుల వైపు మొగ్గు చూపాయి తప్ప ప్రతి ప్రాంతానికి తగినట్లుగా నీటి వనరులను అభివృద్ధి చేయడంలోగాని, పారిశ్రామీకరణ జరపడంలోగాని శ్రద్ధపెట్టలేదు. ఉత్తరాంధ్రలోని ఆధిపత్య వర్గాలు రాష్ట్ర స్థాయి పాలకులకు వంతపాడుతూ స్వంత ప్రయోజనాలను మాత్రమే చూసుకున్నారు. ఉత్తరాంధ్రలో ప్రజలు విద్యావంతులు, ఆరోగ్యవంతులు కావడం సహజంగానే ఫ్యూడల్ శక్తులకు ఇష్టం ఉండదు. రాష్ట్ర పాలకులు కూడా ఉత్తరాంధ్రలో విద్యా, వైద్య రంగాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. దీంతో 6 దశాబ్దాలు గడిచిపోయినా ఈ జిల్లాలు అట్టడుగునే ఉన్నాయి. ఈ జిల్లాలలో ఉండే ప్రజల సామాజిక పొందిక వలన కూడా పాలకుల నిర్లక్ష్యానికి గురయ్యారు. రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన గిరిజనులు ఎక్కువగా ఈ జిల్లాల్లోనే ఉన్నారు. సామాజికంగా, విద్యాపరంగా వెనకబడిన ప్రజలు ఈ జిల్లాల్లో అధికం. అగ్ర కులాలుగా చెప్పుకోగలిగిన వారి సంఖ్య నామమాత్రం. అందువలన రాష్ట్ర స్థాయిలో మిగతా జిల్లాల్లో ఆధిపత్యంలో ఉన్న అగ్ర కులాల పాలకుల దృష్టి ఉత్తరాంధ్ర వైపు మళ్లకపోవడం యాదృశ్చికం కాదు.

విశాఖపట్నం ఒక మహానగరంగా అభివృద్ధి చెందడం ఉత్తరాంధ్ర అభివృద్ధిగా భ్రమపడేవాళ్ళు కొందరు ఉన్నారు. పాలకులు అటువంటి భ్రమలను కూడా కలిగిస్తున్నారు. ఏ మహానగరమైనా అభివృద్ధి చెందినప్పుడు దాని చుట్టూ ఉన్న ప్రజలు అవకాశాలను వినియోగించుకొనే స్థాయిలో అప్పటికే అభివృద్ధి చెంది ఉంటేనే మహానగరం ఆ ప్రాంతానికి ఉపయోగపడుతుంది. లేకపోతే బయట నుంచి వచ్చిన వారికే ఆ ప్రయోజనాలు అత్యధికంగా దక్కుతాయి. ప్రస్తుతం విశాఖపట్నం పెరుగుదల కూడా అటువంటిదే. ఈ మహా నగర అభివృద్ధి ప్రయోజనం ఉత్తరాంధ్రకు బహు స్వల్పం. ఉత్తరాంధ్ర ప్రజలకు నేడు ఈ అభివృద్ధి అవకాశాలను వినియోగించుకో గలిగే శక్తిని పాలకులు



దూరం నుండి నీళ్ళు తెస్తున్న మన్యం ప్రజలు

ఇవ్వలేదు. భవిష్యత్‌లో ఇవ్వాలన్న ఆలోచన కూడా లేదు. అందువలన విశాఖపట్నం అభివృద్ధి చుట్టూ పాలకులు చేసిన ఆలోచనలు కూడా ఉత్తరాంధ్ర నిర్లక్ష్యానికి ఒక కారణం.

దేశంలో 1991 తరువాత వేగంగా అమల్లోకి వచ్చిన సరళీకరణ విధానాలు కూడా వెనుకబడిన ప్రాంతాల నిర్లక్ష్యానికి కారణమయ్యాయి. వ్యవసాయ రంగానికి పెట్టుబడులు తగ్గించడం, విద్యా, వైద్య రంగాలను వ్యాపారీకరించడం, సామాజిక సంక్షేమ కార్యక్రమాలకు కోతలు పెట్టడం సహజంగానే ఉత్తరాంధ్రకు నష్టం చేసింది. అభివృద్ధి అనేదానిని మార్కెట్ శక్తులకు వదిలివేయాలన్న విధాన ఫలితంగా అభివృద్ధి జరిగిన చోట అభివృద్ధికి అవకాశాలు మెరుగయ్యాయి. వెనుకబడిన ప్రాంతాలు ఇంకా వెనకబడ్డాయి.

ఉత్తరాంధ్ర ప్రాంతంలో గత నాలుగు, ఐదు దశాబ్దాల్లో ఉనికిలోకి వచ్చిన కొద్దిపాటి మధ్యతరగతి కూడా ఉన్న అవకాశాలను ఎలా వ్యక్తిగతంగా వినియోగించుకోవాలన్న దానికే ప్రాధాన్యత ఇచ్చింది తప్ప మొత్తం ఉత్తరాంధ్ర అభివృద్ధికి పనిచేయాలన్న స్ఫూర్తిని ప్రదర్శించలేదు. సామాజిక స్పృహకలిగిన కొద్ది మంది మేధావులు, కొన్ని సంస్థలు మాత్రమే అభివృద్ధి సమస్యపై పనిచేస్తున్నాయి. విస్తృతమైన ప్రజా సమీకరణ జరిగి పాలకులపై ఒత్తిడి పెరగక పోవడం కూడా అభివృద్ధికి అవసరం అయిన నిధులను, పథకాలను సాధించలేకపోవడానికి మరో కారణం.

ఇప్పుడైనా ఉత్తరాంధ్ర అభివృద్ధి జరగాలంటే రాష్ట్ర ప్రభుత్వం అనుసరించే కేంద్రీకరణ అభివృద్ధి దృక్పథం పనికిరాదు. రాష్ట్ర రాజధానిగా ప్రకటించబడిన అమరావతి చుట్టూ అభివృద్ధినంతటిని కేంద్రీకరించే ప్రణాళికను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. అలాగే విదేశీ పెట్టుబడులను ఆహ్వానించి సముద్ర తీరం అంతటా అక్కడక్కడ ప్రత్యేక ఆర్థిక మండళ్లు, కారిడార్ల పేరుతో కిరాతకమైన దోపిడీ కేంద్రాలను (శ్రమ దోపిడీయే కాదు, భూ దోపిడీ, పర్యావరణ దోపిడీ) ఏర్పాటు చేయడం అభివృద్ధిగా రాష్ట్ర ప్రభుత్వం చలామణి చేస్తున్నది. ప్రజలకు ఉపయోగపడే నిజమైన అభివృద్ధి అంటే ఇదికాదు. వినియోగించుకో గలిగే శక్తి కలిగిన మానవ వనరులను అభివృద్ధి చేయడం ఏ అభివృద్ధి నమూనాలోనైనా కీలకంగా ఉండాలి. ఉత్తరాంధ్రలో ఈ అంశమే అత్యంత నిర్లక్ష్యానికి గురైంది. అత్యధిక మందికి జీవనోపాధిని ఇస్తూ, ఆహార భద్రతకు అవసరమైన వ్యవసాయాన్ని బలపర్చడం, రైతు తన కుంటుంబ ఆరోగ్య, వైద్య, సాంస్కృతిక పరిస్థితిని మెరుగు పర్చుకునేందుకు అవసరమైన మిగులును రైతుకు దక్కే పద్ధతిలో వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడం రెండో ముఖ్యమైన అంశం. ఇందుకు నీటి పారుదల సౌకర్యాలను పటిష్టం చేయడం కీలకం. రాయలసీమలాగా వర్షాభావ పరిస్థితులు ఉండడంకాక ఉత్తరాంధ్రలో పుష్కలంగా వర్షపాతం ఉండి కూడా నీటిపారుదల సౌకర్యాల అభివృద్ధిలో వెనుకబడి పోవడానికి కేవలం పాలకుల నిర్లక్ష్యమే కారణం. ఇప్పటికైనా ఈ పరిస్థితి మారాలి.

ఉత్తరాంధ్రలో చిన్నకమతాలు ఎక్కువ. రాష్ట్రంలో కమతం సగటు సైజు 1.06 హెక్టార్లు ఉంటే ఉత్తరాంధ్రలో 0.75, శ్రీకాకుళంలో 0.66, విజయనగరంలో 0.77 హెక్టార్లు

> **“ఈ అధిక సాంద్రత ఉత్త రాంధ్రలో పరిమితమైన సాగు భూమిపై తీవ్రమైన ఒత్తిడి పెంచుతున్నది. జనాభాలో అత్యధిక భాగాన్ని వ్యవసాయేతర రంగాలలో ఉపాధిలోకి మళ్లించినప్పుడు మాత్రమే ప్రజల జీవన పరిస్థితి మెరుగు పడుతుంది.”**

మాత్రమే ఉంది. ఇంత చిన్న కమతాలు కలిగిన ఈ ప్రాంతంలో వ్యవసాయాన్ని లాభదాయకంగా చేయాలంటే కొన్ని ప్రత్యేక పద్ధతులను, పథకా లను అమలు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు బాగా భూము లు కలిగిన భూ కామందులకు సానుకూలమైన పద్ధతులలో ఉ ంటున్నాయి. ఈ పరిస్థితి మారాలి.

ఉత్తరాంధ్రలో సాపేక్షంగా చూసినప్పుడు జన సాంద్రత ఎక్కువగా ఉంది. రాష్ట్రంలో సగటు జన సాంద్రత చదరపు కిలో మీటరుకు 304 ఉంటే శ్రీకాకుళం 463, విజయనగరం 359, విశాఖపట్నంలో 384 ఉన్నది. విస్తీర్ణం ఎక్కువగా ఉండి జనాభా తక్కువగా ఉన్న గిరిజన ప్రాంతాలు మినహాయిస్తే మిగిలిన గ్రామీణ ప్రాంతాల్లో జనసాంద్రత తీవ్రత మరింత ఎక్కు వగా ఉంటుంది. ఈ అధిక సాంద్రత ఉత్త రాంధ్రలో పరిమితమైన సాగు భూమిపై తీవ్రమైన ఒత్తిడి పెంచుతున్నది. జనాభాలో అత్యధిక భాగాన్ని వ్యవసాయేతర రంగాలలో ఉపాధిలోకి మళ్లించినప్పుడు మాత్రమే ప్రజల జీవన పరిస్థితి మెరుగుపడుతుంది. ఈ ప్రాంతంలో జరిగే పారిశ్రామిక అభివృద్ధిగాని, విశాఖపట్నం అభివృద్ధిగాని అదనపు జనాభాకు ఉపాధి కల్పించే పద్ధతిలో ఉండాలి. కాని ప్రస్తు తం ఈ ప్రాంతంలో జరుగుతున్న పారిశ్రామిక అభివృద్ధి ఈ తీరులో లేదు. ఇక్కడ ఉండే భూములు, గనులు, నీరు వంటి వనరులను కొల్లగొడుతూ, అతి తక్కువ ఉపాధిని కల్పిస్తూ, ఆ ఉపాధిని కూడా ఇతర ప్రాంతాల వారికి అత్యధికంగా అందేటట్లు చేయటం జరుగు తున్నది. అందువల్ల ఉత్తరాంధ్ర ప్రజల దృష్టితో చూసినప్పుడు ఈ పారిశ్రామిక అభివృద్ధి ప్రజల జీవితాలను కొల్లగొట్టే అభివృద్ధి తప్ప జీవితాన్ని ఇచ్చే అభివృద్ధి కాదనేది స్పష్టం.

ఉత్తరాంధ్రలో రాష్ట్రంలోకల్లా అత్యధిక వర్షపాతం ఉన్నది. రాష్ట్ర సగటు సాలుసరి 666



**వృధాగా సముద్రంలో కలుస్తున్న నాగావళినీరు**

మిల్లిమీటర్లు ఉంటే శ్రీకాకుళంలో 1067, విజయనగరం 1131, విశాఖపట్నం 1202 మిల్లిమీటర్లు ఉన్నది. ఈ వర్షపాతం ఎక్కువ రోజుల పాటు పంపిణీ అయ్యి వ్యవసాయానికి అనువుగా ఉంది. వంశధార, నాగవళి ఇంకా అనేక నదులు, గెడ్డల ద్వారా నీరు అన్ని ప్రాంతాల్లో విస్తారంగా అందుబాటులో ఉంది. అయితే కొండలు తీర ప్రాంతం మధ్య దూరం తక్కువగా ఉండడం, వాలు ఎక్కువగా ఉండడం వలన నీరు అత్యంత వేగంగా ప్రయాణించి సముద్రలో కలిసిపోతుంది. ఈ నీటిని మళ్లించి నిల్వచేసి వినియోగించుకోవడం అనేది ఒక ముఖ్యమైన పని. భారీ ప్రాజెక్టులకు అయ్యే ఖర్చులో శతాంశం ఖర్చుపెట్టినా ఈ నీటి వనరులను ఉపయోగించుకొని భారీ ప్రాజెక్టుల ద్వారాపొందే లాభాలకన్నా ఎక్కువ లాభాలు పొందే అవకాశం ఉంది. కాని రాష్ట్ర ప్రభుత్వం నీటిపారుదల రంగంలో ఉత్తరాంధ్రను తీవ్రంగా నిర్లక్ష్యం చేసింది.

ఉత్తరాంధ్రలోని అటవీ ప్రాంతంలో గిరిజనుల జనాభా గణనీయంగా ఉంది. రాష్ట్రంలో సగటు గిరిజన జనాభా 5.53 శాతం అయితే శ్రీకాకుళం 6.15, విజయనగరం 10.22, విశాఖలో 14.42శాతం గిరిజనులు ఉన్నారు. వీరు ఏజెన్సీ మండలాల్లో సాంద్రంగా కేంద్రీకరించి ఉన్నారు. అన్ని విషయాల్లో అన్ని తరగతులుకన్నా అత్యంత వెనుకబడి ఉన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో వీరి అభివృద్ధి అత్యంత కీలకమైన విషయం. మిగిలిన జనాభాలో కూడా అత్యధిక భాగం వెనుకబడిన కూలాల జనాభా ఉన్నది. ముఖ్యంగా అక్షరాస్యత విషయంలో, స్త్రీల అభివృద్ధి విషయంలో వెనుకబడిన కూలాల పరిస్థితి కూడా అనేక ప్రాంతాల్లో దళితులతో సమానంగాను లేక అంతకన్నా హీనంగాను ఉన్న పరిస్థితి కనిపిస్తుంది. అంటే ఆర్థికంగా వెనులుబాటు ఉన్న కుటుంబాలు సైతం మానావాభివృద్ధిలో శ్రద్ధపెట్టకుపోవడం ఫ్యూడల్ అవశేషాల బలాన్ని వెల్లడిస్తున్నది. ఉత్తరాంధ్రలో దళితుల జనాభా తక్కువ అయినా కులవివక్షలో తీవ్రమైన అణిచివేతకు గురౌతున్నారు. ఈ సామాజిక పరిస్థితిని మార్చేందుకు అవసరమైన వ్యూహం కూడా ఉత్తరాంధ్ర అభివృద్ధిలో ముఖ్య మైన భాగంగా ఉండాలి.

ఉత్తరాంధ్ర అభివృద్ధికి తగిన వ్యూహా లను రూపొందించడం పెద్ద కష్టం ఏమికాదు. ఇప్పటికే అనేక మంది మేధావులు ప్రతిభా వంతమైన ప్రతిపాదనలను ఎన్నింటినో తయారు చేశారు. అసలు సమస్య వాటిని అంగీకరించే టట్లు, అమలుచేసేటట్లు చేయడం. ఇందుకు పౌర సమాజం మేధోపరంగానే కాకుండా క్రియాశీలంగా కూడా ముందుకురావాలి. వివిధ రూపాల్లో కృషిచేయాలి. నాకు తోచిన మేరకు కార్యాచరణకు సంబంధించిన కొన్ని సూచనలను చేస్తున్నాను.

1. మండల, జిల్లా ప్రాంతీయ స్థాయిల వరకు నిర్దిష్టమైన అభివృద్ధి ప్రణాళికలను, డిమాం డ్లను రూపొందించాలి.
2. ఈ ప్రణాళికలు, డిమాండ్లపై పంచాయితీ సభ్యులు, సర్పంచ్ స్థాయి నుండి పార్లమెంట్ స్థాయి సభ్యుల వరకు గల ప్రజాప్రతినిధు లకు అవగాహన కల్పించాలి.
3. ఉత్తరాంధ్ర అభివృద్ధి, ప్రణాళికలపై సాధా రణ ప్రజల్లో చైతన్యం కల్పించాలి. ఇందు కు మేధావులు, పార్టీలు, ప్రజా సంఘాలు, పౌర సంస్థలు, స్వచ్ఛంద సంస్థలను భాగ స్వాములను చేయాలి.
4. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఆలోచించే వ్యక్తులు, సంస్థలు, మేధావులతో విశాలమైన, ప్రజా తంత్ర వేదికను ఏర్పాటు చేయాలి.
5. రాష్ట్ర ప్రభుత్వం, వివిధ పరిపాలక సంస్థ లపై ఒత్తిడి తెచ్చేందుకు అంగీకృత అంశాల ప్రాతిపదికపై ఈ వేదిక సహకారంతో విడి గాను, ఐక్యంగాను ఆందోళనలు చేస్తూ ఉ ద్యమాన్ని ఓపికగా, పట్టుదలగా సాగించాలి.

# సమిష్టి పని విధానం

ఎస్ వీరయ్య



రచయిత సిపిఐ (ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు

సమిష్టి పని విధానం కార్మికవర్గ లక్షణం. అందుకే కార్మికవర్గ పార్టీగా ఉన్న కమ్యూనిస్టు పార్టీ సమిష్టి పని విధానాన్ని అమలు చేస్తుంది. సమిష్టితత్వం కమ్యూనిస్టు పార్టీకి గుండెకాయ లాంటిది. సమిష్టి పని విధానానికి సాధనం వివిధ స్థాయిల్లో పని చేసే కమిటీలు.

**కమిటీల పని విధానం :**

ఆంతరంగిక ప్రజాస్వామ్యానికి గ్యారెంటీ ఉండే విధంగా కమిటీలు పని చేయాలి. కమిటీలో సభ్యుల అభిప్రాయాలు స్వేచ్ఛగా చెప్పనివ్వాలి. వారి అభిప్రాయాల్లో లోపం ఉండవచ్చు. అయినా చెప్పనివ్వాలి. తద్వారా ఆ కమిటీ సభ్యుల అవగాహనా లోపాలు అర్థం చేసుకోడానికి, సరిదిద్దడానికి అవకాశముం టుంది. ఆ అభిప్రాయాలే సరైనవని తేలితే నాయకత్వం లేదా కమిటీ సరిదిద్దుకోడానికి కూడా తోడ్పడుతుంది. అభిప్రాయం స్పష్టంగా చెప్పనివ్వనట్లయితే ఆ కమిటీ సభ్యుల అవగాహనలో ఉన్న లోపాలేమిటో కూడా గమనించే అవకాశం ఉండదు.

కమిటీ, కార్యదర్శివర్గాలు దేని పని అది చేయాలి. అనేక సందర్భాలలో అవసరాల పేరిట, సౌలభ్యం పేరిట కమిటీ స్థానంలో కార్యదర్శివర్గం పని చేస్తూ ఉంటుంది. ఎప్పటికప్పుడు అనివార్యమైన పరిస్థితుల్లో నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందనే అనిపిస్తుంది. కానీ ఇది క్రమంగా కమిటీని నామమాత్రం చేస్తుంది. నిర్ణయాలలో కమిటీ సభ్యుల భాగస్వామ్యాన్ని నిరోధిస్తుంది. ఫలితాల సమీక్షకు మాత్రమే కమిటీలు పరిమితమవుతాయి. అంతేకాదు, కార్యదర్శివర్గం స్థానంలో కార్యదర్శి పనిచేయడం కూడా ఇలాంటిదే. ఇది మరింత నష్టదాయకం కూడా. మొదటి ఉదాహరణలో కనీసం కార్యదర్శి వర్గం స్థాయిలోనైనా పరిమిత సమిష్టితత్వానికైనా అవకాశం ఉంటుంది. రెండవ ఉదాహరణలో అది కూడా ఉండదు. సమిష్టి తత్వాన్ని ఇది బలహీనపరుస్తుంది. గత కొంత కాలంగా కొన్ని స్థాయిల్లో కొన్నిచోట్ల కేంద్రీకరణ పెరిగింది. కింది కమిటీల, కార్యకర్తల, సభ్యుల అభిప్రాయాలు, విమర్శలు నాయకులు శ్రద్ధగా వినటం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. పార్టీలో క్రమంగా కేంద్రీకరణ పెరగడాన్ని ఇవి సూచిస్తాయి. సమిష్టితత్వం ఏమేరకు బలహీన పడితే ఆ మేరకు కేంద్రీకరణ బలపడుతుంది. అంతర్గత ప్రజాస్వామ్యం బలహీనపడుతుంది.

**కేంద్రీకరణ ధోరణులకు కారణాలు :**

కమ్యూనిస్టు పార్టీలో తరతమ స్థాయిల్లో కార్యదర్శిలో కేంద్రీకరణ ధోరణి పెరగడానికి అనేక కారణాలున్నాయి. కార్యదర్శివర్గంలో గానీ, కమిటీలో గానీ, ఇతర సభ్యుల సామర్థ్యం పరిమితమైనప్పుడు నాయకత్వంలో ఈ ధోరణి పెరగవచ్చు. తోటి సభ్యులలో ఉదారవాదం ఉన్నప్పుడు గానీ, అవకాశవాద ధోరణులున్నప్పుడు గానీ కేంద్రీకరణ జరగవచ్చు. తమ పనిలోని లోపాలను ప్రశ్నిస్తారన్న భయం గానీ, వ్యక్తిగత సౌకర్యాల కోసం గానీ, భవిష్యత్తులో అప్పగించే బాధ్యతలను దృష్టిలో ఉంచుకుని గాని అవకాశవాద ధోరణులు వ్యక్తం కావచ్చు. కార్యదర్శివర్గ సమావేశాలు గానీ, కమిటీ సమావేశాలు గానీ సకాలంలో, తరచుగా, సక్రమంగా జరగనప్పుడు కూడా వ్యక్తులే నిర్ణయాలు తీసుకునే పరిస్థితి వస్తుంది.

**కేంద్రీకరణ పెరగడానికి బాధ్యత :**

నాయకత్వంలో కేంద్రీకరణ ధోరణులు పెరుగుదలకు ఆయా స్థాయిల్లో నాయకులు బాధ్యత వహించాలి. అయితే ఈ పొరపాటు ధోరణి పెరుగుదలకు కార్యదర్శిది ఎంత బాధ్యత ఉంటుందో సంబంధిత కమిటీ లేదా కార్యదర్శి వర్గ సభ్యులది కూడా అంతే బాధ్యత ఉంటుంది. టీమ్ లీడర్ ఇష్టాఇష్టాల మీద ఆధారపడి లేదా వారి చొరవ మీదనే ఆధారపడి సమిష్టి పనివిధానం అమలు జరగాలంటే ఆచరణలో అది కేంద్రీకరణకే దారి తీస్తుంది. అందుకే ఇది సమిష్టి బాధ్యత. సమిష్టి పని విధానం అమలు జరిగేటట్టు చూడటంలో ఎవరికి వారు తమ పాత్రను పరిశీలించుకోవటం అవసరం. నిర్ణయాలు సమిష్టిగా జరిగేటట్టు చూడటంలోను, సకాలంలో సమీక్ష చేసేట్టు చూడటంలోను కార్యదర్శితో పాటు తోటి సభ్యులందరూ బాధ్యత వహించాల్సి ఉంటుంది. లోపం జరుగుతున్నప్పుడు సకాలంలో ఆ సమస్యను చర్చకు పెట్టడం కమిటీ లేదా కార్యదర్శివర్గ సభ్యుల బాధ్యత. దీనిని ప్రశ్నించడంగా, ఆటంకపరచడంగా భావిస్తే అది నాయకత్వం లోపం అవుతుంది. దానిని సరిదిద్దడంలో కూడా సమిష్టిగా కృషి చేయాలి. కమిటీ లేదా కార్యదర్శివర్గ సభ్యులు ఈ కృషిలో జయప్రదం కావాలంటే, తగిన చొరవ చూపగలిగే శక్తి రావాలంటే తమకు అప్పగించిన బాధ్యతల్లో శక్తివంచన లేకుండా పని చేయాలి. అప్పుడే ప్రశ్నించేందుకు నైతిక అర్హత కూడా లభిస్తుంది. అంతర్గత ప్రజాస్వామ్యం అమలవుతుంది. సభ్యులు సక్రమంగా పనిచేయనప్పుడు, ప్రశ్నించలేనప్పుడు, పద్ధతులను పట్టించుకోనప్పుడు అది క్రమంగా కార్యదర్శిలో కేంద్రీకరణ ధోరణి బలపడటానికే దారి తీస్తుంది.

**ఆంతరంగిక ప్రజాస్వామ్యం-ప్రయోజనాలు :**

పార్టీలో ఆంతరంగిక ప్రజాస్వామ్యాన్ని సమర్ధవంతంగా అమలు చేయడం వల్ల సభ్యుల ఆలోచనలోనూ, ఆచరణలోనూ చొరవ, సృజనాత్మకత పెరుగుతాయి. పార్టీ శ్రేణులు అన్ని స్థాయిల్లోనూ క్రియాశీలంగా ఉంటారు. చురుకుగా పని చేస్తారు. పార్టీ తప్పొప్పులను తమవిగా భావించి బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తారు. ప్రజలకు నాయకత్వం వహించగల సామర్థ్యం పెరుగుతుంది. పార్టీ పట్ల, ప్రజల పట్ల విశ్వాసంతో, నిబద్ధతతో పనిచేయగలుగుతారు. కష్టకాలంలో పార్టీని అక్కున చేర్చుకుంటారు. పార్టీ కోసం ఎలాంటి త్యాగాలకైనా సిద్ధపడతారు. చైతన్యయుతమైన క్రమశిక్షణను పాటిస్తారు. కేంద్రీకృత నాయకత్వం బలపడుతుంది. ఇవన్నీ పార్టీ బలోపేతం కావడానికి తోడ్పడతాయి. ఆయా రంగాలలో పార్టీ తన శక్తినంతా ప్రదర్శించగలిగే సామర్థ్యం పెరుగుతుంది.

**ఆంతరంగిక ప్రజాస్వామ్యం :**

ఆంతరంగిక ప్రజాస్వామ్యం పట్ల, దానిని ఆచరించడం పట్ల సరైన అవగాహన అవసరం.

> ❝ పార్టీలో ఏ రూపంలోనూ ముఠాతత్వం అనుమతించ రానిది. ముఠాలు గట్టే ప్రయత్నాన్ని సహించకూడదు. ఇది పార్టీని డొల్ల చేస్తుంది. పార్టీ శక్తిసామర్ధ్యాలను బలహీనపరుస్తుంది. పార్టీ శ్రేణుల్లో త్యాగనిరతిని దిగజారుస్తుంది. పార్టీ సభ్యుల మధ్య సౌహార్ద్ర సంబంధాలు, పరస్పర సహకారం, ఆత్మీయత పెంచు కోవాలి. కామ్రేడ్స్ పట్ల సానుభూతితో వ్యవహరిస్తూ వారి తప్పు లను సరిదిద్దాలి. ❞

ఆంతరంగిక ప్రజాస్వామ్యం అంటే పార్టీలో ఐక్యతకు నష్టం జరగని మేరకు స్వేచ్ఛగా చర్చించుకోవడం, అభిప్రాయాలు వెల్లడించడం. శాఖలు లేదా కమిటీలలో నిర్మొహమాటంగా, దాపరికం లేకుండా మాట్లాడాలి. విధానాలు, కర్తవ్యాలు నిర్ణయించడంలో భాగస్వాములు కావాలి. పార్టీ విధానాల ప్రచారంలోనూ, నిర్ణ యాల అమలులోనూ పార్టీ శ్రేణులు నిరంతరం పాల్గొనాలి. వారి స్థాయి పెంచేందుకు నిరం తరం కృషి చేయాలి. తీవ్రమైన విభేదాలు తలెత్తినప్పుడు ఏకాభిప్రాయానికి రావడానికి ప్రయత్నించాలి. తక్షణం నిర్ణయం చేయనట్ల యితే నష్టం జరుగుతుందనుకుంటే తప్ప చర్చల ద్వారా పరిష్కరించేందుకు వీలుగా నిర్ణయాన్ని వాయిదా వేసుకోవాలి. అవసరమయితే పై కమిటీ నాయకత్వ సహకారంతో పరిష్కరించు కోవాలి. అన్ని స్థాయిల్లోను విమర్శను, ఆత్మ విమర్శను ప్రోత్సహించాలి. నాయకత్వాన్ని, కమిటీలనూ, కార్యదర్శివర్గాలను ప్రజాస్వామ్య యుతంగా ఎన్నుకోవాలి. పార్టీలో నిరంకుశ పోకడలు పెరగకుండా అన్ని స్థాయిల్లోనూ ఎడ తెగని పోరాటం జరగాలని పార్టీ నిబంధనావళి స్పష్టమైన దిశా నిర్దేశం చేసింది. దీని ప్రాధాన్య తను అర్థం చేసుకుని అమలు చేయాలి. టీమ్ లీడర్‌లో తగిన సామర్థ్యం లేనప్పుడు నిరంకుశ ధోరణులు పెరగటం అంత సులభం కాదు. తోటి సభ్యులు ప్రశ్నించే అవకాశం ఎక్కువ. సమర్థులనుకున్న నాయకత్వం ఉన్నప్పుడే అనేక విషయాలలో నిరంకుశ ధోరణులు బలపడటా నికి కూడా అవకాశం ఉంటుంది. రష్యా, చైనా వంటి వివిధ కమ్యూనిస్టు పార్టీల అనుభవాలు దీనినే సూచిస్తున్నాయి. సమర్థవంతమైన నాయకత్వం కాబట్టి ఆంతరంగిక ప్రజాస్వామ్యం ఆటోమేటిక్‌గా అమలు జరుగుతుందనుకోవటం సరైంది కాదు. ఇలాంటి సందర్భాలలో ప్రశ్నిం చేందుకు మొహమాటాలు ఎక్కువగా ఉంటాయి. కొన్ని సందర్భాలలో ప్రశ్నించేందుకు ధైర్యం చేయకపోవచ్చు. అందుకు కారణాలు పైన చర్చిం చాము. అందువల్ల ఆంతరంగిక ప్రజాస్వామ్యం అమలు జరపడానికి చైతన్యయుతంగా కృషి చేయాలి. పట్టుదలను ప్రదర్శించాలి.

పార్టీలో ఏ రూపంలోనూ ముఠాతత్వం అనుమతించరానిది. ముఠాలు గట్టే ప్రయత్నాన్ని సహించకూడదు. ఇది పార్టీని డొల్ల చేస్తుంది. పార్టీ శక్తిసామర్ధ్యాలను బలహీనపరుస్తుంది. పార్టీ శ్రేణుల్లో త్యాగనిరతిని దిగజారుస్తుంది. పార్టీ సభ్యుల మధ్య సౌహార్ద్ర సంబంధాలు, పరస్పర సహకారం, ఆత్మీయత పెంచుకోవాలి. కామ్రేడ్స్ పట్ల సానుభూతితో వ్యవహరిస్తూ వారి తప్పులను సరిదిద్దాలి. వారి సామర్థ్యం పెంపు దలకు సహకరించాలి. సభ్యుల, కార్యకర్తల పనిని పరిశీలించేటప్పుడు చెదురుమదురు ఘటనలను బట్టి కాకుండా పార్టీ సేవలో వారి మొత్తం కృ షిని దృష్టిలో ఉంచుకుని పరిశీలించాలి. వివిధ ప్రజా సంస్థలకు ఎన్నికైన పార్టీ సభ్యుల, కార్య కర్తల పనిని పార్టీ కమిటీలు, శాఖలు పర్యవేక్షిం చాలి. నిరంతరం తగిన సూచనలు చేస్తూ వారికి సహాయపడాలి. వారి పనిని సమీక్షిస్తూ తోడ్పాటు నందించాలి. అన్ని స్థాయిల్లోనూ పార్టీ క్రమ శిక్షణకు లోబడి పనిచేయాలి.

ఎలాంటి సమస్యల మీదనైనా ఎడతెగని చర్చలు చేయటమంటే ప్రజాస్వామ్యాన్ని దుర్వి నియోగం చేయటమే. వక్రీకరించటమే. విధాన పరమైన సమస్యల మీద కేంద్రకమిటీ నిర్ణయిం చిన సందర్భాలలో ఆంతరంగిక చర్చను నిర్వహి స్తుంది. మూడవ వంతు పార్టీ సభ్యులకు ప్రాతి నిధ్యం వహించే రాష్ట్ర కమిటీలు కోరినప్పుడు కూడా ఆంతరంగిక చర్చకు కేంద్రం పూను కుంటుంది. కేంద్ర కమిటీ పర్యవేక్షణలోనే ఈ ఆంతరంగిక చర్చలు జరుగుతాయి. కిందిస్థాయి లో కూడా వివిధ సందర్భాలలో ఆంతరంగిక చర్చలకు ఈ సూత్రాలే వర్తిస్తాయి. పార్టీ నిబంధనావళికి పార్టీ సభ్యులెవరైనా సవరణలు ప్రతిపాదించవచ్చు. పార్టీ అఖిలభారత మహా సభకు ముందు నిర్దిష్ట సవరణలు కేంద్ర కమిటీకి రాతపూర్వకంగా పంపించాలి. వాటిపైన మహా సభ నిర్ణయం తీసుకుంటుంది.

**అరాచకానికి దారి తీసే అంశాలు :**

పార్టీలో ప్రజాస్వామ్యం అరాచకంగా మారకుండా చూడాలి. అవసరమైన మేరకు కాకుండా నిరంతర చర్చోపచర్చలు అవాంఛ నీయం. వాగ్వివాదం, అరచుకోవటం, తిట్టుకోవ టం అరాచకానికే దారితీస్తాయి. ఐక్య కృషికి ఇవి ఆటంకం కలిగిస్తాయి. పోరాట పటిమను దెబ్బతీస్తాయి. ఈ లక్షణాలు పార్టీలో బలపడితే పార్టీ ద్రోహులకూ, వ్యతిరేకులకూ, అవకాశ వాదులకు పార్టీలో చొరబడేందుకు అవకాశం ఏర్పడుతుంది. తామున్న శాఖల్లో లేదా పార్టీ కమిటీలలో కాకుండా వాటికి వెలుపల తమ శాఖకు లేదా తమ కమిటీకి సంబంధం లేని వ్యక్తులతో ఆంతరంగిక విషయాలు చర్చించడం కూడా అరాచకానికే దారి తీస్తుంది. పార్టీ జనరల్ బాడీ సమావేశాలలో కూడా పై కమిటీ నిర్ణయాలు, పార్టీ విధానాలు వివరించటం, సందేహాలను నివృత్తి చేయటం మాత్రమే చేయాలి. అభిప్రాయాల వ్యక్తీకరణకు, చర్చలకు అది వేదిక కాదు. వాటికి అనుమతిస్తే అరాచకానికి దారి తీస్తుంది.

కేంద్రీకరణ అంటే సరైన భావాలను కింది నుండి క్రోడీకరించటం, పైనుండి కార్య కలాపాలకు మార్గదర్శకత్వం వహించడంగా అర్థం చేసుకోవాలి. అధికారం చెలాయిం చటంగా భావించకూడదు. అందుకు ప్రయత్నిం చకూడదు. అందుకే కేంద్రీకరణ నిరంకుశధోరణు లకు, పెత్తందారీతనానికి దారి తీయ కుండా నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలి.

**నిరంకుశత్వ లక్షణాలు :**

శాఖలు, కమిటీలలో చర్చలకు తగిన అవకాశం ఇవ్వకపోవటం నిరంకుశత్వానికే దారితీస్తుంది. సభ్యులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేయకుండా మధ్యలో అడ్డుపడటం కూడా సరైంది కాదు. విమర్శను స్వీకరించాలి. ఆహ్వానించాలి, ప్రోత్సహించాలి కూడా. ఇందు కు విరుద్ధంగా వ్యవహరించడం నిరంకుశ లక్షణాలు బలపడటానికి దారితీస్తుంది. నాయ కత్వం తన లోపాలు వ్యక్తమయ్యే సమస్యలను దాటవేయటం, చర్చకు పెట్టకపోవటం, పరిష్క రించకపోవటం, వాయిదా వేయటం కూడా ఇలాంటివే. మొత్తంమీద ప్రజాస్వామ్యం మీద ఆధారపడే కేంద్రీకృత నాయకత్వం, కేంద్రీకృత నాయకత్వం కింద ఆచరించే ప్రజాస్వామ్యంగా ఉండాలి. ఇదే కేంద్రీకృత ప్రజాస్వామ్యం సారాంశం. అందుకే కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాల లోతుపాతుల పట్ల అవగాహన పెంచుకోవడం అత్యంత అవసరం. ❋

# దక్షిణ చైనా సముద్ర సమస్య అమెరికా వ్యూహం



రచయిత సిపిఐ (ఎం) రాష్ట్రకమిటీ సభ్యులు

**ఎస్ వెంకట్రావు**

ఇటీవలి కాలంలో దక్షిణ చైనా సముద్ర ప్రాంతం అంతర్జాతీయ వివాదాలకు, సైనిక వ్యూహ ప్రతివ్యూహాలకు కేంద్రంగా మారింది. దక్షిణ చైనా సముద్ర ప్రాంతం చారిత్రకంగా తమదేనని చైనా వాదిస్తుంటే దానిపై తమకూ ఆధిపత్యం ఉందని ఆ ప్రాంతంలోని ఇతర దేశాలు పేర్కొంటున్నాయి. ఈ ప్రాంతంలోని కొన్ని దీవులపై చైనా-ఫిలిప్పీన్స్ మధ్య నడుస్తున్న వివాదంలో గత నెల హేగ్‌లోని అంతర్జాతీయ ట్రిబ్యునల్ చైనాకు వ్యతిరేకంగా తీర్పు చెప్పడంతో అమెరికా దాని మిత్ర దేశాలు చైనాకు వ్యతిరేకంగా ప్రచారం ప్రారంభించాయి. ట్రిబ్యునల్ తీర్పును చైనా తిరస్కరిస్తూ ఈ సమస్యను తత్సంబంధ దేశాలతో ద్వైపాక్షికంగా తేల్చుకుంటామనీ, దీనిలో ఇతర శక్తుల జోక్యం సహించబోమని అమెరికాను పరోక్షంగా ఘాటుగా హెచ్చరించింది. సమస్య ప్రకటనలు, హెచ్చరికలతో ఆగలేదు. ఒకవైపు అమెరికా, దాని మిత్రుల సైనిక సన్నాహాలు, దానికి ప్రతిగా చైనా సైనిక విన్యాసాల వరకు పోయింది.

### చారిత్రక సమస్య

దక్షిణ చైనా సముద్ర ప్రాంతం, అందులోని దీవుల సముదాయాల సమస్య చారిత్రకమైనది. చైనాను పాలించిన సియా, హాన్ వంశ పాలకుల నుండి ఇది తమ భూభాగంలో ఉన్నట్లు చారిత్రకాధారాలు చూపిస్తోంది చైనా ప్రభుత్వం. 1947లో నాడు చైనాను పరిపాలించిన చాంగ్ కై షెక్ ప్రభుత్వం తొమ్మిది డాష్ లైన్లతో ఈ ప్రాంతాన్ని చైనా భూ భాగంగా గుర్తించింది. తరువాత 1949లో కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో చైనా పీపుల్స్ రిపబ్లిక్ ఆవిర్భవించిన తరువాత చైనా ఈ ప్రాంతాన్ని సర్వే చేసి 291 దీవులు, కొండల మ్యాపును తయారు చేసింది. అయితే ఈ ప్రాంతంలోని దీవులపై ఆధిపత్యం తమకూ ఉందని వియత్నాం, మలేసియా, బ్రూనీ, ఫిలిప్పీన్స్ వాదిస్తూ వస్తున్నాయి. ఏ దేశానికి ఆ దేశం తమవని చెప్పుకుంటున్న దీవులపై నిర్మాణాలు ప్రారంభించి, కొనసాగిస్తున్నాయి.

దక్షిణ చైనా సముద్ర ప్రాంతంలో చిన్న చిన్న ద్వీపాలతో పాటు సముద్రంలో మునిగి ఉన్న కొండలు, పగడపు దీవులు, ఇసుక మేటలు వగైరాలు చాలా ఉన్నాయి. వీటిలో స్ప్రాట్లీ దీవులు, ప్రటాస్ దీవులు, పరాసెల్ దీవులు, మాక్‌లెస్‌ఫీల్డ్ బాంక్‌తో బాటు చైనా తీరంలో కొన్ని, వియత్నాం, బ్రూనీ, తైవాన్, ఫిలిప్పీన్స్ తీరాల్లో కొన్ని దీవులున్నాయి. ఈ దీవుల్లో ఎక్కడా మూలవాసులైన ప్రజలు లేరు. అనేక దీవులు సముద్రపు పోటు వచ్చినప్పుడు నీట మునిగిపోతాయి. ఇటీవలి వరకు ఈ దీవులపై చేపల వేట మినహా పెద్దగా ఆసక్తి ఉండేది కాదు. అయితే ఈ దీవుల కింద పెద్ద ఎత్తున చమురు సహజవాయు సంపద ఉన్నదని తేలడం, ఈ ప్రాంతం ప్రధానమైన వాణిజ్య నౌకా మార్గంలో ఉండడం, అమెరికా యుద్ధ వ్యూహంలో వచ్చిన మార్పుల రీత్యా ఈ ప్రాంతం కీలకంగా మారడంతో దీనికి అంతర్జాతీయ ప్రాధాన్యత పెరిగింది.

కొన్ని దశాబ్దాలుగా ఈ ప్రాంతంలో దీవుల నిర్మాణం, ఉన్న దీవులపై నిర్మాణాలు జరపడం సాగిపోతూనే ఉంది. ముఖ్యంగా వియత్నాం 21 దీవులపైనా, ఫిలిప్పీన్స్ ఎనిమిది దీవులపైనా తమ దేశ పతాకాలు పాతి నిర్మాణాలు సాగిస్తున్నాయి. వియత్నాం, తైవాన్, ఫిలిప్పీన్స్‌లు కొన్ని దీవులపై సైనిక బలగాలను కూడా దించాయి. అయితే ఐక్యరాజ్య సమితి సముద్ర చట్టం (యుఎన్‌సిఎల్‌ఓఎస్-అంక్లోస్) నిబంధననుసరించి వియత్నాం మాత్రం నిర్మించబడిన దీవులు (మునిగి ఉన్న ఇసుక తిన్నెలు, పగడపు దీవులు, ఇతర భూభాగాలు)పై సైన్యాన్ని దించలేదు. చైనా ఈ పోటీలోకి ఆలస్యంగా వచ్చింది. అయితే గత రెండు సంవత్సరాలుగా అది పెద్ద ఎత్తున దీవుల నిర్మాణం ప్రారంభించింది. ఎంతగా అంటే అన్ని దేశాలూ కలిసి నిర్మించిన దీవుల వైశాల్యం కంటే ఈ రెండేళ్లలో అది ఎక్కువ వైశాల్యంలో నిర్మించింది. తన దీవులను కాపాడుకేనేందుకు సైనిక సంపత్తిని కూడా సమకూర్చుకుంది.

### వివాదాలు

వివిధ దేశాలు చారిత్రకంగా దీవులపై ఆధిపత్యం ప్రకటించుకోవడం వల్లా, సముద్ర తీరం నుండి 200 నాటికల్ మైళ్ల వరకు సముద్ర జలాలు ఆయా దేశాల ఆర్థిక జోన్లుగా ఉంటాయని ఐక్యరాజ్య సమితి సముద్ర చట్టం ప్రకటించినందువల్లా ఈ ప్రాంతం చాలా సంక్లిష్టంగా మారిపోయింది. ఈ ఆర్థిక జోన్లు ఒకదానిపై మరొకటి ప్రతిష్ఠితం (ఓవర్‌లాప్) కావడంతో అనేక దీవులపై ఒకటికి మించి దేశాలు ఆధిపత్యం ప్రకటించుకున్నాయి. 1970 తరువాత దీనిపై దేశాల మధ్య ఘర్షణలు కూడా జరుగుతూ వస్తున్నాయి. 2012 నుండి ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. అన్నీ చట్టబద్ధంగానే మాట్లాడుతున్నాయి. ఉదాహరణకు: తొమ్మిది గీతల లైను (నైన్ డాష్ లైన్) ప్రకారం చైనా ఆధిపత్యం ప్రకటించుకున్న దీవుల్లో కొన్ని బ్రూనీ, మలేసియా, ఫిలిప్పీన్స్, మలేసియా, వియత్నాం, తైవాన్ తమవేనని చెబుతున్నాయి. వియత్నాం తీరంలోని అనేక దీవులపై బ్రూనీ, చైనా, తైవాన్, ఫిలిప్పీన్స్, మలేసియాలు ఆధిపత్యం కోరుతున్నాయి. పక్క పేజీలోని పట్టిక చూసినప్పుడు ఈప్రాంతంలో సముద్రం యొక్క సంక్లిష్టత అర్థమవుతుంది.

### అమెరికా రంగ ప్రవేశం

దక్షిణ చైనా సముద్ర ప్రాంతంలో రెండవ ప్రపంచ యుద్ధ కాలం నుండి అమెరికా నౌకా దళం తిష్టవేసి ఉంది. భవిష్యత్తులో కూడా అది అక్కడ ఉంటుందని అమెరికా రక్షణ మంత్రి ఆష్ కార్టర్ ఇటీవల ప్రకటించారు. అయితే ఈ ప్రాంత దీవులపై ఇతర దేశాలు దీవులను నిర్మించుకుంటున్నా, దీవులపై నిర్మాణాలు సాగిస్తున్నా అమెరికా పట్టించుకోలేదు. కానీ ఇటీవల చైనా నిర్మాణాలు చేపట్టే సరికి అది పెద్ద ఎత్తున నిరసన గళం విప్పింది. తన కూటమిలో భాగంగా ఉ

> **"బరాక్ ఒబామా రెండోసారి అమెరికా అధ్యక్షునిగా ఎన్నికైన వెంటనే 'ఆసియా కేంద్రం' అనేది తన విదేశాంగ విధానంలో కీలకంగా ఉంటుందని ప్రకటించారు. 'ఆసియా కేంద్రం' అంటే అమెరికా ప్రయోజనాలను ఐరోపా, మధ్య ప్రాచ్యం నుండి ఆసియాకు మార్చడమే. అంటే అమెరికా విధానాన్ని వ్యూహాత్మకంగా పునఃస్థాపన చేయడం."**

న్న ఫిలిప్పీన్స్ ప్రభుత్వం చేత అంతర్జాతీయ ట్రిబ్యునల్‌లో పిటిషన్ వేయించింది. ద్వైపాక్షిక చర్చల ద్వారా పరిష్కరించుకోవలసిన విషయాన్ని అంతర్జాతీయ ట్రిబ్యునల్‌కు తీసుకువెళ్లడాన్ని వ్యతిరేకిస్తూ చైనా ఈ పిటిషన్‌ను తిరస్కరించింది. దాంతో ట్రిబ్యునల్‌లో ఏకపక్షంగా సాగిన వాదనల్లో చైనాకు వ్యతిరేకంగా తీర్పు వెలువడింది.

ఈ ప్రాంతంపై రెండో ప్రపంచ యుద్ధ కాలం నుండీ ఉన్న తన ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు గాను అమెరికా ఇటీవల ఇక్కడకు తన యుద్ధ నౌక యుఎస్‌ఎస్ ఫోర్ట్‌వర్త్‌ను పంపింది. ఫీరీ పగడపు దీవులపై చైనా నిర్మిస్తున్న దీవి మీదికి గూఢచారి హెలీకాప్టర్లను, విమానాలనూ పంపింది. ఈ ప్రాంతంలో నౌకాయాన స్వాతంత్రాన్ని కాపాడేందుకే తాను ఈ చర్యలు చేపట్టానని అమెరికా చెబుతున్నప్పటికీ దానికి ఇంతకు మించిన వ్యూహం ఉంది. ఈ పేరుతో అది ఈ ప్రాంతంలో తన మిత్ర దేశాలైన ఫిలిప్పీన్స్, తైవాన్, జపాన్‌ల సైనిక గూఢచారి సామర్థ్యం పెంచడానికి పూనుకుంది. అంతే కాకుండా భారత్‌ను కూడా ఈ వివాదంలోకి దింపుతోంది.

### అమెరికా వ్యూహం

దక్షిణ చైనా సముద్ర వివాదంలో అమెరికా జోక్యం యొక్క ఉద్దేశ్యాన్ని గురించి తెలుసుకోవాలంటే ఒబామా ప్రభుత్వం ప్రకటించిన "ఆసియా కేంద్ర" (ఆసియా పైవోట్) విధానం గురించి అర్థం చేసుకోవాలి. బరాక్ ఒబామా రెండోసారి అమెరికా అధ్యక్షునిగా ఎన్నికైన వెంటనే "ఆసియా కేంద్రం" అనేది తన విదేశాంగ విధానంలో కీలకంగా ఉంటుందని ప్రకటించారు. 'ఆసియా కేంద్రం' అంటే అమెరికా ప్రయోజనాలను ఐరోపా, మధ్య ప్రాచ్యం నుండి ఆసియాకు మార్చడమే. అంటే అమెరికా విధానాన్ని వ్యూహాత్మకంగా పునఃస్థాపన చేయడం. అంటే గతంలో అమెరికా ఆర్థిక, సైనిక, వ్యూహాత్మక కేంద్రీకరణ అంతా ఇరాక్, ఆఫ్ఘనిస్థాన్‌ల మీద ఉండేది. దాన్ని ఇప్పుడు ప్రధానంగా దక్షిణాసియా మీదికి మళ్లిస్తారన్నమాట. ఎందుకు? ఎందుకంటే ఆర్థిక, సాంకేతిక రంగాల్లో శీఘ్రంగా అభివృద్ధి చెందుతూ అడుగడుగునా అమెరికా ఆధిపత్యానికి చెక్ పెడుతున్న చైనాను దెబ్బ తీసేందుకు.

'ఆసియా కేంద్రం' అన్న విధానం ప్రకటించిన వెంటనే అమెరికా ఉత్తర ఆస్ట్రేలియాలో అదనంగా 2,500 మంది నౌకాదళాన్ని మోహరించింది. 20 ఏళ్ల తరువాత మొదటి సారిగా ఫిలిప్పీన్స్‌లోని సుబిక్ బేలో అమెరికా సైనిక మోహరింపులు జరిపింది. జపాన్, దక్షిణ కొరియాల్లో అణ్వాయుధ నిల్వలను పెంచింది. పసిఫిక్ మహా సముద్రానికి అటూ ఇటూ ఉన్న దేశాలన్నిటినీ కలిపి ట్రాన్స్-పసిఫిక్ పార్టనర్‌షిప్ (టిపిపి) పేరుతో ఒక స్వేచ్ఛా వాణిజ్య కూటమిని నిర్మించింది. 12 దేశాల ఈ కూటమిలో చైనాను చేర్చుకోలేదు. దక్షిణ చైనా సముద్ర వివాదాలతో బాటు, చైనాకూ, జపాన్‌కు మధ్యనున్న సుంకోకు/దియాఓయుతై దీవుల వివాదాన్ని ఉపయోగించుకుని ఆ ప్రాంత దేశాలను చైనాకు వ్యతిరేకంగా కూడదీయడమే అమెరికా లక్ష్యం. ఒబామా ప్రభుత్వ ఆసియా కేంద్ర విధానం ముఖ్యోద్దేశం చైనాను నిలువరించడమే.

### అమెరికా వ్యూహంలోకి భారత్

అమెరికా తన చైనా వ్యతిరేక యుద్ధ వ్యూహంలోకి నెమ్మదిగా భారత్‌ను కూడా లాగుతోంది. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు 2005లో అమెరికా భారత రక్షణ ఒప్పందం కుదుర్చుకుంది. రెండు దేశాల మధ్య కుదిరిన అణు ఒప్పందం తరువాత ఈ సైనిక బంధాన్ని మరింత పటిష్ట పరుచుకుంది. ఇటీవల భారత్‌తో లాజిస్టిక్ సపోర్ట్ (అమెరికా సైనిక వాహనాలకు ఇంధనం నింపడం, ఇతర సదుపాయాలు చేయడం) ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. ఈ ఒప్పందాలన్నిటి లక్ష్యం ఏమంటే ఆసియాలోని

### వివాదాల సంగ్రహరూపం

| వివాద ప్రాంతం | ఆధిపత్యం కోరుతున్న దేశాలు | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | బ్రూనీ | కాంబోడియా | చైనా | ఇండోనేషియా | మలేసియా | ఫిలిప్పీన్స్ | సింగపూర్ | తైవాన్ | వియత్నాం |
| 9 గీతల లైను ప్రాంతం | * | | * | * | * | * | | * | * |
| వియత్నాం తీరం | * | * | * | | * | * | | * | * |
| బోర్నియో ఉత్తరం తీరం | * | | * | | * | * | | * | * |
| దక్షిణ చైనా సముద్ర దీవుల | * | | * | | * | * | | * | * |
| నాతునా దీవులఉత్తర సముద్రం | | * | * | * | * | | | * | * |
| పోలవాన్ పశ్చిమ సముద్రం | * | | * | | * | * | | * | * |
| సభా ప్రాంతం | | | | * | * | * | | | |
| లూజాన్ జలసంధి | | | * | | * | * | | | |
| పెడ్రా బ్రాంకా ప్రాంతం | | | | | | * | | | |


హిందూ మహా సముద్ర ప్రాంతంలో ఒక ప్రధాన దేశంగా ఉన్న భారత్‌ను తన యుద్ధ వ్యూహంలో జూనియర్ భాగస్వామిగా మార్చుకోవడమే. భవిష్యత్తులో అమెరికా ఈ ప్రాంతంలో యుద్ధం చేయాల్సి వస్తే భారత భూ భాగాన్ని ఉపయోగించుకోడానికి కావలసిన ఏర్పాట్లు చేసుకుంటున్నది. 2014లో నరేంద్ర మోడీ ప్రధాని అయిన తరువాత అమెరికా ముందు మోకరిల్లే విధానాలు మరింత ఉధృతమయ్యాయి. దక్షిణ చైనా సముద్ర వివాదంపై అంతర్జాతీయ ట్రిబ్యునల్ తీర్పు ఇచ్చిన వెంటనే ఆ తీర్పును ముందుగా ఆహ్వానించిన వాటిలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ఒకటి. మోడీ అధికారంలోకి వచ్చింది మొదలు రెండు దేశాల మధ్య సైనిక బంధం మరింత పెరిగింది. గుజరాత్ ముఖ్యమంత్రిగా మోడీని అమెరికాలోకి అనుమతించని అమెరికా ప్రభుత్వం ఒబామా పదవీ ప్రమాణ స్వీకారానికి ఆయనను ముఖ్య అతిథిగా ఆహ్వానించింది. మోడీ తన రెండేళ్ల పదవీ కాలంలో ఏడు సార్లు ఒబామాను కలుసుకున్నారు. ఈ కాలంలోనే అమెరికాతో అనేక సైనిక ఒప్పందాలు కుదుర్చుకున్నారు. దీంతో బాటు "ఆసియా పసిఫిక్, హిందూమహా సముద్ర ప్రాంతానికి సంయుక్త వ్యూహాత్మక దార్శనిక పత్రం"పై రెండు దేశాలూ సంతకాలు చేశాయి. దీనిలోని ప్రధాన అంశం ఏమంటే రెండు దేశాలు కలిసి ఈ ప్రాంతంలోని భద్రతకు భరోసా ఇస్తాయి. ఈ ప్రాంతంలో నౌకా యాన, విమాన యాన స్వాతంత్ర్యాన్ని కాపాడ్డం, ముఖ్యంగా దక్షిణ చైనా సముద్ర ప్రాంతంలో... అని ఈ ఒప్పందంలో పేర్కొనడం విశేషం. ఈ ఒప్పందాలకు అనుగుణంగానే భారత్ అమెరికాలు సంయుక్తంగానూ, ఇతర 'మిత్ర దేశాలతో' కలిసి పలుసార్లు సైనిక విన్యాసాలు నిర్వహించాయి.

## చైనా ప్రతివ్యూహం

అమెరికా తనకు వ్యతిరేకంగా ఉచ్చు బిగిస్తున్న రీత్యా చైనా ప్రతి వ్యూహాలకు పదును పెట్టింది. ముఖ్యంగా దక్షిణ చైనా సముద్ర ప్రాంత సమస్యను ఉపయోగించుకుని చిన్న చిన్న దేశాలను కూడదీయడానికి అమెరికా చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు చైనా ఆ దేశాలతో ద్వైపాక్షిక చర్చలకు దిగింది. వియత్నాం, ఫిలిప్పీన్స్, బ్రూనీ, మలేసియా మొదలైన దేశాలన్నిటితో చైనా చర్చలు జరుపుతోంది. వాస్తవానికి ఈ ప్రాంతంలోని దేశాల్లో చైనా పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టింది. అభివృద్ధి ప్రాజెక్టులకు తోడ్పడుతోంది. అందువల్ల ఈ దేశాలు అంత త్వరగా అమెరికా మాట విని చైనా వ్యతిరేకత కొనితెచ్చుకోడానికి సిద్ధంగా లేవు. ఉదాహరణకు ఫిలిప్పీన్స్‌ను తీసుకుంటే ఈ ఏడాది మార్చి 30న అమెరికా ఒత్తిడితో చైనాకు వ్యతిరేకంగా అంతర్జాతీయ ట్రిబ్యునల్‌కు వెళ్లింది అదే. ఆ మరుసటి నెలలోనే అమెరికా అధ్యక్షుడు ఒబామా ఫిలిప్పీన్స్ వెళ్లి దానితో 'పొడిగించబడిన రక్షణ సహకార ఒప్పందం' (ఆడిసిఎ) చేసుకున్నాడు. 1951నుండి రెండు దేశాల మధ్య ఉన్న రక్షణ ఒప్పందానికి ఇది పొడిగింపన్న మాట. వాస్తవానికి 20 ఏళ్ల క్రితం వరకు అమెరికాకు ఉపగ్రహదేశంగా ఫిలిప్పీన్స్ ఉండేది. సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా సుబిక్ బే లో అమెరికా పెద్ద సైనిక స్థావరాన్ని నిర్మించింది. నిరంకుశ ఆక్వినో ప్రభుత్వంపై తిరుగుబాటు రావడంతో అక్కడ నుండి అమెరికా వైదొలగింది. మళ్లీ ఇన్నాళ్ల తరువాత ఇప్పుడు సుబిక్ బేలో చైనాకు వ్యతిరేకంగా సైన్యాన్ని దించింది. అయితే చైనా దౌత్యంతో పరిస్థితి ఇప్పుడు పూర్తిగా మారిపోయింది. కొత్తగా ఎన్నికైన ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు రోడ్రిగో డ్యూటెర్టె అమెరికాతో తమ దేశం సైనిక సంబంధాలను తెంచుకుంటున్నట్లు ప్రకటించారు. ఇటీవల వియత్నాం పర్యటనలో ఆయన ఈ విషయాన్ని ప్రకటించడం విశేషం. ఎందుకంటే వియత్నాంకి

(మిగతా 34వ పేజీలో)

"వియత్నాం, ఫిలిప్పీన్స్, బ్రూనీ, మలేసియా మొదలైన దేశాలన్నిటితో చైనా చర్చలు జరుపుతోంది. వాస్తవానికి ఈ ప్రాంతంలోని దేశాల్లో చైనా పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టింది. అభివృద్ధి ప్రాజెక్టులకు తోడ్పడుతోంది. అందువల్ల ఈ దేశాలు అంత త్వరగా అమెరికా మాట విని చైనా వ్యతిరేకత కొనితెచ్చుకోడానికి సిద్ధంగా లేవు."




దక్షిణ చైనా సముద్రంలో వివిధ దేశాలు తమవేనని చెబుతున్న ప్రాంతాలు గీతల్లో

# ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ : 'మేక్ ఇన్ ఇండియా'



రచయిత మార్క్సిస్టు మాసపత్రిక బాధ్యులు

ఎ కోటిరెడ్డి

ప్రభుత్వం 2014 సెప్టెంబరులో "మేక్ ఇన్ ఇండియా" కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ సంవత్సరం సెప్టెంబరు నెల 25వ తేదీకి "మేక్ ఇన్ ఇండియా" ప్రారంభమై రెండు సంవత్సరాలు పూర్తయాయి. ఈ కార్యక్రమం ద్వారా దేశాన్ని ప్రపంచ పారిశ్రామికోత్పత్తి కేంద్రంగా తయారు చేస్తా మని, ఎగుమతులను పెంచుతామని, నిరుద్యో గులకు ఉపాధి కల్పిస్తామని, దేశ ఆర్థికాభివృద్ధిని పరుగులు తీయిస్తామని ప్రభుత్వం చెప్పింది. కాలం చెల్లిన విధానాలను, పద్ధతులను పునర్వ వస్థీకరించటం, వ్యాపార భాగస్వాములను ఆదేశించటం కాక కనీస ప్రభుత్వం, గరిష్ట పాలన గా మార్పుతీసుకు వస్తామని, తయారీ రంగం వాటాను కనీసం 25 శాతానికి పెంచుతామని లక్ష్యంగా ప్రకటించారు. డిసెంబరు 25వ తేదీన వర్క్‌షాపు జరిపి, 25 రంగాలలో పెట్టుబడులు, ఉత్పత్తిని పెంచటానికి ఒక సంవత్సరం, మూడు సంవత్సరాల ప్రణాళికలను రూపొందించారు. ప్రభుత్వం ఎంచుకున్న రంగాలలో ఆటోమొబైల్, ఆటోమొబైల్ కాంపొనెంట్స్, వైమానిక రంగం, బయో టెక్నాలజి, కెమికల్స్, నిర్మాణం, రక్షణ ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్ సిస్టమ్స్, ఫుడ్ ప్రాసెసింగ్, ఐటి అండ్ బిపియం, ఎలక్ట్రానిక్ టెక్నాలజి, మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్, చర్మ ఉత్ప త్తులు, మైనింగ్, ఆయిల్ అండ్ గ్యాస్, ఫార్మ స్యూటికల్స్, పోర్ట్స్ అండ్ షిప్పింగ్, రైల్వేలు, పునరుత్పాదక ఇంధనం, రోడ్స్ అండ్ హైవేస్, స్పేస్, టెక్స్‌టైల్స్ అండ్ గార్మెంట్స్, థర్మల్‌పవర్, టూరిజం అండ్ హాస్పిటాలిటి రంగాలు ఉ న్నాయి. ప్రభుత్వం ప్రకటించిన లక్ష్యాలను, రెండు సంవత్సరాల ఆచరణను చూస్తే ప్రకటిత లక్ష్యా లకు, ఆచరణకు మధ్య అంతరం స్పష్టమౌతుంది.

'మేక్ ఇన్ ఇండియా'తో జిడిపిని 8 శాతానికిపైగా పెంచి, రానున్నకాలంలో 10 శాతం దాటిస్తామని చెప్పారు. కాని 2015-16లో ఆర్థికాభివృద్ధి 7.6 శాతానికి పరిమిత మైంది. ఈ సంవత్సరం మొదటి త్రైమాసికలో జిడిపి పెరుగుదల 7.1 శాతంతో మరింత నిరాశాజనకంగా ఉన్నది. జులై మాసంలో పారిశ్రామిక రంగం 2.4 శాతం ప్రతికూలా భివృద్ధిని నమోదు చేసింది. తయారీ రంగం 3.4 శాతం, ప్రధాన పరిశ్రమలు 12 శాతం ప్రతికూలాభివృద్ధిని నమోదు చేశాయి. కాపిటల్ గూడ్స్ పరిశ్రమ జూన్‌లో 16.5 శాతం, జులైలో 29.6 శాతం ప్రతికూలాభివృద్ధిని నమోదు చేసింది. ఎగుమతుల తగ్గుదల కొనసాగుతున్నది. 2014-15లో ఎగుమతులు 15.8 శాతం తగ్గి 261.1 బిలియన్ డాలర్లకు పరిమితం కాగా, 2015-16లో కూడా అదేస్థాయిలో ఉన్నాయి. ఎగుమతులు తగ్గటానికి ప్రపంచ ఆర్థికమాంద్యా న్ని కారణంగా చెబుతున్నారు. ఆర్థికమాంద్యం కారణమైతే "మేక్ ఇన్ ఇండియా" కార్యక్రమం ద్వారా సాధించిందేమిటి? ప్రపంచబ్యాంకు, ఐయంయఫ్, అంతర్జాతీయ ద్రవ్యసంస్థలు వెనుక బడిన దేశాలపై విధిస్తున్న ఆంక్షలను మన దేశంలో విశ్వాసపాత్రంగా అమలు చేయటం కోసం "మేక్ ఇన్ ఇండియా" కార్యక్రమం ఉ ద్దేశించబడింది. ఆ విషయం వెల్లడయితే ప్రజలలో వ్యతిరేకత వస్తుందని దానిని "మేక్ ఇన్ ఇండియా"పేరుతో చలామణి చేస్తున్నారు. "మేక్ ఇన్ ఇండియా" పేరుతో ఆర్థిక సంస్కరణల అమలులో పురోభివృద్ధిని అంచనా వేయటానికి ప్రపంచబ్యాంకు రూపొందించిన " ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్"లో విధించిన షరతులను అమలు చేస్తున్నారు. అందువలనే ఈ కార్య క్రమం అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడులకు ఉ పయోగపడుతుంది మినహా మనదేశ ఆర్థికాభి వృద్ధికి ఉపయోగపడదు. కాబట్టే ఆర్థికమాంద్యం కారణంగా ఎగుమతులలో ఏర్పడిన కనీస తగ్గుదలను కూడా భర్తీచేయలేని స్థితిలో ఈ కార్యక్రమం ఉన్నది. సరళీకరణ విధానాలను వేగంగా అమలు చేస్తూ "ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్" ర్యాంకులలో పైకి ఎగబాకటానికి ప్రభుత్వం చురుకుగా ప్రయత్నం చేస్తున్నది.

### ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ర్యాంకుల కోసం వెంపర్లాట

'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో ర్యాంకులివ్వటానికి ప్రపంచబ్యాంకు 10 అంశాలను ప్రాతిపదికగా తీసుకున్నది. దేశంలో కొత్తగా పరిశ్రమలు, వ్యాపారాన్ని ప్రారంభించ టానికి, నిర్మాణ సంబంధ అనుమతులు, విద్యుత్ కనెక్షన్ పొందటానికి, ఆస్థి రిజిస్ట్రేషన్ చేయించు కోవటానికి, రుణం పొందటానికి పట్టేకాలం, అయ్యేఖర్చు, పరిశ్రమలలోని మైనారిటి వాటా దారుల ప్రయోజనాలను కాపాడటానికి తీసుకొనే చర్యలు, ఎన్ని రకాల పన్నులు చెల్లించాలి, పన్నుమొత్తం, పన్ను చెల్లించటానికి పట్టేకాలం, విదేశీ వాణిజ్యం ప్రారంభించటానికి పట్టేకాలం, అయ్యేఖర్చుల ఆధారంగా ప్రపంచబ్యాంకు వివిధ దేశాలకు ర్యాంకులు కేటాయిస్తుంది. ఒకటి నుండి 189 వరకు ర్యాంకులు ఉన్నాయి. ర్యాంకులలో మొదటి స్థానంలో సింగపూర్ ఉ ండగా చివరి స్థానంలో ఎరిట్రియా ఉన్నది. "ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్" కార్యక్రమానికి అనుగుణంగా విధానాలను రూపొందించి అమలు చేయటం వలన పది రంగాలలోని వివిధ అంశాలలో మనదేశం ఎనిమిది నుండి 176 వరకు ర్యాకులను పొంది, మొత్తంగా ప్రపంచబ్యాంకు ర్యాంకింగ్‌లో గత సంవత్సరం 134వ స్థానం నుండి ఈ సంవత్సరం 130వ స్థానానికి చేరింది.

పైన చెప్పిన పది అంశాలను ప్రభుత్వం అమలు జరుపుతున్న తీరును చూస్తే విదేశీ పెట్టుబడుల కోసం ప్రభుతం ఏ విధంగా వెంప ర్లాడుతున్నదో, దేశప్రయోజనాలకు నష్టం కలిగించే విధంగా వారికి ఎటువంటి రాయితీ లను ఇవ్వటానికి పూనుకున్నదో స్పష్టం అవుతుంది. మైనారిటి షేర్ హోల్డర్ల ప్రయోజ నాలు కాపాడటంలో మనదేశం ఎనిమిదవ ర్యాంకు పొందింది. పది విభాగాల్లోనూ మన దేశం పొందిన ర్యాంకుల్లో ఇదే అత్యుత్తమ మైనది. దేశ ఆర్థికవ్యవస్థలోని వివిధ రంగాలలో 24 నుండి 49 శాతం వరకు మాత్రమే విదేశీ

పెట్టుబడులకు అనుమతించారు. ప్రభుత్వరంగ సంస్థల షేర్లు అమ్మేటపుడు దేశీయ పెట్టుబడిదారులు కూడా మైనారిటి షేర్లను మాత్రమే కొనటానికి అవకాశం ఉంది. కాబట్టి దేశీయ, విదేశీ పెట్టుబడిదారులు మైనారిటి షేర్లు మాత్రమే కలిగి ఉంటారు. మైనారిటి షేర్లను కలిగి ఉన్నా తమకు ప్రయోజనం కలిగించే విధానాలను అమలు చేయాలని ప్రభుత్వాలపై పెట్టుబడిదారులు ఒత్తిడి చేస్తుంటారు. సరళీకరణ విధానాలను అమలు చేసే ప్రభుత్వాలు బడా పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడటానికి కట్టుబడి ఉంటాయి. అందువలన ప్రభుత్వ, ప్రైవేటురంగాలలోకి వచ్చే ద్రవ్య పెట్టుబడుల ప్రయోజనాలను కాపాడటం ప్రభుత్వానికి అతి ముఖ్యమైన కర్తవ్యం అవుతుంది. ప్రభుత్వరంగం, దేశీయ పరిశ్రమలు, బడాయేతర పెట్టుబడిదారులు, వ్యాపారులను పక్కనపెట్టి, ద్రవ్య పెట్టుబడుల ప్రయోజనాలను కాపాడటం కోసం ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రయత్నం చేస్తున్నది. వారి ప్రయోజనాల పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నది. అందువలనే మనదేశం ఈ అంశంలో ఎనిమిదవ స్థానానికి చేరింది.

కొత్తగా పరిశ్రమలు ప్రారంభించే వారికి రుణాలు ఇవ్వటంలో మనదేశం ఆరు స్థానాలు దిగజారి, 136 నుండి 142వ స్థానానికి చేరింది. పరిశ్రమ, వ్యాపారం ప్రారంభించే వారికి రుణాలివ్వటానికి పట్టీకాలాన్ని బట్టి ఈ రంగంలో ర్యాంకులను కేటాయిస్తారు. ఇందులో మొదటి స్థానం పొందిన దేశాలలో పారిశ్రామికవేత్తలు 12 రోజులలో రుణం పొందుతున్నారు. రుణాలు ఇవ్వటాన్ని వేగవంతం చేయాలని, పారిశ్రామికవేత్తలు కోరుతున్న విధంగా వడ్డీరేట్లు తగ్గించి సులభంగా రుణాలందేలా చేయాలని ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది. ఆ విధంగా చేస్తే బ్యాంకులకు రాని బాకీలు పెరగటంతో పాటు, దేశ ఆర్థిక స్థిరత్వానికి కూడా దెబ్బ తగులుతుంది. గతంలో రిజర్వుబ్యాంకు గవర్నర్‌గా ఉన్న రఘురాం రాజన్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతో ఏకీభవించలేదు. ప్రపంచబ్యాంకు చెబుతున్న "ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్" ర్యాంకులలో ముందుకు రావాలంటే రాజన్ ఆటంకంగా ఉన్నాడు. కాబట్టి రాజన్‌ను వదిలించుకోవటానికి ప్రభుత్వం ప్రయత్నం చేసింది. ఈ పూర్వరంగంలోనే రాజన్‌పై సుబ్రహ్మణ్యస్వామి దాడిని చూడాలి. రాజన్ కూడా సరళీకరణ విధానాలను విశ్వాసపాత్రంగా అమలు జరపటానికి తోడ్పడుతూ, ప్రపంచబ్యాంకు విధానాలను నమ్మకంగా అమలు చేయటం కోసం కృషిచేస్తున్న వాడే.

> **"గతంలో రిజర్వుబ్యాంకు గవర్నర్‌గా ఉన్న రఘురాం రాజన్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతో ఏకీభవించలేదు. ప్రపంచబ్యాంకు చెబుతున్న 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' ర్యాంకులలో ముందుకు రావాలంటే రాజన్ ఆటంకంగా ఉన్నాడు. కాబట్టి రాజన్‌ను వదిలించుకోవటానికి ప్రభుత్వం ప్రయత్నం చేసింది."**


ఆర్‌బిఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్

అయితే దేశ ఆర్థిక, ద్రవ్య స్థిరత్వం దెబ్బతినకుండా సరళీకరణ విధానాలను అమలు జరపాలని ప్రయత్నించాడు. ప్రభుత్వం దానిని కూడా సహించలేకపోయింది. అందుకే సుబ్రహ్మణ్యస్వామి చేత రాజన్‌పై దాడి చేయించింది. సుబ్రహ్మణ్యస్వామి వ్యాఖ్యలపై ప్రధాని అసంతృప్తి వ్యక్తం చేయటం రాజన్ విషయంలో ప్రధాని భిన్నాభిప్రాయానికి కాక, బిజెపి రెండునాల్కల ధోరణికి నిదర్శనం. అందుకే బాధ్యతల నుండి వైదొలగుతున్న సందర్భంలో తాను మరికొంత కాలం ఉందామనుకున్నా వెళ్ళిపోవాల్సి వచ్చిందని రాజన్ చెప్పాడు. ప్రస్తుతం కొత్త గవర్నర్‌ను నియమించారు కాబట్టి రిజర్వుబ్యాంకును తమ ఇష్టానుసారం వినియోగించుకొని, ప్రపంచ బ్యాంకు ఇస్తున్న ర్యాంకులలో పైస్థానానికి చేరటానికి ప్రయత్నం చేయవచ్చు. బిజెపి ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలు దేశ ఆర్థిక వ్యవస్థ స్వతంత్ర అభివృద్ధికి, ద్రవ్య స్థిరత్వానికి గొడ్డలి పెట్టుగా పరిణమిస్తాయి.

పరిశ్రమ, వ్యాపారాన్ని ఏర్పాటు చేయటానికి పట్టీకాలాన్ని కూడా ర్యాంకులిచ్చేటపుడు పరిగణనలోకి తీసుకుంటారు. పరిశ్రమ, వ్యాపారాన్ని ఏర్పాటు చేయటానికి రోజులో సగం కాలంతో న్యూజిలాండ్ అగ్రస్థానంలో ఉన్నది. 132 దేశాలలో 20 రోజులలోనే పరిశ్రమలు, వ్యాపారాలను ఏర్పాటు చేసుకోగలుగుతున్నారు. మనదేశంలో పరిశ్రమ, వ్యాపారాన్ని ఏర్పాటు చేయాలంటే 2003లో నాలుగు నెలలు పట్టేది. ఇపుడు 29 రోజులకు తగ్గిందని ప్రపంచబ్యాంకు ప్రశంసించింది. ఏ మాత్రం ఖర్చు లేకుండా పరిశ్రమలు, వ్యాపారాన్ని ప్రారంభించే అవకాశాలతో స్లోవేనియా మొదటి స్థానంలో ఉన్నది. కనీస పెట్టుబడి సున్నా శాతంతో ఆస్ట్రేలియా, కొలంబియాలు మొదటి స్థానంలో ఉన్నాయి.

దివాళా తీసిన సంస్థల సమస్యలను పరిష్కరించటం కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని, 180 రోజులలో దివాళా కంపెనీల సమస్యలను పరిష్కరించాలని ప్రపంచబ్యాంకు వత్తిడి చేస్తున్నది. ఆ వత్తిడికి తలొగ్గిన ప్రభుత్వం ఆర్థికంగా దెబ్బతిని, రుణాలు చెల్లించలేని సంస్థల సమస్యలను నిర్దిష్టకాలంలో పరిష్కరించటం కోసమని గతంలో ఉన్న చట్టాలను సవరించి 'ఇన్‌సాల్వెన్సి అండ్ బ్యాంక్రప్టసి' చట్టాన్ని తీసుకువచ్చింది. దివాళా తీసిన సంస్థల సమస్యను పరిష్కరించటానికి ప్రస్తుతం నాలుగు సంవత్సరాలు పడుతుండగా సంవత్సరంలోపు పరిష్కరిస్తామని చట్టంలో పేర్కొన్నారు. ఇన్‌సాల్వెన్సి బోర్డును ఏర్పాటు చేసి, లైసెన్స్‌డ్ ప్రొఫెషనల్స్‌ను నియమిస్తారు. దివాళా తీసినట్లుగా చెబుతున్న సంస్థల సమస్యల పరిష్కారానికి వారి ఆస్థుల విలువను గరిష్టంగా లెక్కించటం, వారి ప్రయోజనాలను పరిరక్షించటం, వారికి రుణం అందించటం, ఆర్థికసంస్థల ప్రయోజనాలను పరిరక్షించటం లక్ష్యంగా చెప్పారు. ఆర్థికసంస్థల ప్రయోజనాలను పరిరక్షించటం కూడా లక్ష్యమని చెప్పినా, ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు బ్యాంకులు, ఆర్థికసంస్థల ప్రయోజనాలను కాపాడేలా లేదు. బ్యాంకులకు ఎనిమిది లక్షల యాభైవేల కోట్ల రూపాయలు బకాయి పడిన పది పెద్దకార్పొరేట్ సంస్థల పేర్లు వెల్లడించటానికే సిద్ధంకాని, కార్పొరేట్ల మొండి బకాయిలను రద్దుచేయాలని రిజర్వుబ్యాంకుపై ఒత్తిడి చేస్తున్న ప్రభుత్వం దివాళా తీశామని చెప్పే పెట్టుబడిదారుల ఆస్థులను ఆర్థికసంస్థలు స్వాధీనం చేసుకోవటానికి అంగీకరిస్తుందా! అది జరిగేపని కాదు. ఈ చట్టాన్ని అడ్డం పెట్టుకొని కార్మికులు ఆందోళనలు చేసినా, బ్యాంకులు, ఆర్థికసంస్థలు రుణాల వసూళ్ళ కోసం గట్టిగా పూనుకున్నా పరిశ్రమలు

> **“ఉత్పత్తితో పాటు మార్కెట్‌పై ఆధిపత్యం కూడా ఆర్థికాభివృద్ధిలో కీలకపాత్ర వహిస్తుంది. మార్కెట్ ఎవరి ఆధీనంలో ఉంటే వారు ఉత్పత్తి రంగాన్ని కూడా శాసించగలుగుతారు. ప్రభుత్వం ఉద్దేశ్య పూర్వకంగా దేశీయ సంస్థల చేతుల్లో ఉన్న మార్కెట్‌ను విదేశీ సంస్థల చేతికి అప్పగిస్తున్నది.”**

మూసివేస్తామని పెట్టుబడిదారులు బెదిరిస్తారు. దివాళా తీసిన కంపెనీలలోని పాలకుల ఆశ్రితులకు అదనంగా రుణాలివ్వటానికి, తద్వారా ఆర్థికసంస్థలు మరింతగా నష్టపోవటానికి ఈ చట్టం దారితీస్తుంది. లాభాలు సంపాదించిన పెట్టుబడిదారులు కూడా బ్యాంకులకు రుణాలు ఎగ్గొట్టటానికి, పరిశ్రమను మూసివేస్తామని కార్మికులను బెదిరించటానికి ఈ చట్టాన్ని ఉపయోగించుకుంటారు. మే 31వ తేదీలోగా చట్టం చేస్తే మనదేశ ర్యాంకు పెరుగుతుంది. అందుకే అవసరమైన లాంఛనాలు త్వరత్వరగా ముగించి, పార్లమెంటు ఆమోదానికి పెట్టి, మే 28వ తేదీనే రాష్ట్రపతి ఆమోదాన్ని కూడా పొందారు.

ర్యాంకుల సాధనలో పన్ను సంస్కరణలు కూడా ఒక ముఖ్యమైన అంశం. సంవత్సరంలో ఎన్నిసార్లు పన్నులు చెల్లించాలి, ఎంతమొత్తం చెల్లించాలి, చెల్లింపులకు ఎంత సమయం పడుతుంది తదితర అంశాలను ర్యాంకులివ్వటానికి కొలబద్దగా తీసుకుంటున్నారు. హాంగ్‌కాంగ్, చైనా, సౌది అరేబియాలు మూడు రకాలైన పన్నులను మాత్రమే వసూలు చేస్తూ తక్కువ రకాల పన్నులు విధించే దేశాలలో అగ్రస్థానంలో ఉన్నాయి. అత్యంత అధ్వాన్నంగా ఉన్న దేశాలలో 63 రకాల పన్నులను వసూలు చేస్తున్నారు. పన్నుల చెల్లింపుకు సంబంధించి అతి తక్కువ కాలం పట్టే దేశాలలో 49 గంటలు పడుతున్నది. అధ్వాన్నంగా ఉన్న దేశాలలో 696 గంటలు పడుతున్నది. లాభాలో 26.1 శాతంతో అతి తక్కువ మొత్తం పన్ను వసూలు చేసే దేశంగా సింగపూర్ ఉన్నది. ఎక్కువ మొత్తం పన్ను వసూలు చేస్తూ అధ్వాన్నంగా ఉన్న దేశాలలో లాభాలలో 86 శాతం పన్నులుగా చెల్లిస్తున్నారు. ఈ పూర్వరంగంలోనే మనదేశంలో పన్నుల సంస్కరణలు, జియస్‌టిని చూడాల్సి ఉంది. జియస్‌టిని అమలులోకి తీసుకురావటం కోసం ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేసింది. రాజ్యసభలో మెజారిటి లేకపోవటంతో కాంగ్రెస్, ఇతర పార్టీల మద్దత్తుతో జియస్‌టి కోసం రాజ్యాంగ సవరణ బిల్లును నెగ్గించుకున్నారు. దీనితో కేంద్రం, రాష్ట్రస్థాయిల్లో వసూలు చేసే పన్నుల సంఖ్య తగ్గుతుంది. పన్ను మొత్తం కూడా తగ్గుతుంది. ఆర్థికవ్యవస్థ సజావుగా సాగాలంటే చిన్న ఉత్పత్తిదారులపై తక్కువ పన్నులు, బడా సంస్థల నుండి ఎక్కువ పన్నులు వసూలు చేయాలి. ప్రభుత్వం ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నది. చిన్న ఉత్పత్తిదారులు ఎక్కువ పన్నులు, ముడిసరుకులకు అధికధరలు, మార్కెట్, విద్యుత్ తదితర సమస్యలతో కునారిల్లుతుంటే బడా పెట్టుబడిదారులు అన్ని విధాలైన రాయితీలను పొందుతూ అధిక లాభాలను స్వంతం చేసుకొంటున్నారు. మిగతా అంశాలలో కూడా ఈ విధమైన ప్రమాణాలను రూపొందించి, అందుకనుగుణంగా వ్యవహరించమని ప్రపంచ బ్యాంకు అన్ని దేశాలపైనా ఒత్తిడి చేస్తున్నది. ర్యాంకులివ్వటానికి ప్రామాణికంగా తీసుకున్న పది అంశాలలో కార్మికచట్టాలను గురించిన ప్రస్తావన లేకపోయినా కార్మికచట్టాలను నీరుగార్చి, వారు పోరాడి సాధించుకున్న హక్కులను హరించాలని అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడిదారులు, ద్రవ్యసంస్థలు నిరంతరం వత్తిడి చేస్తున్నాయి. సరళీకరణ విధానాలు వేగంగా ముందుకెళ్ళాలంటే కార్మిక సంస్కరణలు తప్పనిసరని చెబుతున్నారు. ప్రభుత్వం ఇందుకనుగుణంగానే కార్మికుల హక్కులను హరిస్తూ కార్మికచట్టాలను సవరించింది. రాష్ట్రాలు కూడా కార్మికచట్టాలను సవరించాలని వత్తిడి చేస్తున్నది

### బహుళజాతి సంస్థలకు మార్కెట్ అప్పగింత

ఉత్పత్తితో పాటు మార్కెట్‌పై ఆధిపత్యం కూడా ఆర్థికాభివృద్ధిలో కీలకపాత్ర వహిస్తుంది. మార్కెట్ ఎవరి ఆధీనంలో ఉంటే వారు ఉత్పత్తిరంగాన్ని కూడా శాసించగలుగుతారు. ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగా దేశీయ సంస్థల చేతుల్లో ఉన్న మార్కెట్‌ను విదేశీసంస్థల చేతికి అప్పగిస్తున్నది. 'మేక్ ఇన్ ఇండియా'లో ప్రకటించిన 25 ప్రధాన రంగాలలో కొన్ని రంగాలను విదేశీ సంస్థలకు అప్పగించటానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. నాణ్యమైన మందులను అతి తక్కువ ధరలకు ఉత్పత్తి చేయటం, చౌకరేట్లకు వెనుకబడిన దేశాలకు ఎగుమతి చేయటంలో మనదేశం పేరెన్నికగన్నది. ప్రభుత్వం పేటెంట్ల చట్టాన్ని సవరించటం ద్వారా ఫార్మస్యూటికల్ రంగంలో మనకున్న ప్రపంచవ్యాపిత మార్కెట్‌ను బహుళజాతి సంస్థలకు అప్పగిస్తున్నది. ప్రొడక్ట్ పేటెంట్‌ను అంగీకరించటంతో బహుళజాతి సంస్థలు దేశీయ సంస్థలపై ఒత్తిడి తీసురావటం, అంతర్జాతీయ న్యాయస్థానంలో కేసులు దాఖలు చేయటంతో తట్టుకోలేని దేశీయసంస్థలు బహుళజాతి సంస్థలతో ఒప్పందాలు చేసుకొని, భారత దేశంలో వాటి మార్కెటింగ్ ఏజంట్లుగా మారుతున్నాయి. దేశీయ విధానాల ద్వారా పేటెంట్ మందులను తయారు చేసే కంపెనీలు క్రమంగా తగ్గిపోతున్నాయి. విద్యుత్ ఉత్పత్తి పరికరాలలో కూడా ఇదేవిధంగా వ్యవహరిస్తున్నది. మన దేశంలో బిహెచ్ఇయల్ థర్మల్, హైడల్ విద్యుత్పత్తి యంత్రాలను ఉత్పత్తి చేస్తున్నది. రష్యా సహాయంతో అణువిద్యుత్‌ను ఉత్పత్తిచేసే రియాక్టర్లను ఉత్పత్తి చేసుకొంటున్నాం. ఇపుడు అణు రియాక్టర్లను అమెరికా, యూరోపియన్ దేశాల నుండి దిగుమతి చేసుకొంటున్నది. స్వేచ్ఛావాణిజ్య ఒప్పందాల పేరుతో అమెరికా, యూరప్ దేశాల వ్యవసాయోత్పత్తులకు మన మార్కెట్‌ను అప్పగించి, రైతాంగాన్ని బలిచేస్తున్నది. ప్రభుత్వరంగ సంస్థలలో వాటాలను అమ్మటం ద్వారా, చిల్లర వర్తకంలో విదేశీ సంస్థలకు అవకాశం కల్పించటం, రక్షణ, మీడియా రంగాలలో 100 శాతం విదేశీ పెట్టుబడులకు అవకాశం కల్పించటం, ఇతర రంగాలలో విదేశీ పెట్టుబడుల పరిమితిని పెంచటం తదితర చర్యల ద్వారా దేశీయ మార్కెట్‌ను విదేశీసంస్థల చేతుల్లో పెడుతున్నది.

### దేశీయ ఉత్పత్తిరంగానికి విఘాతం

పేటెంట్లరంగంలో సామ్రాజ్యవాదుల ఒత్తిడులకు లొంగిపోవటం ద్వారా మనం సాధించిన అభివృద్ధిని వదులుకుంటున్నారు. వ్యవసాయోత్పత్తులు, విత్తనాలు, దేశీయ ఉత్పత్తులపై సామ్రాజ్యవాదులు అక్రమంగా పేటెంట్లు పొందటానికి ప్రయత్నం చేస్తున్నారు. వీటన్నింటినీ అడ్డుకోకపోతే దేశీయ అభివృద్ధి కుంటుపడుతుంది. రక్షణ రంగంలో 100 శాతం యఫ్‌డిఐకి ఆమోదం తెలిపింది. ఇది మన రక్షణ పరిశ్రమలను బలహీనపర్చటానికి, విదేశీసంస్థలకు ఆధిక్యతను కట్టబెట్టటానికి దారితీస్తుంది. మనదేశీయ సంస్థలను దెబ్బతీసి, ఉత్పత్తిని విదేశీ

సంస్థలకు అప్పగించటం 'మేక్ ఇన్ ఇండియా' ఎలా అవుతుంది? కార్పొరేట్, విదేశీ సంస్థలు అక్రమంగా ప్రజల, ప్రభుత్వ ఆస్తులను స్వంతం చేసుకుంటున్నా ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవటం లేదు. కెజి బేసిన్‌లో రిలయన్స్ ఒయన్‌జిసి క్షేత్రం నుండి 11,000 కోట్ల రూపాయల గ్యాస్‌ను అక్రమంగా తోడేసిందని వివిధ కమిటిలు రుజువు చేశాయి. ఆ వివరాలన్నీ ప్రసార మాధ్యమాలలో బహిరంగంగా వచ్చాయి. అయినా అక్రమాలు చేసినవారిపై చర్య తీసుకుంటామనిగాని, ఒయన్‌జిసికి పరిహారం చెల్లింపచేస్తామనిగాని ప్రభుత్వం ఒక్కమాట కూడా చెప్పలేదు. పైగా గ్యాస్‌దొంగ అయిన రిలయన్స్ అధినేత ముఖేష్ అంబాని రిలయన్స్ జియోకి ప్రచారం కోసం ప్రధాని ఫోటోను వినియోగించుకుంటున్నా కిమ్మనలేదు. ఈ విధంగా దొంగలతో జట్టుకడుతున్న ప్రభుత్వం 'మేక్ ఇన్ ఇండియా'ను జయప్రదం చేయటం సాధ్యమౌతుందా? మన ఎగుమతుల్లో తోలు ఉత్పత్తులు కూడా ప్రధానభాగంగా ఉన్నాయి. ఇపుడు నకిలీ గోరక్షణ దళాలు గోరక్షణ పేరుతో చర్మకారులపై దాడులు చేయటం వలన ఆ ఉత్పత్తులు ప్రమాదంలో పడ్డాయి. మనం ఎగుమతులు చేసే స్థాయి నుండి దిగుమతులు చేసుకునేవారిగా మారబోతున్నాం. ప్రభుత్వం తీసుకుంటున్న ఇటువంటి చర్యల వలన దేశీయ ఉత్పత్తులు తగ్గుతున్నాయి. ఫలితంగా పేరుకు "మేక్ ఇన్ ఇండియా" అంటూ దేశీయ ఉత్పత్తిని పెంచటాన్ని గురించి అతిగా ప్రచారం చేస్తున్నా, ఆర్థికాభివృద్ధి తిరోగమనంలో ఉన్నదని ప్రభుత్వం ప్రకటించిన అంకెలు రుజువు చేస్తున్నాయి.

ఈ విధంగా ప్రభుత్వం ఒకవైపు 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' ర్యాంకులలో పైకి ఎగబాకటానికి ప్రయత్నం చేస్తుండగా మరోవైపు ర్యాంకులకు, పెట్టుబడుల రాకకు సంబంధం లేని పరిస్థితి కనిపిస్తున్నది. ప్రపంచబ్యాంకు 2006 సంవత్సరం నుండి ర్యాంకులు విడుదల చేస్తున్నది. 2006-16 మధ్య ర్యాంకులు పొందిన దేశాలను పరిశీలిస్తే అమెరికా ఈ కాలంలో మూడు నుండి ఏడవ ర్యాంకుకు పడిపోయినా విదేశీ పెట్టుబడుల ఆకర్షణలో మొదటి స్థానంలోనే ఉన్నది. సింగపూర్ మొదటి ర్యాంకులో ఉండగా యఫ్‌డిఐ ఆకర్షణలో ఐదవ స్థానంలో ఉన్నది. 84వ ర్యాంకులో ఉన్న చైనా యఫ్‌డిఐ ఆకర్షణలో మూడవ స్థానంలో ఉన్నది. 130వ ర్యాంకులో ఉన్న భారత్ యఫ్‌డిఐల ఆకర్షణలో 10వ స్థానంలో ఉన్నది. ర్యాంకు పెరిగితే పెట్టుబడులు అదనంగా వస్తాయనే వాదనలోని డొల్లతనాన్ని ఈ వివరాలు బట్ట

**"మేక్ ఇన్ ఇండియా' ప్రభుత్వం ప్రచారం చేస్తున్న లక్ష్యాలను సాధించలేకపోయిందని స్పష్టమౌ తున్నది. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడుల ప్రయోజనాల కోసం రూపొందించిన కార్య క్రమం మనదేశానికి లబ్ది కలిగించదు. ఉత్పత్తిలో వెనుకబడిన ఈ కార్యక్రమం ఉద్యోగాల కల్పనలో మరింత వెనుకబడింది."**


ముఖేష్ అంబాని

బయలు చేస్తున్నాయి. ప్రభుత్వం చెబుతున్నట్లుగా ఒకవేళ 130వ ర్యాంకు నుండి 50వ ర్యాంకుకు చేరినా దేశంలోకి పెట్టుబడుల రాకలో పెద్ద మార్పు ఉండదని పై వివరాలు స్పష్టం చేస్తున్నాయి. ర్యాంకుల పేరుతో దేశాల మధ్య పోటిపెట్టి, అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడులు అధిక లాభాలు సంపాదించుకొనే విధంగా రాయితీలు ఇప్పించటమే ఈ ర్యాంకులు ఇవ్వటం వెనుకనున్న లక్ష్యం.

'మేక్ ఇన్ ఇండియా' ప్రభుత్వం ప్రచారం చేస్తున్న లక్ష్యాలను సాధించలేకపోయిందని స్పష్టమౌతున్నది. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడుల ప్రయోజనాల కోసం రూపొందించిన కార్యక్రమం మనదేశానికి లబ్ది కలిగించదు. ఉత్పత్తిలో వెనుకబడిన ఈ కార్యక్రమం ఉద్యోగాల కల్పనలో మరింత వెనుకబడింది. 2015లో ప్రధాన పరిశ్రమలలో 1.35 లక్షల మందికి మాత్రమే ఉద్యోగాలు కల్పించారు. ఎన్నికల ప్రచారం సందర్భంలో బిజెపి సంవత్సరానికి రెండు కోట్ల మందికి ఉద్యోగాలు కల్పిస్తానని చెప్పింది. ఇపుడు ఉద్యోగాల ఊసెత్తటం లేదు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించటంతో యఫ్‌డిఐ రాకవలన అదనంగా కల్పించబడే ఉద్యోగాలు నామమాత్రంగానే ఉంటున్నాయి. కొన్ని పరిశ్రమలలో అదనంగా కల్పించిన ఉద్యోగాలకన్నా కోల్పోయిన ఉద్యోగాలే అధికంగా ఉంటున్నాయి. ఈ విధంగా "మేక్ ఇన్ ఇండియా" వలన ఆశించిన మేరకు జిడిపి పెరగలేదు. ఉపాధి, కార్మికుల వేతనాలు పెరగలేదు. రైతాంగం తమ ఉత్పత్తులకు మంచి ధరలు పొందటం కాని, సాధారణ ప్రజల జీవితాలు మెరుగు పడటం కాని జరగలేదు. 90 శాతం మంది పొందుతున్న ఆదాయాలకు వివిధ రూపాలలో కోతలు పెట్టటంతో ప్రజల జీవన పరిస్థితులు క్షీణిస్తున్నాయి. మరోవైపు దేశంలోని బడా పెట్టుబడిదారులు, కార్పొరేట్ సంస్థలు, విదేశీ పెట్టుబడిదారులు, ద్రవ్య పెట్టుబడిదారులు అత్యధిక లాభాలు (సూపర్ ప్రాఫిట్స్) పొందుతున్నారు. 'మేక్ ఇన్ ఇండియా' పేరుతో దేశాభివృద్ధిని గురించి ప్రభుత్వం చేస్తున్న జపం అంతా పెట్టుబడిదారుల లాభాల పరి రక్షణ కోసమే. అందువలననే దేశంలో ఆర్థిక అంతరాలు తీవ్రమౌతున్నాయి. 53 శాతానికి పైగా సంపద ఒక్కశాతం మంది వద్దకు చేరింది. ఇది ప్రపంచస్థాయిలో పైస్థాయిలోని ఒక్కశాతం మంది వద్ద ఉన్న సంపదకన్నా ఎక్కువ. మరోవైపు 50 శాతం పేదల వద్ద 4.1 శాతం సంపద మాత్రమే ఉన్నది. సరళీకరణ విధానాల అమలు ఫలితంగానే దేశంలో అసమానతలు ఇంత తీవ్రస్థాయిలో పెరిగాయి. "మేక్ ఇన్ ఇండియా" ఈ అసమానతలను మరింత తీవ్రం చేస్తున్నది.

ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్య సంస్థల ఆదేశాలను అమలు జరుపుతూ కార్మికులు, రైతాంగం, ఇతర పీడిత ప్రజల ప్రయోజనాలకు నష్టం కలిగిస్తున్న ప్రభుత్వ విధానాలను శ్రామికవర్గంలో, వివిధ సామాజిక తరగతులలో విస్తృతంగా ప్రచారం చేయాలి. వారిని చైతన్యపరచాలి. సాధ్యమైతే వివిధ ప్రజాసంఘాలు ప్రభుత్వ పనితీరుపై సూచీలు రూపొందించి, ఏ అంశంలో ప్రభుత్వం ఎలా వ్యవహరిస్తున్నదో నిర్ధారించి, ప్రజలను చైతన్యపరచటానికి పూనుకోవాలి. బలమైన ప్రతిఘటనను నిర్మించకపోతే తమ జీవన ప్రమాణాలు మరింత క్షీణిస్తాయని, మరింతగా హక్కులను కోల్పోవలసి వస్తుందని సామాన్య ప్రజలు అర్థం చేసుకొనే విధంగా ప్రచారం నిర్వహించాలి. ❋

# అంగట్లో ప్రభుత్వ విద్య

**మధుప్రసాద్**

విద్యారంగంలో రాజ్యాంగ కర్తవ్యాలను నిర్వర్తించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి. దానికి బదులుగా ప్రభుత్వ పాఠశాలలను ఒక పథకం ప్రకారం నిర్లక్ష్యం చేయడం, వాటిని వశపరుచుకోవడం లాంటివి చేస్తూ నాశనం చేస్తున్నాయి. కులం, వర్ణం, స్త్రీ, పురుష అసమానతలను తొలగించటానికి బదులు ఈ చర్యలు వాటిని మరింత బలపరిచే విధంగా ఉన్నాయి.

నూతన విద్యావిధానంపై టిఎస్‌ఆర్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీ రిపోర్టుపై మానవ వనరుల అభివృద్ధి శాఖామంత్రి స్మృతి ఇరానీ, మాజీ కేబినెట్ కార్యదర్శి టిఎస్‌ఆర్ సుబ్రహ్మణ్యం మధ్య మాటల యుద్ధం జరుగుతున్నది. తన రిపోర్టును బహిరంగ పరుస్తానని సుబ్రహ్మణ్యం బెదిరిస్తున్నాడు. రాష్ట్రాలు వారి ప్రతిస్పందనను పంపిన తర్వాతనే దానిని పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుందని స్మృతి ఇరానీ అంటున్నారు. మొత్తం మీద నూతన విద్యా విధానంపై జరుగుతున్న రగడ అందుకోసం జరిగిన కసరత్తు స్వభావాన్ని బట్టబయలు చేస్తున్నది.

నరేంద్రమోడీ ప్రభుత్వం యొక్క నూతన విద్యావిధానం రెండు లక్షల అరవై వేల సూచనలతో 13 రకాల అంశాల చుట్టూ నిర్దేశించబడి, పాఠశాల విద్యలో గ్రామపంచాయితీ, బ్లాకు, జిల్లా, రాష్ట్రాల సమూహంగా అద్భుతమైన ఫలితాన్ని సాధించబోతున్నట్లు స్మృతి ఇరానీ గట్టిగా వాదిస్తున్నారు. నూతన విద్యా విధానం ముసాయిదా పత్రంలో చెప్పబడిన ప్రతి అంశానికి సంబంధించిన ప్రశ్నలను మానవ వనరుల మంత్రిత్వశాఖ సరఫరా చేసింది. అయితే ఆ ముసాయిదా పత్రం అనుభవజ్ఞుల పనిగా ఉండే అవకాశం లేదు. అద్భుతమైన సంకలనంగా చెప్పబడుతున్నట్లు కూడా ఉండే అవకాశం లేదు. మాజీ కేబినెట్ కార్యదర్శి నాయకత్వంలో ముగ్గురు ప్రభుత్వ రిటైర్డ్ కార్యదర్శులు, గత ఎన్‌డిఎ ప్రభుత్వంలో మానవవనరుల అభివృద్ధి శాఖా మంత్రిగా ఉన్న, మురళీ మనోహర్ జోషి హయాంలో పాఠ్యపుస్తకాల "కాషాయీకరణ"లో పాత్ర పోషించిన ఎన్‌సిఇఆర్‌టి మాజీ సభ్యుడు రాజ్‌పుత్ సభ్యులుగా ఉన్నారు. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం సంబంధిత మంత్రిత్వశాఖ వైఖరి కారణంగా ప్రతిపాదిత సమావేశాలు అనుకున్నంత సులభంగా, సునాయాసంగా జరగలేదు. చట్టబద్ధంగా జరపవలసిన సమావేశాలను జరపలేదు. ఉన్నత స్థాయిలో జరిపిన గోష్టులను, వచ్చిన సూచనలను "ప్రజావాణి"కి ప్రాతినిధ్యం వహించేవిగా ముద్రవేస్తున్నారు. ప్రిన్సిపాల్‌లు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రభుత్వ ఆహ్వానితులు, పాఠశాలల మేనేజ్‌మెంట్ కమిటీల నుండి పాల్గొన్న సమావేశాలలో జరిగిన చర్చలలో ప్రభుత్వ అధికారులు, విద్యాశాఖ ఉన్నతాదికారులు ఆధిపత్యం వహించేలా వ్యవహరించారు. ప్రజల యొక్క సిఫార్సులుగా చెప్పబడుతున్న వాటిని బహిరంగంగా అందుబాటులో ఉంచడంలో మానవవనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ విఫలం కావడం ఆశ్చర్యకరం కాదు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్ (యుజిసి), జాతీయ విద్యా ప్రణాళిక, పరిపాలనా విశ్వవిద్యాలయం (న్యూపా), జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ కౌన్సిల్ (ఎన్‌సిఇఆర్‌టి), ఇతర జాతీయస్థాయి విద్యాసంస్థల ద్వారా జరపబడిన జాతీయ, ప్రాంతీయ చర్చలలో పారదర్శకత లేమి దొంతరలుగా కనిపిస్తున్నది.

మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆమోదించిన పద్ధతి సమస్యాత్మకమైనది. 1986లో ప్రవేశపెట్టబడిన జాతీయ విద్యా విధానం, దానికి అనుబంధంగా 1992లో ప్రవేశపెట్టబడిన కార్యాచరణ పథకం, నేషనల్ ఎడ్యుకేషన్ పాలసి (ఎన్‌పిఇ)లో మార్పులు ప్రవేశపెట్టడం ద్వారా ఆచరణాత్మకంగా కలిగే ఫలితాలపైనా, పూర్వ విధానాలపై వాస్తవికమైన, సంపూర్ణమైన ఎటువంటి సమీక్ష లేదు. జాతీయ విద్యావిధానానికి ముందు ప్రజాస్వామిక లక్ష్యాలు, మార్గదర్శక సూత్రాలు సమానత్వం, సామాజిక న్యాయం స్వాతంత్ర్యోద్యమ కాలపు విధానాలు స్పష్టంగా చెప్పబడినాయి. అయినప్పటికీ అనంతర కాలంలో ప్రభుత్వాలు తమ రాజ్యాంగ బాధ్యతలను అమలు చేయడంలో విఫలమైన విషయం స్పష్టమవుతున్నది. జాతీయ విద్యావిధానంలో ప్రవేశపెట్టబడిన మార్పులు 1991లో పి.వి నరసింహారావు ప్రభుత్వం చేత ప్రవేశపెట్టబడిన ఆర్థిక సంస్కరణలతో పోలిక కలిగి ఉన్నాయి.

జాతీయ విద్యావిధానం మార్కెట్ ఆధారిత నైపుణ్యాల కోసం సంస్థలు (మిషన్స్), ప్రాజెక్టు (అభయాన్స్)లను వరుసగా కొనసాగించడంపై దృష్టి కేంద్రీకరించింది. వాటిలో దిగువ స్థానంలో ఉన్నది 'ఉపాధి అక్షరాస్యత'. ఇది లోతైన ఆలోచన, నాగరిక సామర్థ్యాలకు, భావాత్మకమైన విద్యా సంబంధ పాఠ్యప్రణాళిక మధ్య సంబంధాన్ని తెంచేసింది. సామాన్య పౌరులలో ఎక్కువమంది ఆచరణాత్మక నైపుణ్యాలను సాధించి, ఉద్యోగితను పొందే దానితో సంబంధం లేకుండా చేసింది. నాణ్యమైన సార్వత్రిక, ఉచిత నిర్బంధ విద్యను అందించాల్సిన స్థిరమైన రాజ్యాంగ కర్తవ్యాలను ఉల్లంఘించే విధంగా, జాతీయ విద్యావిధానాన్ని తక్కువ ఖర్చు, తక్కువ నాణ్యత కలిగిన అనియత విద్య (ఎన్‌ఎఫ్‌ఇ)ను 'పాఠశాల విద్యకు సమానమైనదిగా', పూర్తిగా ఒక నిండురోజు పాఠశాలకు రాలేరని అంచనా వేయబడిన" పిల్లల కోసం అంటూ ప్రవేశపెట్టబడింది. ఇది అదే వయోపరిమితికి చెందిన అత్యధిక సంఖ్యాకులుగా ఉన్న పిల్లలను క్రమానుగతమైన పాఠశాల విద్యకు దూరం చేసింది.

ఏది ఏమైనా అనియత విద్య బహుళత్వ విధానానికి, విద్యలో వివక్షకు పునాది వేసింది. ప్రపంచబ్యాంకు ఒత్తిడితో 1994లో జిల్లా ప్రాథమిక విద్య పథకం (డిపిఇపి) "తక్కువ ధర గల" మౌలిక వసతులు, నియామకపు పద్ధతులను దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టారు. పారాటీచర్లు, కాంట్రాక్టు టీచర్లు ప్రభుత్వ విద్యారంగ వ్యయాన్ని తగ్గించడానికి ఉపయోగించబడ్డారు. ఐదవ వేతన సంఘం (1996) తరువాత అనేక రాష్ట్రాలలో శాశ్వత ఉపాధ్యాయుల నియామకాలు తీవ్రంగా ప్రభావితమైనాయి. ఇప్పటికీ అధికారిక విధులైన జనాభా లెక్కలు, ఎన్నికలు, పోలియో నిర్మూలన లాంటి ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహించడానికి శిక్షణ పొందిన ఉపాధ్యాయుల అవసరం ఎంతో ఉంది. ఇప్పుడు 'ప్రకృతి వైపరీత్యాల నిర్వహణ'కు కూడా వీరు అవసరం. విద్యలో నాణ్యతను పెంచడానికి స్వచ్ఛంద సంస్థల (ఎన్‌జివో)కు కూడా అధికారికంగా బాధ్యతలు అప్పజెప్పారు. ఈ విధంగా మొత్తం వ్యవస్థ కుప్పకూలిపోయే విధంగా ప్రమాదపు శిఖరాగ్రానికి నడపబడింది.

విద్యాహక్కు చట్టం యొక్క పరిమితులు.

బాలల ఉచిత నిర్భంధ విద్యాహక్కు చట్టం (2009)కు మౌలికంగా కొన్ని పరిమితులు

న్నాయి. ప్రాథమిక హక్కుగా విద్యను కొనసాగించే హామీని అమలు చేయడాన్ని, ప్రభుత్వ నిర్వహణలో విద్య అనే జాతీయ విద్యావిధానం యొక్క ఆలోచనను, నిధులు, నిర్వహణ బాధ్యతను ప్రభుత్వం వదిలివేసింది. ప్రతిస్థాయిలో వివక్షకు గురవుతున్న వ్యవస్థ యొక్క చట్టపరమైన రూపంగా విద్యాహక్కు చట్టం మారింది. ఇది 0–5సంవత్సరాల మధ్య వయసుకు సంబంధించిన పాఠశాల పూర్వవిద్యను వదిలివేసింది. అలాగే 15–18 సంవత్సరాల వయస్సుగల వారికి మాధ్యమిక విద్యను వదిలివేసింది. అవసరం అనుకున్నప్పుడు ప్రభుత్వాలు పాఠశాలలను నడపగలవు అనేదానికి ఋజువుగా ఉన్న" ప్రత్యేక పాఠశాలలను" వదిలివేసింది. కానీ ఈ చర్య భవిష్యత్తులోకి చూచే అవకాశాన్ని కల్పించింది. అత్యధికంగా ప్రశంసించబడిన ప్రయివేటు పాఠశాలల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందదిన 25 శాతం మంది పిల్లలకు ప్రవేశాలు కల్పించడమనేది "ప్రభుత, ప్రయివేటు భాగస్వామ్యం" (పిపిపి) మోడల్‌ను ప్రారంభించడానికీ, అత్యధిక ఫీజులను వసూలు చేస్తూ కోట్ల రూపాయలలో నడుస్తున్న కార్పొరేట్ పాఠశాలలకు, తక్కువ బడ్జెట్‌తో నడుస్తున్న ప్రయివేటు పాఠశాలలకు ప్రభుత్వ నిధులను ఒకేరకంగా బదిలీ చేయడానికి ఈరోజు అనుమతి లభించింది.

వాస్తవమేమంటే ఇది రాజకీయ పరిధిలో విశాలంగా తోడ్పాటును పొందుతూ –యుపిఎ ప్రభుత్వం జాతీయ విద్యా విధానము, విద్యాహక్కు చట్టం తెస్తే, ఎన్‌డిఎ ప్రభుత్వం ఆర్‌టిఇ చట్టానికి పరిమితులను నిర్వచించే 86వ సవరణ బిల్లును, విజ్ఞానం యొక్క భావనను "మార్కెట్ వస్తువు" లాగా, విద్యను" వాణిజ్య సేవ"లాగా– అధికారంలో ఉన్న అన్ని ప్రభుత్వాల చేత "అభివృద్ధి నమూనా"గా ఆమోదించబడింది. 1986 జాతీయ విద్యావిధానం పునాదుల మీద మోడీ ప్రభుత్వం యొక్క నైపుణ్య అభివృద్ధి కార్యక్రమం ఆధారపడి ఉండటం మాత్రమే కాక 14 సంవత్సరాలలోపు బాలలు వంశపారంపర్య వృత్తులలో పాల్గొనే విధంగా బాలకార్మిక చట్టాలకు సవరణలను కూడా చేస్తున్నది.

అప్పుడు దాని యొక్క విలువ ఏమిటి అనే దానికి "జవాబులు"గా ఈ రకమైన ప్రశ్నలు సంధించబడతాయి. నాన్ డిటెన్షన్ విధానం విద్యార్థుల యొక్క అభ్యసనా సామర్థ్యాలను అభివృద్ధి పరిచిందా? అలాకాకపోతే కారణాలు ఏమిటి? ఏ రకమైన మార్పులను సూచిస్తారు? ప్రాథమిక స్థాయి (1– 8 తరగతులు)లో

"బదులుగా ప్రజలలో బాగా ప్రచారంలో ఉన్న, అధికారులకు సౌలభ్యంగా ఉండే "ఉపాధ్యాయులు బోధన చెయ్యరు", "విద్యార్థులు మనసు కేంద్రీకరించి పాఠాలు వినరు" లాంటి ప్రశ్నలు సంధించబడతాయి. అంతేకాక త్వరలో జరగబోయే పరీక్షల భయం చేత పరీక్షలలో ఫెయిల్ కావడం అనే సామాజిక కళంకం తలపై కత్తిలా వేలాడుతుంటేనే కేంద్రీ కరిస్తారని భావిస్తున్నారు."



ప్రైవేట్ స్కూల్ క్లాస్ రూమ్

నాన్‌డిటెన్షన్ విధానములో చురుకైన శిక్షణ పొందిన బోధకులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండడం అనేది పూర్తిగా నిర్లక్ష్యం చేయబడింది. అందుకు బదులుగా ప్రజలలో బాగా ప్రచారంలో ఉన్న, అధికారులకు సౌలభ్యంగా ఉండే "ఉపాధ్యాయులు బోధన చెయ్యరు", "విద్యార్థులు మనసు కేంద్రీకరించి పాఠాలు వినరు" లాంటి ప్రశ్నలు సంధించబడతాయి. అంతేకాక త్వరలో జరగబోయే పరీక్షల భయం చేత పరీక్షలలో ఫెయిల్ కావడం అనే సామాజిక కళంకం తలపై కత్తిలా వేలాడుతుంటేనే కేంద్రీ కరిస్తారని భావిస్తున్నారు. ఎవరైతే డిటైన్ చేయబడ్డారో లేదా 5వ తరగతి నుంచి బయటకు నెట్టబడ్డారో వారికి ఇప్పుడు నైపుణ్య అభివృద్ధికి హాజరయ్యే సెంటర్స్ ఉన్నాయనే విషయాన్ని మరిచిపోవద్దు!

### సత్వర పరిష్కారాలు

భారతదేశంలో పాఠశాల విద్య దీర్ఘ కాలిక సమస్యలను సత్వరమైన సాంకేతిక పరిష్కారాలను అభివృద్ధికరమైన మార్గం ద్వారా సాధించాలని మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ తీవ్రమైన ఆకాంక్ష. సమాచార, వార్తా ప్రసారాలలో సాంకేతిక పరిజ్ఞానాన్ని (ఐసిటి), జ్ఞానసమూపార్జనా నైపుణ్యాలను పెంచి, మంచి ఫలితాలను సాధించాలని ప్రభు త్వం ప్రయత్నం చేస్తున్నది. దృశ్యం కనిపించేలా ప్రచార సాధనాలలో ప్రసారం చేయటం ద్వారా కంప్యూటర్ అద్భుతమైన శక్తిగా కనిపిస్తున్నది. అందుబాటులో ఉన్న సమాచారాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే సమాచార, వార్తా ప్రసారాల ద్వారా (ఐసిటి) ఆశించిన ఫలితాలను పొందటానికి బోధన, అభ్యసన సంబంధం కీలకమైనదని స్పష్టమౌతున్నది. ఒకవైపు అప్పగించటం ద్వారా ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాలను పొందటం, మరోవైపు కార్పొరేట్లకు ప్రయోజనం కలిగించేలా వ్యవహరించటం చేస్తున్నది.

మానవవనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ విధానం మౌలికంగా లోపభూయిష్టమైనదిగా ఉన్నది. అదే సమయంలో అది విస్తృతంగా సంప్రదింపులు జరిపినట్లు పెద్ద ప్రదర్శన చేస్తున్నది. దానికి ఏ విధమైన సలహాలు, సూచనలకు ప్రాధాన్యత నివ్వాలి అనేది గానీ ఇతర

> **❝ భారతదేశం యొక్క విద్యావిధానం సామాజిక అసమానతలను తొలగించకపోగా మళ్లీ వాటిని తిరిగి ప్రవేశపెడుతున్నదని స్పష్టమౌతున్నది. ప్రధాన ఆటంకాలుగా ఉన్న కులం, వర్ణం, లింగ వివక్ష లాంటి వాటిని తొలగించ టానికి రాజకీయ చిత్తశుద్ధి కొరవడడం విద్యను సార్వజనీనం చేయడాన్ని విఫలం చేసింది. ❞**

ప్రత్యామ్నాయాల మీద ఒక ముందు చూపుగానీ, ఒక సిద్ధాంతంగానీ, ఒక తాత్వికతగానీ లేదు. అంతర్గత, బహిర్గత అంశాలలో అదిచేస్తున్న పని వృథా కసరత్తుగా ఉన్నది. విద్యకు కేటాయిం చటానికి నిధులు లేవని చెబుతూ గత రెండు సంవత్సరాల నుండి బడ్జెట్‌లో విద్యకు కేటాయింపులు కత్తిరించేశారు.

ఏది ఏమైనా, ఇది అభివృద్ధికరమైన ప్రణా ళిక కలిగి ఉండే అర్థంలో లేదు. మరణశయ్యపై ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యావ్యవస్థను పునరుజ్జీవింప చేసే విధంగా ఒక ప్రత్యేక దృక్కో ణం లేకపోయినట్లయితే, ప్రభుత్వ విధానం వ్యాపారీకరణ చేయబడిన ప్రయివేటు సంస్థల తలుపులను తట్టే విధంగా తల్లిదండ్రులను బలవంతంగా పంపేదిగా ఉంటుంది. విద్యా హక్కు చట్టం అమలు చేయబడిన రెండు సంవత్స రాల తర్వాత స్వచ్ఛంద సంస్థ అయిన ప్రథమ్ " అసర్ 2012 రిపోర్టు" పేరుతో ఇచ్చిన నివేదిక 2010 -11లో ప్రయివేటు పాఠశాలల్లోని ప్రాథమిక విద్యలో విద్యార్థుల నమోదు శాతం 5.8 శాతం పెరిగి 29.8 శాతానికి చేరినట్లు చెప్పింది. 2020 నాటికి 50 శాతం పైబడి విద్యార్థులు ప్రాథమిక విద్యలో ప్రయివేటు పాఠశాలల్లో ఫీజులు చెల్లించేవారుగా ఉంటారని ఈ రిపోర్టు అంచనా వేసింది.

రాష్ట్ర ప్రభుత్వాలు ఒకదాని తర్వాత మరొకటి పాఠశాలలను మూసివేయడం లేక విలీనం చేయడం చేస్తున్నాయి. విద్యార్థులు పాఠశాలలను విడిచి పెట్టినందువల్ల ఇలా జరుగుతున్నది. రాజస్థాన్, గుజరాత్, మధ్య ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక చివ రికి ప్రభుత్వ విధానంలో విజయవంతమైన గాథలు కలిగినటువంటి హిమాచల్‌ప్రదేశ్, కేరళలాంటి రాష్ట్రాలు కూడా అధికారికంగా ఇప్పుడున్న విధానం తప్పించుకోలేకుండా ఉ న్నది అని ప్రకటిస్తున్నాయి. హేతుబద్ధీకరణ (రేషనలైజేషన్) పేరుతో వేలాదిమంది ఉపాధ్యా యులను బలవంతంగా మిగులు ఉపాధ్యా యులుగా ప్రకటిస్తున్నారు. ఎందుకంటే వారి జీతాలకు చెల్లించాల్సిన ప్రభుత్వ నిధులను పొదుపు చేస్తున్నట్లుగా చెబుతున్నారు. ప్రభుత్వ నిధులు, నిర్వహణలో నడుస్తున్న వ్యవస్థను వదిలించుకునే దానికి వ్యతిరేకంగా కొన్ని రాష్ట్రాల్లో ప్రజాసంఘాలు ఆఖరి పోరాటం ద్వా రా విద్యావ్యవస్థను నాశనం చేసే విధానాలను మరో సంవత్సరం పాటు వెనక్కి నెట్టగలిగాయి.

**తీవ్రమైన అసమానతలు**

జాతీయ నమూనా సర్వే సంస్థ (ఎన్ఎస్ ఎస్ఒ) జనవరి 2014 నుండి జులై 2014 వరకు విద్యపై అత్యంత తాజాగా నిర్వహించిన 71వ రౌండ్ సర్వే ప్రకారం, ఒక పథకం ప్రకారం ప్రభుత్వ విద్యారంగాన్ని లేకుండా చేయడం ద్వారా విద్యావ్యవస్థలో అసమానతలు అత్యంత తీవ్రంగా పెరిగాయని స్పష్టం చేసింది. ఒకప్పుడు ప్రభుత్వ రంగాన్ని గురించి చెడుగా మాట్లాడారు. ఇప్పుడు నాశనం చేస్తున్నారు. నికర హాజరు నిష్పత్తి ప్రకారం జనాభాలోని ఐదవ వంతు ధనవంతులలో స్కూలుకు పోయే వయ సున్న వారిలో 89 శాతం మంది స్కూలుకు హాజరవుతున్నారు. జనాభాలోని దిగువ ఐదవ వంతులో ఇది 10 శాతం తగ్గి గ్రామీణ ప్రాంతా ల్లో 79 శాతంగా, పట్టణాలలో 78 శాతంగా ఉన్నది. ఉన్నత మాధ్యమిక పాఠశాల స్థాయిలో కంటే మాధ్యమిక పాఠశాల స్థాయిలో పిల్లలు చాలా వేగంగా బడి మానివేస్తున్నారు.

జనాభాలో అత్యంత పేదలైన 5వవంతు మందిలో నికర హాజరు నిష్పత్తి 18 శాతం (గ్రామాల్లో), (పట్టణాల్లో) 23 శాతం ఉన్నది. అత్యంత ధనికులైన 5వ వంతు మందిలో నికర హాజరు నిష్పత్తి 53 శాతం (గ్రామాల్లో), 66 శాతం (పట్టణాల్లో)గా ఉన్నది. జనాభాలో అట్టడుగున ఉన్న 5వ వంతు మందిగా ఉన్న అణచి వేయబడుతున్న వారిలో కూడా దళితులు, గిరిజనులు, మైనారిటీలు, ఇతర అణగారిన వర్గాలలో మహిళలు, వికలాంగులుగా ఉ న్నవారిలో కేవలం 6 శాతం మంది యువజ నులు మాత్రమే ఉన్నత మాధ్యమిక స్థాయిని దాటుతున్నారు. అత్యంత ధనికులైన 5 వ వంతు మంది ప్రజలలో 31 శాతం మంది, దామాషా ప్రకారం 5 రెట్లు ఎక్కువగా ఉన్నత మాధ్యమిక స్థాయిని దాటుతున్నారు. భారతదేశం యొక్క కల్పిత మధ్యతరగతి 5వ వంతు మంది పిల్లల నికరహాజరు నిష్పత్తి పట్టణ ప్రాంత పిల్లల్లో ఉ న్నత మాధ్యమిక స్థాయిని దాటి విద్యనభ్యసించే వారిలో కేవలం 15 శాతంగా ఉన్నది. గ్రామీణ భారతంలో పరిస్థితి అత్యంత హీనంగా ఉన్నది.

భారతదేశం యొక్క విద్యావిధానం సామాజిక అసమానతలను తొలగించకపోగా మళ్లీ వాటిని తిరిగి ప్రవేశపెడుతున్నదని స్పష్ట మౌతున్నది. ప్రధాన ఆటంకాలుగా ఉన్న కులం, వర్ణం, లింగ వివక్ష లాంటి వాటిని తొలగించ టానికి రాజకీయ చిత్తశుద్ధి కొరవడడం విద్యను సార్వజనీనం చేయడాన్ని విఫలం చేసింది. ఈ రోజు ఉన్న వివక్షా పూరితమైన విధానాలు తిరిగి మళ్లీ అటువంటి అసమానతలను ప్రవేశపెడుతున్నాయి. పిల్లలను నిరక్షరాస్యులుగా ఉంచడం, వారిని పాఠశాల బయటో లేక లోప లో ఉంచడం (అసర్ 2015), పేదరికం ఫలి తంగా కాదు, ప్రతికూల భావాలు, తప్పుడు విధానాల ఫలితం అది. విద్యాసంస్థల్లో పేదలు, అవకాశాలు లేనివారిని వేరుచేయటంతో తమ ప్రాథమికహక్కు అయిన విద్యను పొందే హక్కును వారికి తిరస్కరిస్తున్నారు. నేర్చుకోవటానికి మాతృభాష పునాదిగా ఉండాలని, ఆధిక్యత సాధించటానికి ఇంగ్లీషులో నైపుణ్యం సాధిం చాలని, కాని అదే సర్వస్వంగా ఉండరాదని చెబుతున్న మాటలు, చేస్తున్న ప్రచారాలకు వ్యతిరేకంగా పేద కుటుంబాలను కూడా ఫీజుల భారంతో కునారిల్లిపోయేలా ప్రైవేటు ఇంగ్లీష్ మీడియం పాఠశాలల వైపు నెడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలను మాతృభాష బోధించటం నుండి ఇంగ్లీష్‌ను బోధించే పాఠశాలలుగా మార్చాలనే తమ ఓటమికి దారితీసే డిమాండ్ ముందుకురావటానికి ఇది దారితీస్తున్నది.

ఈ విధంగా అంధకారం ముసురుకున్న పరిస్థితిలో ఆగస్టు 18, 2015న అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పు ముఖ్యమైనది. సమాజాన్ని కిందిస్థాయి నుండి మార్చటానికి సర్వమానవ సమానత్వం ప్రాతిపదికగా అన్ని తరగతుల పిల్లలు కలిసి చదవటం యొక్క ప్రజాస్వామిక ప్రాధాన్యతను నొక్కిచెప్పింది. ప్రాథమికస్థాయి లోనే పిల్లలందరిని కలపటం భిన్నమైన పరిణా మాలకు దారితీస్తుందని చెప్పింది. వారి హోదా ను, ధనాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకుని గొప్పవారు, మధ్యస్థాయి గొప్పవారు, సాధారణ

ప్రజల పిల్లలు చదివేవాటిగా పాఠశాలలను విభజించటం ప్రజాస్వామిక సమాజంలో విద్యాపరమైన పునాదిగాని, ప్రజాస్వామిక విలువలకు గాని సంబంధం లేనిది. అత్యధిక సంఖ్యాకులుగా ఉన్న భారతీయ పిల్లలకు తమ యొక్క ప్రాథమిక హక్కైన విద్యాహక్కు తిరస్కరింపబడుతున్నదని చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వం దానిని కాపాడే విధంగా మార్గదర్శకం చేయాలని సూచించింది. అదేమంటే ప్రభుత్వ ఉద్యోగులు, తాత్కాలిక ఉద్యోగులు, స్థానిక సంస్థలు, ప్రజాప్రతినిధులు, న్యాయశాఖ, అలాంటి అందరు వ్యక్తులు, ప్రభుత్వ నిధులు పొందుతున్న వారు, ప్రభుత్వం నుండి ఏ రకమైన ప్రయోజనం పొందినా, ప్రతిఫలం లేదా జీతం తదితరాలు పొందే వారందరూ ప్రాథమిక విద్యను నేర్చుకునే వయసున్న తమ పిల్లలందరినీ తప్పనిసరిగా బోర్డు చేత నడపబడే ప్రభుత్వ పాఠశాలలకు మాత్రమే పంపిచాలి. ఈ నిబంధనలను ఉల్లంఘించినవారికి పెనాల్టీ విధించే విధంగా నిబంధనలు రూపొందించాలి అని కోర్టు చెప్పింది.

“మరో ఆశాకిరణం ఏమంటే విద్యార్థుల యొక్క నిలకడైన, సాహసోపేతమైన పోరాటాలు. ఉన్నత విద్యకు సంబంధించిన అనేక సంస్థలలో ప్రమాదాలకు, వారి చదువు, భవిష్యత్తుకే కాక ఆఖరికి తమ ప్రాణాలకు కూడా ఆపాయం పొంచి ఉన్నా ప్రజాస్వామిక హక్కుల రక్షణకు తమ విజ్ఞానం ద్వారా అసమ్మతిని తెలుపుతున్నారు.”




నిరసన తెలుపుతున్న ఎఫ్‌టిఐఐ విద్యార్థులు

### కామన్ స్కూల్ విధానానికి ఒక అంగీకారం

ఆధునిక ప్రజాస్వామిక సమాజాలలో “సాధారణ పాఠశాల విధానం” అనే చారిత్రక వాస్తవాన్ని నెలకొల్పాలనే ప్రతిధ్వనిని ఆ తీర్పు ధ్రువీకరించింది. రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతతో ఏర్పరచే కామన్‌స్కూల్స్ తప్ప నాణ్యమైన, సార్వజనీనమైన విద్యావిధానం ఎప్పుడూ లేదు. ఆ తీర్పును వెంటనే ఒక్క ఉత్తరప్రదేశ్‌లో మాత్రమే అమలు చేయడం కాదు. అది భారతదేశంలోని అన్ని రాష్ట్రాలకూ వర్తించే విధంగా విస్తరింపజేయాలి.

మరో ఆశాకిరణం ఏమంటే విద్యార్థుల యొక్క నిలకడైన, సాహసోపేతమైన పోరాటాలు. ఉన్నత విద్యకు సంబంధించిన అనేక సంస్థలలో ప్రమాదాలకు, వారి చదువు, భవిష్యత్తుకే కాక ఆఖరికి తమ ప్రాణాలకు కూడా ఆపాయం పొంచి ఉన్నా ప్రజాస్వామిక హక్కుల రక్షణకు తమ విజ్ఞానం ద్వారా అసమ్మతిని తెలుపుతున్నారు. ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌టిఐఐ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, మద్రాస్ (ఐఐటి, మద్రాస్), యూనివర్సిటీ ఆఫ్ హైద్రాబాద్, యుజిసిని ఆక్రమించండి అనే పోరాటం ద్వారా జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, ఢిల్లీ యూనివర్సిటీ, అలహాబాద్ యూనివర్సిటీ, జాదవ్‌పూర్ యూనివర్సిటీలలో వారు ప్రజల నిజమైన ప్రతినిధులుగా తమ గొంతులను వినిపిస్తున్నారు.

అటువంటి పరిస్థితుల్లో మానవవనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ నుంచి తీవ్రమైన మార్పులను ఆశించగలమా? ప్రస్తుత ప్రభుత్వం విద్యా విధానంలో చేసుకుంటున్న “ప్రత్యేక జోక్యం”తో కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాలైన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమాలు, స్వచ్ఛ భారత్ ప్రచారం, సంస్కృతవారం, తప్పనిసరి భాగాలైన ప్రధానమంత్రి రేడియో ప్రసంగాలు, యోగాసనాలు, ఆఖరికి పిల్లలు ఏ పండుగలు తమ కుటుంబాలతో కలిసి జరుపుకోవాలో నిర్ణయించటం తదితరాలతో విద్యను మరింత దృఢంగా అధికారుల పట్టులోనికి తీసుకొస్తున్నారు. మరింత మోసపూరితంగా చారిత్రక, సామాజిక వాస్తవాలకు వక్రభాష్యం చెబుతున్నారు. పాఠ్యపుస్తకాల ద్వారా రాజకీయ సిద్ధాంతాన్ని సులభంగా చెప్పేవిధంగా పూనుకుంటున్నారు. అంతిమంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) యొక్క విద్యార్థి విభాగం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్తు (ఎబివిపి), అంబేద్కరిస్టులు, మార్క్సిస్టులు, చివరికి స్వతంత్ర ఆలోచన కలిగిన విశ్వవిద్యాలయ విద్యార్థులు, ఉపాధ్యాయులను తీవ్రవాదులుగా ప్రకటించి, జాతి వ్యతిరేకులుగా ముద్రవేసి క్రమశిక్షణా చర్యలను పూనుకోవడం దేశ విద్యాసంస్థల భవిష్యత్తుకు ఎదురుకానున్న ప్రమాదాన్ని స్పష్టం చేస్తున్నాయి.

కన్హయకుమార్‌లాంటి వాళ్లు తలెత్తని విద్యా సంస్థలను తాము రూపొందించనున్నట్లు రాజస్థాన్ విద్యాశాఖా మంత్రి 2016 మార్చిలో బహిరంగంగా ప్రకటన చేశారు జెఎన్‌యూ విద్యార్థిసంఘ అధ్యక్షుడు, అంగన్‌వాడీ వర్కర్ యొక్క కొడుకు కన్హయకుమార్, దళిత పరిశోధక విద్యార్థి రోహిత్ వేముల లాంటి వారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడకూడదు. వారు ప్రభుత్వం నుంచి ఉపకార వేతనాలు తీసుకుంటున్నారు కాబట్టి ప్రభుత్వ విధానాన్ని ప్రశ్నించకూడదు.


ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఆందోళనలు చేయకూడదని చెబుతున్నారు. సుబ్రహ్మణ్యం కమిటీ రిపోర్టు నుండి తాజాగా విడుదలైన ‘లీకు’ ద్వారా వెల్లడైన విషయమేమంటే అసమ్మతులు, ఆందోళనలు “సాధారణ అకడమిక్ కార్యకలాపాలలో జోక్యం చేసుకోవడం” లాంటివి “రాజకీయంగా చురుకైన విద్యార్థుల కారణంగా జరుగుతున్నాయి. ఇవి శ్రద్ధతో చదివే మెజారిటీ విద్యార్థులకు నష్టం కలిగిస్తున్నాయి అని చెప్పారు. ఈ విధంగా ఆందోళనలు చేసే విద్యార్థులకు హాస్టల్ సౌకర్యాలను కుదిస్తారు. కులం, మతం ప్రాతిపదికగా నడుస్తున్న విద్యార్థి సమూహాల గుర్తింపును రద్దు చేస్తారు. (ఇండియన్ ఎక్స్‌ప్రెస్ జూన్ 16, 2016)

మానవవనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ తన దుస్సాహసాల నుండి ఏమీ నేర్చుకోలేదని, విద్యరంగం, విద్యాసంస్థలు ఆందోళనలలో మునిగి ఉండటం కొనసాగుతుందని స్పష్టమౌతున్నది.

**అనువాదం : కె నాగమల్లేశ్వరరావు**

విశ్లేషణ

# జాతీయవాదం, హిందుత్వ, ఆలోచనలపై దాడి



రచయిత ప్రముఖ ఆర్థికవేత్త

**ప్రభాత్ పట్నాయక్**

బూర్జువా జాతీయవాదులు 'దేశం' అంటే ప్రజలకన్నా భిన్నమయినదని, ప్రజలకన్నా ఉన్నతమయినదని ఎప్పుడూ భావిస్తారు. ప్రజలు దేశంకోసం 'త్యాగాలు' చేయాలి. కాని వారి బతుకులు 'దేశం' స్థాయికి అనుగుణంగా ఉండాల్సిన అవసరం లేదు. ఈభావన పెట్టుబడి దారీ విధానంలోని అన్ని స్థాయిలలోనూ ఇలాగే ఉంటుంది. వెస్ట్‌ఫాలిస్ శాంతి ఒప్పందం తరువాత వాడుకలోకి వచ్చిన 'జాతీయవాదం' వ్యాపార పెట్టుబడితో ముడిపడి ఉంది. సైద్ధాంతికంగా ఇది దేశంలో పోగుపడిన బంగారం,వెండి సంపదను బట్టే దేశ సౌభాగ్యం ఉంటుందని నమ్ముతుంది. అందువలననే యూరప్ 'దేశాలు' ప్రపంచవ్యాప్తంగా ఒక దానితో ఒకటి పోటీపడి దేశసంపదను రుజుమార్గంలోనన్నా పెంచుకున్నారు, లేదా ఇతర మార్గాలలో, అంటే దోచుకునో, కొల్లగొట్టో, బానిసలను ఉపయోగించి బంగారు గనుల నుండి బంగారం తీయించో, వలసదేశాల నుండి సరుకులను బలవంతంగా లాక్కొని వాటిని అమూల్య లోహాలకు మారకం చేసుకునో పోగుచేసుకున్నారు. అయితే ఇలా పోగుచేసిన సంపద ఆ'దేశ' ప్రజల జీవితాలను మెరుగు పరచలేదు. మెరుగుపరచాలని అనుకోలేదు. సరికదా అందుకు విరుద్ధంగా జాన్ మెనార్డ్ కీన్స్ వాదించినట్టు, స్పెయిన్ బంగారం యూరప్‌లోనికి వచ్చినందువలన బ్రిటన్, హాలెండ్ లాంటి దేశాలలో ధరలు పెరిగి పోయాయి. ధరల కనుగుణంగా కార్మికుల జీతాలు పెరగక పోవడం వలన వారి జీవితాలు మరింత దుర్భరంగా మారాయి. నిజానికి కార్మికుల నిజవేతనాలు పడిపోవడం వలననే తదనంతర కాలంలో పారిశ్రామిక పెట్టుబడి ఈ దేశాలలో అభివృద్ధి చెందిందంటారు కీన్స్. పారిశ్రామిక పెట్టుబడిని ముందుకు తెచ్చిన బుర్జువా సైద్ధాంతిక వేత్త, అడామ్‌స్మిత్ దేశసంపద వెండి, బంగారం నిల్వలపై ఆధారపడి ఉండదు. కాని 'దేశ' పెట్టుబడి నిల్వలపై ఆధారపడి ఉంటుందని నిర్వచించాడు. అందువలన దేశ సంపద పెరిగేందుకు అనువుగా, పెట్టుబడి పోగుపడేందుకు అడ్డంగా ఉన్న ఆంక్షలన్నింటినీ తొలగించాలని అన్నాడు. అయితే ఆయన కూడా 'దేశం'లో పెట్టుబడి పోగుపడినందువలన కార్మికుల జీవితాలు మెరుగవుతాయని అనుకోలేదు. అయితే పెట్టుబడి స్థిరంగా ఉన్నప్పటికన్నా, పెట్టుబడి పోగుపడినప్పుడు నిజవేతనాలు పెరుగుతాయన్నాడు. రికార్డో అనే ఆనాటి మరో ప్రామాణిక సైద్ధాంతిక వేత్త కూడా ఇలాగే ఆలోచించారు. 'దేశ' సంపదను పెంచే 'జాతీయవాదం' దేశాన్ని ప్రజలకన్నా మిన్నగా చూసింది. పారిశ్రామిక పెట్టుబడి యుగంలో కూడా ఇదే జరిగింది.

'జాతీయవాదం' యొక్క ఈ భావన ద్రవ్య పెట్టుబడి యుగంలో మరింత స్పష్టంగా కనిపిస్తున్నది. రుడాల్ఫ్ హిల్‌ఫర్డింగ్ రచన 'ది ఫైనాన్స్ కాపిటల్'ని లెనిన్ ఎక్కువగా ఉటంకించారు. అందులో ఆయన 'జాతీయ భావమును కీర్తించడమే ద్రవ్య పెట్టుబడి సిద్ధాంతం' అంటారు.

వివిధ దేశాలలోని ద్రవ్యాధిపతులలో ఒకొక్కరి ఆధీనంలో పారిశ్రామిక, బ్యాంకు పెట్టుబడి పోగుపడి ఉంటుంది. సామ్రాజ్యవాద ఆధిపత్యానికై వీరు ఒకరితో ఒకరు యుద్ధాలకు దిగుతుంటారు. ఈ యుద్ధాలలోని కందకాలలో కార్మికులు ఒకరినొకరు చంపుకోవలసి వస్తుంది. కాని ఈ యుద్ధాలు కార్మికుల స్థితిగతులు మెరుగుపరిచేందుకు జరిగాయని సైద్ధాంతిక ప్రచారం కోసం అయినా వారు ఎప్పుడూ అనలేదు.

ఈ మధ్యకాలంలో బాగా అభివృద్ధిచెందిన దేశాలలో 'జాతీయవాదం' 'అధికారికంగా' అయినా కొంతమేరకు వెనకపట్టు పట్టింది. ద్రవ్య పెట్టుబడి ప్రపంచీకరించబడడం, అంతర్జాతీయం చెందడం దీనికి కారణం. అయితే జాతీయవాదం వెనకపట్టు పట్టడం దేశ ప్రజలకన్నా 'జాతీయవాదం' ఉన్నతమయినదనే బుర్జువా జాతీయవాద ఆలోచనను ఏమాత్రం తగ్గించలేదు. ఎందుకంటే దాని ప్రయోజనాలు కార్మిక వర్గ ప్రయోజనాలలతో ఏకీభవిస్తాయని వారు భావించలేదు. పెట్టుబడి ప్రయోజనాలతోనే ముడిపడి ఉన్నదని భావించారు.

భారతదేశం లాంటి వలస దేశాలలో 'జాతీయవాదం' ఇందుకు పూర్తిగా బిన్నమయినది. 'సంపద తరలిపోవడం' పారిశ్రామిక రహితం చేయటం' సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట సైద్ధాంతిక పునాదిగా ప్రజలలో పాతుకుపోయాయి. 1930లలో రైతాంగం తీవ్ర విపత్తులో ఉన్నకాలంలో సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం ఊపందుకున్నది. (దీని ప్రభావం వ్యవసాయ కూలీలపైనా ఉండింది) దీనికి కారణం మహామాంద్యం వలన ధరలు పడిపోవడం, ఉత్పత్తుల మారకం విలువ క్షీణించడం. అందువలన ఈ పోరాటాలతో ముడిపడిన జాతీయవాదం ప్రజల జీవన ప్రమాణాలు పెరగాలని కోరుకున్నది. అంటే ప్రజలకన్నా 'జాతి' ఉన్నత స్థాయిలో చూడబడలేదు. ప్రజల జీవనం మెరుగుపడడంగా చూడబడింది. బుర్జువా 'ఆధిపత్య' జాతీయవాదం కాక ఈ జాతీయవాదం విస్తృతంగా ప్రజాసమూహాలను కలుపుకునే జాతీయవాదం. ప్రపంచంలో పోరాడుతున్న ఇతర ప్రజానీకంపై ఆధిపత్యానికి బదులుగా సౌహార్ద్రతను పెంచుకునే జాతీయవాదం. అందువలన విస్తృతమయిన ప్రజాబాహుళ్యాన్ని కలిపేందుకు 'జాతి' ఏ రూపంలో తీర్చిదిద్దబడుతుందో తెలియజేసేలా, ప్రజలందరినీ కలిపే 'సామాజిక ఒప్పందం' ప్రాతిపదికగా ఒక కార్యక్రమాన్ని ముందుకు తీసుకురావాలి.

1931లో కరాచీ కాంగ్రెస్‌లో జరిగినది ఈరకమయిన సామాజిక ఒప్పందమే. దీనికి తోడు 1937 ఎన్నికలకు ముందు కాంగ్రెస్ వాగ్దానం చేసిన భూసంస్కరణలు ఎన్నికల ఫలితాలను తీవ్రంగా ప్రభావితం చేశాయి. ఈ

కరాచీ తీర్మానం మిగిలిన అన్ని విషయాలతో పాటుగా ఈ క్రింది కార్యక్రమాలనూ అందులో చేర్చింది. అందరికీ ఓటుహక్కు, లింగ, కుల, జాతి వర్గ బేధాల కతీతంగా చట్టం అందరికీ సమానంగా వర్తింప జేయడం, మతం నుండి రాజ్యాన్ని వేరు చేయడం, ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్య, మరణశిక్ష రద్దు చేయాలని చెప్పింది. కరాచీ తీర్మానం కార్యక్రమం లాంటి కార్యక్రమాలనే ప్రపంచంలోని అణచివేయబడుతున్న మూడవ ప్రపంచ దేశాలలో కూడా తీసుకున్నారు. వీటికి ముఖ్యమైన ఉదాహరణ దక్షిణాఫ్రికా ఫ్రీడమ్ చార్టర్.

> **“అయితే ప్రజలకంటే ‘జాతి’ని ఉన్నతంగా ఉంచే ఈ అవగాహన కంటే భిన్నమయిన అవగాహన గలిగిన, వలస వాదాన్ని వ్యతిరేకించిన జాతీయవాదాన్ని వర్గ ప్రాతిపదికన ఎలా వివరించగలం? దీనికి సమాధానం ఏమంటే, వలసవాద వ్యతిరేక పోరాటంలో బుర్జువా వర్గం నాయకత్వ స్థానంలో ఉన్నప్పటికీ అది కేవలం బుర్జువా పోరాటమే కాదు. అన్ని వర్గాల పోరాటం.”**

సహజంగానే ఇప్పుడొక ప్రశ్న వస్తుంది. ఆది భౌతికవాద అవగాహనతో బుర్జువావర్గం ముందుకు తెచ్చే జాతీయవాదాలలో ఒకటి ఈ ఆధిపత్య జాతీయవాదం. అయితే ప్రజలకంటే ‘జాతి’ని ఉన్నతంగా ఉంచే ఈ అవగాహన కంటే భిన్నమయిన అవగాహన గలిగిన, వలసవాదాన్ని వ్యతిరేకించిన జాతీయవాదాన్ని వర్గ ప్రాతిపదికన ఎలా వివరించగలం? దీనికి సమాధానం ఏమంటే, వలసవాద వ్యతిరేక పోరాటంలో బుర్జువా వర్గం నాయకత్వ స్థానంలో ఉన్నప్పటికీ అది కేవలం బుర్జువా పోరాటమే కాదు. అన్ని వర్గాల పోరాటం. ఇందులో కార్మికులు, రైతులు ఉన్నారు. వీరందరినీ కాదని బుర్జువా వర్గం తనసొంత ఎజెండాను ముందుపెట్టలేక పోయింది.

విభిన్న వర్గాలు కలిసి చేసిన వలసవాద వ్యతిరేక పోరాటంలో ఆధిపత్య స్థానంలో ఉన్నప్పటికి, ఆ పోరాటంలో బుర్జువావర్గం కూడా ఒక భాగంగా ఉంది. అనేక సందర్భాలలో బూర్జువా ఆధిపత్య జాతీయవాదం మనం ముందు చెప్పుకున్న సంఘటిత జాతీయవాదంలోకి అల్లుకు పోయింది. అందువలననే అటువంటి జాతీయవాదం పేరుతో జరిగే రాజకీయ కార్యాచరణను ఆదర్శంగా చూడకుడదు. అంతేకాదు, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత పెట్టుబడిదారి విధానం అభివృద్ధి జరుగుతున్న క్రమంలో వలసవాద వ్యతిరేక పోరాటంలో మమేకమయిన సంఘటిత జాతీయవాదం ఎలాగైనా నిర్లక్ష్యానికి గురవుతుంది. అయితే క్రింద చర్చించబోయే రెండు రకాలయిన జాతీయవాద భావనల బేధాలపై ఈ వాస్తవం ఎటువంటి ప్రభావం చూపదు.

**2**

స్వాతంత్ర్యం వచ్చిన తదనంతర కాలంలో రాజకీయాలకు చెందిన ఎజెండా అయిన, సార్వజనీన ఓటుహక్కు, చట్టంముందు సమానత్వం, రాజ్యం నుండి మతాన్ని వేరు చేయడం (కనీసం రాజ్యం మత ప్రాతిపదికన ఏర్పడక పోవడం), పౌరులకు కొన్ని ప్రాథమిక హక్కులు కల్పిచడం రాజ్యాంగంలో పొందుపరచబడ్డాయి. మిగిలిన విషయాలకు వచ్చేసరికి, ముఖ్యంగా భూసంస్కరణల లాంటివి వెనకపట్టుపట్టాయి. కొంతమంది భూస్వాములు, ముఖ్యంగా పెట్టుబడిదారీ పంథాలోకి వచ్చేందుకు ఇష్టపడని వారు, భూములను వదులుకోవలసి వచ్చిన మాట నిజమే. ఇది ధనిక రైతులకు పంచబడింది. కాని భూమి కొద్దిమంది చేతులలోనే కేంద్రీకరించి ఉండడంలో ఏ మాత్రం మార్పురాలేదు. ఇంకో విధంగా చెప్పాలంటే పై 15 శాతం మంది వద్దనున్న భూమి ఏ మాత్రం తగ్గలేదు. జరిగిన దేమంటే పై 15 శాతంలోని కొంతమంది చేతుల్లోని భూమి మరికొందరి చేతుల్లోకి మారింది. ఇది భారతదేశ వ్యవసాయంలోకి పెట్టుబడిదారీ విధాన ప్రవేశాన్ని సుగమం చేసింది. ఫలితంగా భారతదేశ వ్యవసాయం భూస్వాములు, పెట్టుబడిదారీ రైతుల కలయికగా తయారయింది.

రాజ్యాంగంలో రాజకీయంగా పౌరులందరికీ పొందుపరచబడిన ‘సమానత్వం’ పెట్టుబడిదారీ వ్యవస్థకు మూలమయిన అసమానత్వం ముందు తలవంచింది. రాజ్యాంగ సభలో అంబేద్కర్ కూడా ఇటువంటి అవకాశాలనే ఎత్తిచూపించారు. అయితే రాజకీయ నాయకత్వం స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ప్రైవేటు పెట్టుబడులు రాజ్యంయొక్క ఆర్థిక, సామాజిక నియంత్రణలో ఉంటాయని, ప్రైవేటు పెట్టుబడులపై పెట్టిన నియంత్రణ, అంక్షల వలన రెండు ప్రపంచాలలోని ఉన్నతమైన వాటి ద్వారా వచ్చే లాభాలను దేశం పొందగలుగుతుందని భావించింది. దేశ ఆర్థికాభివృద్ధిలో ప్రైవేటురంగం భాగస్వామ్యం ఉన్నా ఈ నియంత్రణలతో అసమానతలను పరిమితిలో పెట్టగలమని నమ్మారు.

ఈ నడక వాస్తవానికి అసాధ్యం. అందువలననే ఆదాయాలలోను, సంపదలోనూ వ్యత్యాసాలు తీవ్రంగా ఉండడం వలన 1960లో నెహ్రూ మహలనోబిస్ కమిటీని నియమించి ఈ విషయాన్ని పరిశీలించమన్నారు. ఏమయినప్పటికీ వృద్ధిలో అసమానతలను కట్టడి చేసేందుకు ఏర్పాటు చేసిన నియంత్రణలు 1991లో నూతన ఉదారవాద విధానాల అమలు ప్రారంభమయిన తరువాత తొలగించబడ్డాయి. నయాఉదారవాద విధానాలకు మళ్ళడం అంటేనే పెట్టుబడిదారీ ‘స్వేచ్ఛాయుత ప్రవృత్తి’కి మళ్ళడం. చిన్న పెట్టుబడిదారులను, చిన్న రైతులను కొల్లగొట్టి పెట్టుబడి ఆదిమ సంచయనం వైపు మొగ్గడం, ప్రతి పార్శ్వాన్ని సరుకుగా మార్చే ప్రయత్నాన్ని సంపూర్ణంగా అనుమతించడం (విద్య, వైద్యం


## ‘మార్క్సిస్టు’ పై మీ అభిప్రాయాలు తెలపండి!

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, ‘మార్క్సిస్టు’** సైద్ధాంతిక మాసపత్రిక

ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

> **"నయా ఉదారవాద విధానాల ఆచరణ ప్రభావం భారతదేశం లాంటి దేశాలలో మరిం త ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే ఎక్కువమంది ఉత్పత్తిదారులపై ప్రాధమిక పెట్టుబడి సంచయం రుద్దబడుతుంది, వారి ఆదాయాలు కుంచించ బడతాయి. (బై ఫ్లో టెర్మ్స్) వారి వద్దనుండి ఆస్తులు కారుచవకగా దూరం చేయబడతాయి (ఇన్ స్టాక్‌టెర్మ్స్)."**

వంటి సేవలను ప్రైవేటు పరం చేయడం). ఇక పై ఏ ఆంక్షలూ ఉండవు. ఉన్న కొద్దిపాటు ఆంక్షలూ పూర్తిగా రద్దు అవుతాయి.

అధికారిక ప్రకటనలలో కూడా నూతన ఆర్థిక విధానాలు అంటేనే ఇప్పటి వరకు అమలవుతున్న సంఘటిత జాతీయవాదం నుండి సాంప్రదాయకంగా వస్తున్నటువంటి ఆధిపత్య జాతీయవాదం వైపుమళ్ళడం. అసంఖ్యాక కష్టజీవుల జీవితాలు ఎలా గడుస్తున్నాయో తెలుసుకోవలసిన అవసరం లేని, కేవలం స్థూల దేశీయ ఆదాయం పెరుగుదలనే దేశ అభివృద్ధికి కీలక సూచికగా చూడడమే ఇందుకు ఉదాహర ణగా చెప్పుకోవచ్చు. ఇది వ్యాపార, ప్రామాణిక రాజకీయ అర్థశాస్త్రాల కొనసాగింపే. అయితే భారతదేశం 'అత్యంత గొప్ప ఆర్థికశక్తి'గా ఎదుగుతున్నదని చెప్పడానికి సాధారణంగా కొంత సందేహిస్తున్నాను. ప్రతి సమస్యను అంతర్జాతీయంగా చూడడం మొదలయింది.

నిజానికి యుపిఎ హయాంలో ఒక సీనియర్ కేబినేట్ మంత్రి ఒకసారి లంచగొండి తనమే భారతదేశం అత్యంత శక్తివంతమైన దేశంగా ఎదగడానికి అవరోధం అని అన్నాడు!

వలసవాద వ్యతిరేక సంఘటిత జాతీ యోద్యమ కవచాన్ని ఛేదించుకుని బూర్జువా జాతీయవాదం బయటపడుతున్న కాలంలోనే గుత్త పెట్టుబడిదారులు మరింతగా ప్రపంచీకరణ చెందారు. వారికి మిగిలిన వారికి మధ్య అంత రం మరింతగా పెరిగింది. ఇప్పుడొక ప్రశ్న వస్తుంది. బూర్జువాలే ప్రపంచీకరణ చెందు తుండగా బూర్జువా జాతీయవాదం ఉద్భవిం చాల్సిన అవసరం ఏముంది? పెట్టుబడి ప్రపంచీ కరణ చెందిన ఈ యుగంలో అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలంటేనే బూర్జువా జాతీయ వాదాన్ని దాటివెళ్ళడం అని అనిపిస్తున్నప్పుడు మనదేశం లాంటి దేశాలలో ఆధిపత్య జాతీయ వాదంపై వక్కాణింపు ఎందుకు? ఈ రోజు అది భౌతికభావంగా 'జాతి'ని ప్రజలకంటే ఉ న్నతంగా చూపిస్తున్న హిందుత్వ శక్తులు ఈ



రోమిల్లా థాపర్

సవాలునే చేస్తున్నాయి. ప్రపంచీకరణకు వ్యతిరేకంగా కాక ప్రపంచీకరణను సమర్థించే శక్తుల ఎజెండాలో దీని అవసరం ఏమొచ్చింది?

దీనికి సమాధానం బాగా అభివృద్ధి చెందిన దేశాలలో పరిస్థితులకు భారతదేశం లాంటి దేశాలలో పరిస్థితులకు మధ్యనున్న తేడాయే. ఈ తేడా కనీసం మూడు విధాలుగా ఉంటుంది.

1. సాపేక్షంగా ఇక్కడున్న శ్రామిక సైన్యం (ఇందులో బాహాటంగా ఉన్న నిరుద్యోగులు, క్యాజువల్ ఉద్యోగులు, అడపాదడపా ఉద్యోగం చేసేవారు, సరైన ఉద్యోగం లేనివారు, కనపడని నిరుద్యోగం) అభివృద్ధి చెందిన దేశాలకంటే ఎక్కువ. ఇందువలన ఒకవైపు సార్వత్రిక ఎన్నికల వలన ప్రజాస్వామ్యయుతంగా సంస్థలుండడం, మరోవైపు దుర్భర జీవితాలను గడుపుతూ, ఆవలేఉండే పరిస్థితులలో అత్యధిక సంఖ్యాకులు ఉండడం వలన నిరంతరంగా రెండిటి మధ్య ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది.

2. అభివృద్ధి జరిగినా ఉద్యోగ నియామ కాలు అందుకనుగుణంగా పెరగవు. కార్మికుల కొరత ఏర్పడదు, కార్మికులకు వేతన బేరసారాలు చేసుకునే శక్తి మెరుగుపడదు. అంటే ఉత్పత్తిలో మిగులు వాటా పెరిగిన కొద్దీ అసమానతలు పెరుగుతుంటాయి. ఇది అభివృద్ధి చెందిన దేశాలకంటే మనదేశంలోనే ఎక్కువగా ఉంటుం ది. ఎందుకంటే అక్కడ ఇప్పుడు ఇంత అభివృద్ధి లేదు.

3. నయా ఉదారవాద విధానాల ఆచరణ ప్రభావం భారతదేశం లాంటి దేశాలలో మరిం త ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే ఎక్కువమంది ఉత్పత్తిదారులపై ప్రాధమిక పెట్టుబడి సంచయనం రుద్దబడుతుంది, వారి ఆదాయాలు కుంచించ బడతాయి. (బై ఫ్లో టెర్మ్స్) వారి వద్దనుండి ఆస్తులు కారుచవకగా దూరం చేయబడతాయి (ఇన్ స్టాక్‌టెర్మ్స్).

రెండు పరిస్థితులలో ఉన్న ఈ తేడావలన అభివృద్ధి చెందిన దేశాలకంటే ప్రజాస్వామ్య సంస్థలున్న భారతదేశం లాంటి దేశంలో నయా ఉదారవాద విధానాలకు రాజకీయ మద్దత్తుకు ముప్పు (ఇప్పుడున్న సంక్షోభ సమయంలో అక్కడ కూడా కొంతవరకు ముప్పు ఉంది) ఎక్కువ. అయితే నయా ఉదారవాద విధానం ఎప్పుడూ సమస్యలకు తక్షణ పరిష్కారాలు చూపుతుంది. అందులో ఈ క్రిందిది ఒకటి.

అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ప్రపంచ ద్రవ్య ప్రవాహం అగ్రభాగాన చిక్కుకుని ఉన్నంత వరకు దానికి అనుగుణంగా లేని విధానాలు అమలయితే ఆర్థిక వ్యవస్థ నుండి ఎగిరిపోతుం ది. ప్రపంచీకరణలో ప్రపంచ ద్రవ్య ప్రవాహం భాగమయినప్పటికీ అత్యధిక రాజకీయ వ్యవస్థలు ఈ రెంటినీ విడదీసి ఉంచుతాయి. ప్రపంచ పెట్టుబడి డిమాండ్లకే తలఒగ్గుతాయి. అంటే రాజ కీయ వ్యవస్థలు ఒకటిపోయి మరొకటి వచ్చినా నయాఉదారవాద విధానాలు మాత్రం కొనసాగు తూనే ఉంటాయి. దేశ ఆర్థిక అధికారులందరూ ప్రపంచబ్యాంకు, ఐఎమ్ఎఫ్‌ల నుండే రిక్రూట్ చేసుకోబడినందు వలన కూడా ప్రభుత్వాలు మారినా విధానాలు మారవు.

అయితే ప్రజాతంత్ర రాజకీయాల నుండి నయాఉదారవాద విధానాలను ఈ విధంగా రక్షించుకోవడం ప్రజాతంత్ర రాజకీయాలను కట్టడి చేయడం అవుతుంది. ఇది ఎల్లప్పుడూ సంభవం కాకపోవచ్చు, అందుకే కార్పొరేట్ ద్రవ్య పెట్టుబడిదారులు మరికొన్ని మార్గాలు కూడా అదనంగా సిద్ధం చేసుకుంటారు. ప్రజలు తమ ప్రజాస్వామ్య హక్కులకై వత్తిడి చేసినా నయా ఉదారవాద విధానాలకు భంగం వాటిల్లకుండా చూసుకుంటారు.

ఈ ఇతర మార్గాల అవసరం ఆర్థిక సంక్షోభకాలంలో మరింత ఎక్కువగా ఉంటుంది,

ఇప్పటి ప్రపంచ ఆర్థిక సంక్షోభ పరిస్థితిలోలాగా ఇక్కడ మనం ఒక ముఖ్యమయిన తేడాను గమనించాలి. వృద్ధి ఎక్కువగా ఉన్నప్పుడు అసమానతలు పెరుగుతాయి. కాని సంక్షోభకాలంలో అందుకు విరుద్ధంగా జరగదు. మరింత పెరుగుతుంది. అలాగే అభివృద్ధి కాలంలో ఉద్యోగాలు పెరగకపోవడం వలన నిరుద్యోగుల సంఖ్య పెరుగుతుంది. అంతేకాదు నయా ఉదారవాద విధానాల వలన ఎంతోకొంత లాభపడిన, ఈ విధానాలకు పూర్తిగా మద్దత్తుఇచ్చే మధ్యతరగతి కూడా భ్రమలకు దూరమవుతారు. ఐటిలాంటి సేవారంగాలలో ఉద్యోగావకాశాలు కుచించుకుపోవడం మొదలయిన తరువాత అసంతృప్తికి లోనవుతారు.

ప్రజలను విభజించి, మత ప్రచారం ద్వారా వారిని సమీకరించగలిగి, అదే సమయంలో నయా ఉదారవాద విధానాలను కొనసాగించే మితవాద శక్తుల మద్దత్తు కార్పొరేట్ ద్రవ్య పెట్టుబడి దారులకు అవసరం. ముఖ్యంగా సంక్షోభ సమయంలో ఈ అవసరం మరింత ఎక్కువ. కార్పొరేట్ మితవాద కూటమి తయారయి 'జాతి'ని ప్రజల కంటే ఉన్నతంగా నిలిపే ఆది భౌతికవాద సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చి, ప్రజలను 'త్యాగాలు' చెయ్యమని డిమాండ్ చేస్తుంది. 'జాతి' పేరు చెప్పివారి ప్రజాస్వామ్య హక్కులనూ త్యాగం చేయమంటారు. 'అరుణ్‌జైట్లీగారు 'జాతి'కన్నా భావస్వాతంత్ర్యం ప్రధానం కాదన్నప్పుడు ఆయన ఇదే పని చేస్తున్నారు. ప్రజలను వారి భావ స్వాతంత్ర్యాన్ని త్యాగం చేయమంటున్నారు. (ఇది ప్రజల ప్రాథమిక హక్కును 'జాతి' అనే అదిభౌతిక భావనకు లోబరచాలని చెప్పడం)

ఇది కొద్దిమంది కార్పొరేట్ ద్రవ్య పెట్టుబడిదారులకు మద్దత్తుగా రూపొందించబడిన అధిపత్య దేశభక్తి సిద్ధాంతమే 'జాతి' అనే ఆదిభౌతిక భావన. స్థూల జాతీయోత్పత్తి పెరుగుదలతో తృప్తిపడతారు. కాబట్టి జాతీయ, అంతర్జాతీయ కార్పొరేట్ పెట్టుబడి దారుల 'నమ్మకాన్ని' పెంచడం అత్యవసరంగానూ, అందుకవసరమయిన అన్ని రాయితీలు కార్పొరేట్ పెట్టుబడులకు కల్పించడం 'జాతీయవాదం' గానూ తయారవుతుంది. ఈ విధంగా కార్పొరేట్ ద్రవ్య పెట్టుబడిదారులు ప్రత్యర్థుల పైకి చాకచక్యంగా అస్త్రం సంధించారు. సంక్షోభకాలంలో ప్రజాతంత్ర సంస్థల నుండి ముప్పు ఎదుర్కొనే బదులు, వారి అధికారాలను చట్టబద్ధం చేసుకుంటున్నారు. మరిన్ని రాయితీలు పొందుతున్నారు. 'జాతి' పేరుచెప్పి ప్రజలను మరిన్ని త్యాగాలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**"జాతి జనులందరూ పాలు పంచుకున్న జాతీయవాదం లో ఒక సమానత్వమనే నమ్మకం మమేకమై ఉంది. ఇది సామాజిక, రాజకీయ జీవనంపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. ఎంత ప్రభావాన్ని చూపిందంటే 'భారతీయ దీర్ఘ విప్లవంగా' దీనిని అనడం ఏ మాత్రం అతిశయోక్తి కాదు."**



సువీరా జైస్వాల్

ఈ రకమయిన జాతీయవాదం హిందుత్వ లాంటి మితవాదులకు కూడా లాభదాయకం. వారి ఎజెండాకు కేంద్రం హిందూ రాష్ట్రమే. కాని హిందూమతానికి మిగిలిన సెమెటిక్ మతాల లాగా ఒక పుస్తకమో, ఒకగుడో లేదు. చరిత్రకారిణి రొమిల్లా థాపర్ ప్రకారం విదేశీయులు మనలను నిన్న మొన్నటి వరకు హిందూ మత గ్రూపులనే అనేవారు. అందువలన హిందూరాష్ట్రమన్నది ఒక మత రాజ్యం మాత్రమే కాదు, ఒక ఆధిపత్య రాజ్యం. ఇక్కడ కొద్దిమంది రాజ్యవిధానాలకు రూపకల్పన చేస్తారు. ప్రజాసంఘటిత, వలస వ్యతిరేక జాతీయ వాదమంటేనే హిందుత్వశక్తులకు గిట్టదు. అందుకే వలస పాలనకు వ్యతిరేక పోరాటంలో వారెన్నడూ పాలు పంచుకోలేదు. ప్రజలు పాలు పంచుకున్న జాతీయవాదాన్ని వెనక్కునెట్టి అధిపత్య జాతీయవాదమనే అదిభౌతిక జాతీయవాదాన్ని ముందుకు తెచ్చి, 'జాతి' ప్రజలకు అతీతమంటూ, ప్రజాస్వామ్య సంస్థలకు అతీతంగా ఏ కొద్దిమందో 'జాతి' గురించి మాట్లాడుతుండడం వారి ఎజెండాలో అంతర్భాగం.

ఇక్కడ మరో మాట చెప్పుకోవాలి. సువీరా జయస్వాల్ వాదించినట్టు సంస్థానీకరించబడిన హిందుత్వకేంద్ర బిందువు కులవ్యవస్థ. జాతి జనులందరూ పాలు పంచుకున్న జాతీయవాదం లో ఒక సమానత్వమనే నమ్మకం మమేకమయి ఉంది. ఇది సామాజిక, రాజకీయ జీవనంపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. ఎంత ప్రభావాన్ని చూపిందంటే 'భారతీయ దీర్ఘ విప్లవంగా' దీనిని అనడం ఏ మాత్రం అతిశయోక్తి కాదు. వేల సంవత్సరాలు వ్యవస్థీకరించబడిన అసమానతలతో మగ్గినవారు, కుల అణచివేతకు గురయిన వారు, ఇప్పుడు సమానులని రాజ్యాంగం ప్రకటించడం చిన్న విషయం కాదు. ఇరవైయో శతాబ్దం మొదటిలో కూడా 'అంటరాని తనమే' కాదు, చూడనిషిద్ధం ఉన్న కేరళ ఈ రోజు మానవాభివృద్ధి సూచికలో ముందుండడం ప్రపంచంలోనే అభినందించబడుతున్న విషయం. దీనికి కారణం కొంతమేరకయినా సమానత్వమే. ఇది చిన్న విషయం కాదు.

హిందుత్వ శక్తులు 'దీర్ఘవిప్లవానికి' ప్రతిగా ప్రతీఘాత విప్లవానికై నిలబడుతున్నారు. సంఘటిత జాతీయవాదాన్ని వెనక్కు నెట్టి, పౌరులందరూ సమానమన్న సౌభ్రాతృత్వాన్ని, ప్రజాతంత్ర దార్శనికతను కాదని, పాత ఆధిపత్యాన్ని తిరిగి నెలకొల్పేందుకు అనుగుణంగా ప్రపంచాన్ని మార్చడమే వారి లక్ష్యం. ఆధిపత్య జాతీయవాదం ఇందుకు ఉపయోగపడుతుంది.

సంక్షిప్తంగా కార్పొరేట్లకు, మితవాదులకు కూడా 'జాతి'ని ప్రజల కన్నా ఉన్నతమయినదిగా చూపే ఆధిపత్య జాతీయవాదాన్ని ప్రచారం చేయడం లాభదాయకం. ఎన్.డి.ఏ ప్రచారం చేస్తున్న జాతీయవాదం వలసవాద వ్యతిరేక సంఘటిత జాతీయవాదం కాదు. రెండూ ఒకటేనని ప్రజల మనసులలో జొప్పించి దానివల్ల తన ప్రతిష్ఠ పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నది. నిజానికి దాని జాతీయవాదం సంఘటిత జాతీయవాదానికి విరుద్ధమయినది ఇది కార్పొరేట్ మితవాదుల చేతిలో నయా ఉదారవాద విధానాల సిద్ధాంతాన్ని కొనసాగించే అస్త్రం. అంటే కార్పొరేట్ ద్రవ్య పెట్టుబడి ఆధిపత్యం

> "కాని రాజకీయాలు మౌలికంగా సమాజానికి ప్రత్యామ్నా యాలను సూచిస్తాయి. విద్యార్థులు సమాజంలో ఒక భాగం. అందు లోనూ లోతుగా ఆలోచించి, తర్కించి, ఆచరించి, సమాజానికి వివిధ ప్రత్యామ్నాయాలను సూచించగలిగిన వారు. వీరికి రాజకీ యాలు వద్దంటే అర్థం వారు ఆలోచనలు మనుకోవాలనే. వారి విద్య ఆలోచనలు లేని విద్య అయి ఉండాలి."

కొనసాగింపుకు ఏ ప్రజాతంత్ర సంస్థ సవాలు నయినా ఎదుర్కొనేందుకు, వాటిని నిర్వీర్యం చేసేందుకు ఉపయోగపడే ఆయుధం. జాతీయ వాదం తీవ్రంగా చేసే ప్రచారం రాజ్యం స్వరూ పంలో మార్పుతో అనుబంధమయి ఉంది. నయా ఉదారవాద విధానాలు ఆధిపత్యం సంపా దించి స్థిరీకరించబడుతున్నాయి. అత్యవసర పరిస్థితిని స్థాపించకుండా, సైన్యాన్ని మోహరించ కుండా, కొంత మంది మతతత్వ ఫాసిస్టు మూకలను కూడగట్టి తమ పనిని సానుకూలంగా చేసుకోగలుగుతున్నాయి.

**3**

ఆధిపత్య జాతీయవాద సిద్ధాంతాన్ని ప్రచారం చేసే ఈ సిద్ధాంతంలో 'జాతి' ప్రజల కన్నా ఉన్నతమయినది.'జాతి' అంటే ఏమిటో హిందుత్వ శక్తుల చుట్టూ ఉన్న కొంతమంది నిర్వచిస్తారు. దీని కొనసాగింపుగా ప్రభుత్వాన్ని విమర్శించడం 'జాతి' వ్యతిరేకతగా చిత్రించడం జరుగుతున్నది. తీవ్రంగా ఆలో చించేవారి ఆలోచనలలో మట్టిని నింపే ప్రయ త్నం జరుగు తున్నది. ఇందుకు కావలసిందల్లా ఆలోచనలపై దాడి, అదీ దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన సంస్థలలో, మేధో మధనం జరుగుతున్న చోట.

నయా ఉదారవాద విధానాలు మొదల యినప్పటి నుండి విద్యను సరుకుగా మార్చడం ద్వారా ఆలోచనలపై దాడి కొనసాగుతున్నది. విద్యను సంరుకుగా మార్చి అమ్ముకుంటున్న సంస్థలలో విద్యను కొనుక్కునే వారు ముడి సరుకయి, ఆ తరువాత సరుకుగా మారతారు. అమ్మకం దారునికి సరుకు ఉపయోగ విలువ ఉండదు. పూర్తిగా మారకం విలువే ఉంటుంది. అంటే కొంత డబ్బుపై పెత్తనం మాత్రమే. ఇక కొనుక్కునే వారికి విద్యను కొనుక్కోవడం వలన వారు బజారులో సరుకుగా మారి వచ్చిన తరువాత, వారికి తిరిగి ఎన్ని డబ్బులు వస్తాయనే ఆలోచన మాత్రమే ఉంటుంది. ఈ సరుకుల మయమయిన ప్రపంచంలో విద్య చక్కగా ప్యాకెట్ లో చుట్టిన ఒక మాత్ర రూపంలో ఉ ంది. అది ఇలా ఉన్నప్పుడే అందరి మన్నన పొందుతుంది. ప్రశ్నలు రేకెత్తించే విద్య, విద్యను స్వీకరించే వారిని కూడా ఆలోచింపజేసే విద్యం టే చికాకు పడతారు. అందువలన సరుకుగా మారిన విద్య ఆలోచనలను హతమారుస్తుంది.

సరుకుగా మారిన విద్య ప్రభావం అంతగా పడని ప్రభుత్వ విద్యాసంస్థలలో ఇంకా మేధోమదనం కొనసాగుతున్నది. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల నుండి అధిక సంఖ్యలో చేరిన సంస్థలలో సానుకూల చర్యల కారణంగా గాని, ఫీజులు తక్కువగా ఉండడం వలనగాని ఈ పరిస్థితి ఉన్నది. ప్రాథమిక సమ స్యలయిన బయట పెట్టబడడం, అణగదొక్క బడడం, దోపిడీకి గురికావడం వలన, ఉన్నత తరగతుల నుండి వచ్చిన వారికన్నా ఈ తరగతు లలో ప్రశ్నించే తత్వం ఎక్కువగా ఉంటుంది. (ఈ తరగతులు ఉండడం వలననే ఉన్నత తరగ తులలో సామాజిక స్పృహ పెరుగుతుం టుది.) అందువలననే అనేక ప్రభుత్వ విద్యా సంస్థలు ఆలోచనా కేంద్రాలుగానూ, రాజకీయ మేధో చైతన్యం పెంపొందించుకునే సంస్థలు గానూ, సృజనాత్మక ఆవిష్కరణలకు నిలయాలు గానూ ఉన్నాయి. ఈ సంస్థలను లక్ష్యంగా చేసుకునే హిందూత్వవాదులు దాడి చేస్తున్నారు.

జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం, యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్, పూనేఫిల్మ్ ఇన్స్టిట్యూట్,ఫైన్‌ఆర్ట్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎమ్ఎస్ యూనివర్శిటీ, బరోడాలపై హిందుత్వ శక్తులు దాడులు చెయ్యడం యాదృచ్ఛికం కాదు. ఆధి పత్య జాతీయవాదం పేరుతో ప్రజాస్వామ్యాన్నే కాలరాచే ఈ శక్తుల ప్రయత్నాలకు, ఆలోచన లకు ఈ చర్యలు అద్దంపడతాయి.

ఈ ప్రభుత్వ సంస్థలు కూడా అనేకానేక ఇతర ప్రయివేటు సంస్థల లాగానే విద్యను అమ్ముకునే సంస్థలుగా ఉండిఉంటే, ఆలోచించ నీయకుండా, సామాజిక స్పృహ కలుగజేయ కుండా, వ్యక్తులుగా కాక సరుకులుగా మార్చేందు కు సిద్ధంగా ఉండి ఉంటే ఈ శక్తులకు ఏ పేచీ ఉండేది కాదు. నిజానికి విద్యార్థులు కేవలం 'చదువుకోవాలి' రాజకీయాలు ఉండకూడదని అంటున్న వారి ఉద్దేశం ఇదే (ఎంతో మంది యూనియన్ క్యాబినెట్ మంత్రులు ఈ డిమాండ్‌నే వినిపించారు). కాని రాజకీయాలు మౌలికంగా సమాజానికి ప్రత్యామ్నాయాలను సూచిస్తాయి. విద్యార్థులు సమాజంలో ఒక భాగం. అందు లోనూ లోతుగా ఆలోచించి, తర్కించి, ఆచరిం చి, సమాజానికి వివిధ ప్రత్యామ్నాయాలను సూచించగలిగిన వారు. వీరికి రాజకీయాలు వద్దంటే అర్థం వారు ఆలోచనలు మనుకోవా లనే. వారి విద్య ఆలోచనలు లేని విద్య అయి ఉండాలి. వారు సరుకుగా మారేందుకు సిద్ధపడి ఉండాలి. కొన్ని నైపుణ్యాలను సంపాదించాలి. జ్ఞానం అనే మాత్రలను బోధించినపుడు మింగి పరీక్షలలో వాటిని బయటకు తీయాలి. ఆలోచన లను సమాధిచేసి, కొన్ని నైపుణ్యాలను మాత్రం సంపాదించుకోవాలి.

ప్రధానమయిన విద్యాసంస్థలపై దాడి ఒక స్క్రిప్ట్ ప్రకారమే జరుగుతున్నది. ఆయా విభాగాలలో ఏ ప్రత్యేక అర్హతలూ లేని ఆర్ఎస్ ఎస్ అనుయాయులు అధిపతులుగా నియమించ బడతారు. వారి ఏకైక లక్ష్యం ఆసంస్థలలోని ఆలోచనా పరులను 'జాతి వ్యతిరేకులుగా ముద్రవేయడం. (పూనా ఫిల్మ్ ఇన్స్టిట్యూట్ ఇందుకు మంచి ఉదాహరణ. ఇక్కడ చిత్రాల గురించి తెలియని వారిని డైరెక్టరుగా నియమించి నందుకు విద్యార్థులు చాలా రోజులు సమె చేసారు.) రెండు – అఖిల భారత విద్యార్థి సంఘం ఆర్ఎస్ఎస్ విద్యార్థి విభాగం. ఇది వరకు మిగిలిన విద్యార్థి సంఘాల లాగానే పనిచేసేది. కాని ఇప్పుడది ఒక అప్రమత్తం చేసే మితవాద విభాగంగా తయారయింది. ఆర్ఎస్. ఎస్ నియమించిన "అధికారుల"కు జాతి వ్యతిరే కుల గురించి సమాచారం చేరవేసే సంస్థగా మారింది. మూడు. జాతి వ్యతిరేకులుగా ముద్ర పడిన వారిని శిక్షలకు గురిచేయడం. జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో ఉదంతం లాగా పాత వలస చట్టంలో ఉన్న దేశద్రోహం నేరం మోపడంతో సహా (దేశద్రోహం అంటే ఏమిటో సుప్రీంకోర్టు ఇచ్చిన నిర్వచనం ధిక్కరించయినా సరే) వారి నందరినీ 'దేశద్రోహ' నేరానికి జైలుకు పంపడం. విడుదలైన తరువాత కోర్టులో కేసులెదుర్కోవడం, సంస్థల అధికారుల నుండి క్రమశిక్షణా చర్యలు ఎదుర్కోవడం. నాలుగు. కార్పొరేట్ ప్రసార మాధ్యమాలు ఆయా సంస్థలలోని విద్యార్థులను, ఉపాధ్యాయులను, జాతి వ్యతిరేకులుగా 'చిత్రిచడం'. ఐదు. జాతి వ్యతిరేకతపై రెచ్చిపోయిన అల్లరి మూకలు ఈ

సంస్థలలోని విద్యార్థులను చిత్రవధ చేస్తామని బెదిరించడం చేస్తారు.

ఈ మొత్తం కార్యక్రమం ఉద్దేశ్యం ఒకటే. హిందుత్వ తాత్వికతను విద్యార్థులపై రుద్దడం. వారిని భయభ్రాంతులను చేసి ( ఇది కార్పొరేట్లకు కూడా ఉపయోగం) తమను వ్యతిరేకించే వారిని శిక్షించడం. అంటే ఆలోచించడం కొనసాగించే వారినందరినీ శిక్షించడం. మానవ వనరుల అభివృద్ధి మంత్రి జెఎన్‌యులో కొందరిని మహిషాసురుని పూజిస్తున్నారంటూ ఆరోపించి, వారిని జాతి వ్యతిరేకులుగా అభివర్ణించడం ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

ఈ రకమయిన ఆలోచనలపై దాడి అత్యంత ప్రమాదకరం. ఎందుకంటే...

1. ఏ సమాజం అయినా ఆలోచనా రహితంగా ఉండలేదు. ఒక సమాజం గనుక ఆలోచనలను వదులుకుంటే అది ఇతరుల ఆలోచనలపై బతకాల్సివస్తుంది. అంటే అది ఇతర సమాజాల ఆధిపత్యానికి, ముఖ్యంగా అభివృద్ధిచెందిన దేశాల ఆధిపత్యానికి గురవుతుంది. ఇది ఒక్క మేధస్సుకే పరిమితం కాదు. ఇతర అన్ని పార్శ్వాలకూ వర్తిస్తుంది.

దురదృష్టం ఏమిటంటే 'జాతీయవాదం' పేరుతో దేశ స్వాతంత్రానికే ముప్పుతెచ్చే ఆలోచనలపై దాడులను అవి సమర్ధిస్తున్నాయి. అయితే ఇది ఆశ్చర్యం కలిగించదు. ఎందుకంటే మనం ముందే చూసినట్టు, ఈ ఆధిపత్య జాతీయవాదానికి కార్పొరేట్ ద్రవ్య పెట్టుబడి కూటమి మద్దత్తు ఉంది. ఈ కూటమి అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడిలో భాగం. అందువలన సామ్రాజ్య వాదంతో మిలాఖత్ అయిన పెట్టుబడి ఈ ముప్పును వ్యతిరేకించడంలో అలసత్వం వహిస్తుంది.

2. ఆలోచనలపై దాడి సామ్రాజ్యవాద వ్యతిరేకతను తక్కువ చేసి చూపుతుంది. ఇది సామ్రాజ్యవాదులకు భావదాసులుగా తయారు చేయడమే కాదు. సామాజిక అభివృద్ధికి కూడా గండి కొడుతుంది. కార్ల్‌మార్క్స్ అన్నట్టు, ఒక తేనెటీగ తేనెతుట్టెను ఒక నిర్మాణశిల్పి(ఆర్కిటెక్ట్) సిగ్గుపడేంత అందంగా కట్టవచ్చు గాక! కాని ఆర్కిటెక్ట్ ముందుగా తాను కట్టబోయే కట్టడాన్ని ఊహిస్తాడు. అలాగే వాస్తవ పరిస్థితులలో ఒక ప్రత్నమ్నాయ అభ్యుదయ, సామాజిక మార్పు జరిగే ముందు వాస్తవంలో ఆ మార్పు మరింత మానవత్వంతో కూడినదై ఎలా ఉంటుందో ఊహించగలగాలి. ఆలోచనలపై దాడి మార్పును కోరే ఇటువంటి భావజాలాన్ని నిరోధిస్తుంది. అయితే దాడులు జరుపుతున్నందుకు సంతృప్తి పడి, మార్పులను ఆపగలమనుకుంటే అది

**"ఈ హిందూత్వ దాడిని తిప్పి కొట్టేందుకు వామపక్ష రాజకీయవాదులు నాయకత్వం వహించాలి. ఆలోచనలపై జరుగుతున్న దాడులను వ్యతిరేకించే అభివృద్ధి కాముక స్వేచ్ఛాయుత మేధావులను, వివిధ సామాజిక తరగతులను, భావ స్వాతంత్ర్యం హరించడాన్ని, సామాజిక ప్రతీఘాత విప్లవాన్ని వ్యతిరేకించే పౌరసమాజాన్ని, ప్రజాస్వామ్య సంస్థలను రక్షించుకోవాలనుకునే రాజకీయ పార్టీలను కలుపుకోవాలి."**



జెఎన్‌యులో విద్యార్థులపై దాడికి పూనుకున్న ఎబివిపి విద్యార్థులు

కేవలం భ్రమే. గడియారాన్ని ఎవరూ వెనక్కు తిప్పలేరు. సామాజిక, రాజకీయ మార్పులను వెనక పట్టు పట్టించగలమని, మంచి సమాజం కోసం కనే కలలను వమ్ముచేయగలమని, సామాజిక న్యాయం కోరిన వారిపై దేశద్రోహ నేరాలను మోపి, తద్వారా సామాజిక సమతుల్యత సాధించగలమని, సమాజం అక్కడితో నిలిచి పోతుందని అనుకుంటే అది భ్రమే అవుతుంది.

బాగా ఆలోచించి, నిర్మాణాత్మకంగా చూపిన ప్రగతిశీల సామాజిక మార్పుకు, అవసరమైన సూచనలను నిలువరిస్తే ప్రస్తుతం సమాజంలోని అన్యాయపు విధానాలను హింసాత్మకంగా అడ్డుకోవడం జరగుతుంది. ఈ హింసను అడ్డు పెట్టుకుని పాలక పార్టీ భావప్రకటనా స్వేచ్ఛపై మరిన్ని ఆంక్షలు విధిస్తుంది. రాజ్యం, ఫాసిస్టు గ్రూపులు మరింత అణచివేతకు పూనుకుంటాయి. ఫలితంగా ప్రజాస్వామ్యం కుంటుపడుతుంది. కనుచూపు మేరలో వెలుతురు కానరాక, ప్రగతికి ఏ మాత్రం అవకాశం లేని భయంకర వివాదాలలో చిక్కుకుని, 'ఓడిన రాజ్యాలలో' ఒకటిగా భారతదేశం మిగిలిపోతుంది. అందువలన హిందుత్వవాదులు చేస్తున్న ఆలోచనలపై దాడులను వ్యతిరేకించి, దేశాన్ని వివాదాల నుండి కాపాడాల్సిన అవసరం ఉంది. ఆధిపత్య జాతీయవాదం పేరుతో ప్రజాస్వామ్య సంస్థలపై జరుగుతున్న దాడులను ఎదుర్కోవడం అత్యవసరం.

పెద్ద ప్రభుత్వ సంస్థలలోని విద్యార్థులు ఈ శక్తులను వ్యతిరేకిస్తున్నారు. అయితే విద్యార్థుల చర్యలకు కొన్ని పరిమితులు ఉంటాయి. ఈ హిందూత్వ దాడిని తిప్పి కొట్టేందుకు వామపక్ష రాజకీయవాదులు నాయకత్వం వహించాలి. ఆలోచనలపై జరుగుతున్న దాడులను వ్యతిరేకించే అభివృద్ధి కాముక స్వేచ్ఛాయుత మేధావులను, వివిధ సామాజిక తరగతులను, భావ స్వాతంత్రం హరించడాన్ని, సామాజిక ప్రతీఘాత విప్లవాన్ని వ్యతిరేకించే పౌరసమాజాన్ని, ప్రజాస్వామ్య సంస్థలను రక్షించుకోవాలనుకునే రాజకీయ పార్టీలను కలుపుకోవాలి.

ఆలోచనలపై దాడులను వ్యతిరేకించే వారిని 'జాతీయవాదం' పేరుతో హిందూత్వ శక్తులు విస్తరింప చేసే మేధో, సామాజిక తిరోగమనాన్ని వ్యతిరేకించే వారిని, వామపక్ష వాదులయి తీరాలని సహజంగానే వామపక్షాలు అనుకోవు. అలా అనుకోవడం హిందూత్వ శక్తుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా జరిగే పోరాటాన్ని బలహీన పరుస్తుంది. అది ఈ దేశ ప్రజలకు విషాదాన్ని మిగులుస్తుంది. అంటే అది వామపక్షాలకూ విషాదమే. ప్రజాస్వామ్యాన్ని నిరంతరం రక్షించే శక్తిగా, సామ్రాజ్యవాద వ్యతిరేకిగా, సంఘటిత జాతీయవాదిగా, దేశంలోని ప్రజలందరినీ సమీకరించి, హిందుత్వ దాడిని ఎదుర్కొవలసిన బాధ్యత వామపక్షంపైన ఉంది.

**అనువాదం : కె ఉషారాణి**

# దేశ రక్షణను ప్రైవేటీకరిస్తున్న నకిలీ దేశభక్తులు!

**అతుల్ భరద్వాజ్**

భారతీయ సైనికుడు విస్మృత స్థితిలో ఉన్నాడు. దేశంలో పౌర, సైనిక సంబంధాలు సంక్షోభంలో ఉన్నాయి. సాయుధ శక్తుల యొక్క అంతస్తు, జీతాలను దేశంలోని ఇతర బలగాల కన్నా తక్కువ చేయడం, ఇతరుల నుండి వారిని దూరం చేస్తున్న ప్రభుత్వ విధానాలు పరిస్థితిని మరింత దిగజారుస్తున్నాయి. నయా ఉదారవాద శక్తులు జాతీయ మిలిటరీని ముక్కలు చేసే విధానాన్ని ప్రవేశపెట్టడానికి సంక్షోభాన్ని ఒక అవకాశంగా వినియోగించుకుంటున్నాయి. ఆ శక్తులు ఈ దేశభక్తుల స్థానంలో అక్రమ సంపాదనాపరులను తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నాయి. భారతీయ సాయుధ శక్తులు కలత చెందిన స్థితిలో ఉండిపోయారు. జాతీయవాద రాజకీయపార్టీ వారి సమస్య పట్ల సానుభూతిని తెలియజేస్తూ వారు కలత చెందేలా చేయడం అనేది విరుద్ధ భావనలతో కూడిన హాస్యం. పెన్షన్ చెల్లింపుల గురించి మిలిటరీ ఉద్యోగుల ఊహలు, అంచనాలు వమ్ము చేయబడినాయి. 2015లో వృద్ధ సైనికులు ఒకే ర్యాంక్, ఒకే పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని బజారున పడటం జరిగింది. ప్రభుత్వం నిరసన తెలుపుతున్న వృద్ధ సైనికులపైకి పోలీసులను పంపింది.

'ఒకే ర్యాంక్, ఒకే పెన్షన్'పై అనేక ఊగిసలాటలు, సంశయాల అనంతరం 2015 నవంబర్‌లో ఒక అస్పష్టమైన, వక్రీకరించబడిన విధానాన్ని ప్రకటించారు. వార్షిక సమీక్ష, పెన్షన్లను సమానం చేసే విధానంపై వచ్చిన అవగాహనకు భిన్నంగా, ప్రభుత్వం ఐదు సంవత్సరాలకు ఒక్కసారి మాత్రమే పెన్షన్లు సమానం చేసే విధంగా స్థిరీకరించడం జరిగింది. ప్రాథమికంగా పెన్షన్‌తో కూడుకున్న 20 సంవత్సరాల సర్వీసు పూర్తిచేసిన, ముందుగానే రిటైర్ కాదల్చుకున్న అధికారులకు 'ఒకే ర్యాంక్, ఒకే పెన్షన్' పథకం అమలు జరగకుండా చేశారు. తరువాత ప్రభుత్వం కనికరించి ముందుగానే రిటైర్‌మెంట్ (ప్రభుత్వ నోటిఫికేషన్ నాటికి) తీసుకున్న అధికారులను 'ఒకే ర్యాంక్, ఒకే పెన్షన్' పథకంలో చేర్చడం జరిగింది. కానీ భవిష్యత్‌లో ముందుగానే రిటైర్‌మెంట్ తీసుకోబోయే అధికారులకు 'ఒకే ర్యాంక్, ఒకే పెన్షన్' వల్ల కలిగే లాభాలను నిరాకరించారు.

కావాలనే సాయుధ సైనికుల గౌరవంపైన చేస్తున్న దాడులు 'ఒకే ర్యాంక్, ఒకే పెన్షన్' వైఫల్యం తరువాత ఆగలేదు. తాజాగా ఏడవ వేతన సంఘం సాయుధ శక్తులపై కోపాన్ని ప్రదర్శించింది. ప్రభుత్వం కూడా 'నాన్ ఫంక్షనల్ అప్ గ్రెడేషన్' (ఎన్.ఎఫ్.యు.) విషయానికి సంబంధించి సాయుధ శక్తులు ఎంతో కాలంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోకుండా వదిలేసింది. కేంద్ర సర్వీసులలోని గ్రూపు.ఎ వారు అనుభవిస్తున్న ఎన్.ఎఫ్.యు. చెల్లింపును మిలిటరీ గ్రూపుల వారికి నిరాకరించారు. ప్రవర్తనా నియమావళి విషయంలో కూడా మిలిటరీ వారికి ఇవ్వవల్సిన గౌరవం కూడా ఉద్దేశ్యపూర్వకంగా తగ్గించారు. ప్రభుత్వ ప్రాధాన్యతా క్రమంలో పునర్వ్యవస్థీకరణ లేకపోవటంతో దూరమయ్యాయన్న భావనను మరింత తీవ్రతరం చేసింది. ఈ ఉడుకుతున్న కోపం సోషల్ మీడియా ద్వారా అంతటా విస్తరించింది.

ప్రధాని నరేంద్ర మోడీ 2013 సెప్టెంబర్ 15న హర్యానా రాష్ట్రంలోని రివారీలో ఒక మాజీ సైనికుల ర్యాలీ నుండే తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించాడు. ఆర్థిక న్యాయం కోసం పోరాడే సాయుధ శక్తులపై రాజ్య పాలకులు చేసే గాయాల ఫలితంగా ఒక సంక్షోభం నుండి వేరొక సంక్షోభానికి నెట్టివేయబడుతున్న వీరిపట్ల ప్రధాని అయిన తరువాత నరేంద్ర మోడీ మౌనశ్రోతగానే ఉంటూ వస్తున్నాడు.

వి ఎలిటరీ వారి యొక్క ఆత్మ గౌరవానికి అవమానం కలిగించే ఈ దాడి జాతీయవాద పార్టీ నాయకత్వం వహిస్తున్న పాలక వ్యవస్థ యొక్క కుట్ర ఫలితమే.

**నయా ఉదారవాద పరిష్కారాల పట్ల ప్రత్యేక ఇష్టత**

భారతీయ మిలిటరీ నిరంతర సంక్షోభాలకు, కుదుపులకు ఎందుకు గురిచేయబడుతుందో అర్థం చేసుకోవడానికి నవోమీ క్లెయిన్స్ యొక్క 'ద షాక్ డాక్ట్రిన్' (2007) అనే రచన ఉపయోగపడుతుంది. తీవ్రమైన స్వేచ్ఛా మార్కెట్ సంస్కరణలకు ప్రజలను అంగీకరింపజేయటానికి నయా ఉదారవాదం సంక్షోభాన్ని ఎలా ఉపయోగించుకుంటుందో, సంక్షోభాన్ని ఎలా తయారు చేస్తుందో క్లెయిన్స్ తన రచనలో వివరిస్తుంది. ఒక సంక్షోభం వచ్చిన తరువాత ప్రజలు తెప్పరిల్లడానికి ముందే ప్రజలను బాధలకు గురిచేసేకొత్త విధానాలను ప్రవేశపెట్టాలని రాజకీయ నాయకులకు సలహా ఇచ్చే 'ఎకనామిక్ షాక్ థెరపి' అనే మిల్టన్ ఫ్రెడ్‌మెన్స్ సిద్ధాంతాన్ని క్లెయిన్స్ తన వాదనకు పునాదిగా తీసుకోవడం జరిగింది. జాతీయ మిలిటరీలో తిరోగామి మనస్తత్వాలు కలిగిన వ్యక్తిత్వాలను తయారుచేసే విధంగా ప్రధాని నరేంద్ర మోడి బోధనలు చేసే ఈ సంస్కరణల భావం ఏమిటనేదే ప్రశ్న.

రక్షణ నిధులను బయటి ఏజెన్సీలకు లేదా ప్రైవేట్ మిలిటరీ కార్పొరేషన్ (పి.ఎం.సి.) లకు అప్పజెప్పడం ప్రచ్ఛన్న యుద్ధం అనంతర అమెరికా, బ్రిటన్‌లు ఇచ్చిన కానుక. ఈ ప్రైవేట్ మిలిటరీ కార్పొరేషన్లు ప్రైవేటీకరణను దాటిపోయి రక్షణరంగ ఉత్పత్తులలో 100 శాతం విదేశీ

ప్రత్యక్ష పెట్టుబడులు పెట్టడానికి సిద్ధపడు తున్నాయి. యుద్ధభూమి నిర్వహణలో ప్రైవేట్ మిలిటరీ కార్పొరేషన్లు (పి.ఎం.సి.లు) ప్రత్యక్షం గా పాలుపంచుకోవడానికి అవసరమైన ప్రాతిపదికను సృష్టించడానికి వీలుగా నేషనల్ మిలిటరీని ముక్కలుగా చేసే పనిలో ఉన్నాయి. మిలిటరీ చర్యలకు సంబంధించిన సామాగ్రి మొదలగు వాటి నిర్వహణను ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగించే ప్రయత్నంలో ఉన్నది. సైనికుల కిచ్చే దిన భత్యాల నుండి మిస్సైల్ నిర్వహణ దాకా ప్రత్యక్షంగా బాధ్యత వహించే కార్పొరేట్ యుద్ధవీరులను తయారు చేస్తున్నాయి.

“దాదాపుగా దేశ సైనికులు భుజాలపై ధరించే చిహ్నాలు, వారి ఏకరూప దుస్తులను కార్పొరేట్ లేబుల్స్‌తో వాటియొక్క స్థానాలను మార్చడమే. దానివలన పవిత్రమైన సాయుధ సైనిక వృత్తి, కూలీ సిపాయి వృత్తిగా మారిపోయి దానిలోని గొప్పతనం ముక్కలై పోతుంది. రక్షణ రంగానికి చెందిన నిధులలో పెద్ద మొత్తాన్ని ప్రైవేట్ కార్పొరేషన్లు స్వంతం చేసుకుంటాయి.”



భారత సైనిక దళాల కవాతు

పశ్చిమాన రక్షణ విధులను ప్రైవేటీకరించే ప్రక్రియ ప్రచ్ఛన్న యుద్ధం అంతరించిన అనంతరం ప్రారంభమైంది. ‘ఏజెంట్ ఆరెంజ్’ అనేది వియత్నాం యుద్ధం వదిలివేసిన సొత్తు. అయితే ఆధునిక యుద్ధానికి ప్రైవేట్ మిలిటరీ కార్పొరేషన్ల పరిచయం అనేది ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్ యుద్ధాలను గుర్తుకు తెచ్చేదిగా ఉంటుంది. రెండు సంవత్సరాల క్రితం బ్రిటిష్ ప్రభుత్వం రక్షణ మంత్రిత్వశాఖ మొత్తాన్ని, దానికి సంబంధించిన విధుల నిర్వహణ ప్రక్రియను ‘జి.ఓ.సి.ఓ.’ అనే ప్రైవేట్ కంపెనీకి అప్పగించే దాకా వెళ్ళింది. దాని వలన కలిగే దుష్పరిణామాలు ప్రపంచానికి తెలిసిన తరువాత మాత్రమే ఆ అప్పగింతల కార్యక్రమాన్ని పక్కన పెట్టారు.

యుద్ధాన్ని ప్రైవేటీకరించడం అంటే దాదాపు సంక్లిష్టమైన రక్షణ రంగానికి చెందిన అన్ని సౌకర్యాలను ప్రైవేట్ ఆటగాళ్ళకు అప్పజెప్పడమే. అంటే దాదాపుగా దేశ సైనికులు భుజాలపై ధరించే చిహ్నాలు, వారి ఏకరూప దుస్తులను కార్పొరేట్ లేబుల్స్‌తో వాటియొక్క స్థానాలను మార్చడమే. దానివలన పవిత్రమైన సాయుధ సైనిక వృత్తి, కూలీ సిపాయి వృత్తిగా మారిపోయి దానిలోని గొప్పతనం ముక్కలై పోతుంది. రక్షణ రంగానికి చెందిన నిధులలో పెద్దమొత్తాన్ని ప్రైవేట్ కార్పొరేషన్లు స్వంతం చేసుకుంటాయి. దీనిని అమలు జరపటాన్ని మోడీ లక్ష్యంగా పెట్టుకున్నాడు. ముందుగా రూపొందించిన ఈ కుట్ర ఫలితంగా సాయుధ సైనికులు మూకుమ్మడిగా మానసికంగా గాయపడ్డారు.

2014లో మోడీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వెంటనే సాయుధ శక్తుల ఆదాయ బడ్జెట్‌కు సంబంధించిన చర్చలకు ఒక రూపం తెచ్చే ప్రక్రియ ప్రారంభమైంది. అరుణ్‌జైట్లీ రక్షణ మంత్రిగా ఉన్నపుడు ‘ఇండియా టుడే’ పత్రిక ‘కవచానికి పగుళ్ళు’ అన్న శీర్షికతో ఒక కథనాన్ని ప్రచురించింది. ఆ కథనంలోని కొత్తదనం ఏమంటే రక్షణరంగ మంత్రిత్వశాఖలో ఆదాయానికి సంబంధించిన నిర్వహణపై ఆంతరంగికంగా కొన్ని సంస్కరణలపై చర్చ జరిగింది. 2.2 లక్షల కోట్ల రక్షణరంగ బడ్జెట్‌లో దాదాపు 60 శాతం మానవ శక్తికి సంబంధించిన ఖర్చులపై వెచ్చించడం జరిగిందని వాదించారు. 2011 నుండి రక్షణ మంత్రిత్వశాఖల నివేదికలను ఉదహరిస్తూ, ప్రతి సంవత్సరం 5400 కోట్లపైన వృధాగా ఖర్చు చేయబడిందని ఆ కథనం తెల్పింది. ఈ ఖర్చు కేవలం రక్షణ రంగానికి సంబంధించిన రవాణా ఖర్చులలో మానవశక్తిని ఉపయోగించడం వల్లనే జరిగింది. ఈ కథనం ఇంకా “ఆర్మీ సర్వీస్ కార్ప్స్ (ఎ.ఎస్.సి.)” రు. 2,122 కోట్ల విలువైన ఆహారాన్ని కొనుగోలు చేసింది. కానీ మానవ శక్తిపైన రు. 1500/- కోట్లు ఖర్చు పెట్టింది. అంటే ఎ.ఎస్.సి. సంపాదించడానికి 70 శాతం ఖర్చు పెడితే. ఎఫ్.సి.ఐ. సంపాదించడానికి 16 శాతం ఖర్చు చేసింది.

ప్రభుత్వ ఆర్థిక నిర్వహణలకు సంబంధించిన లోపాలు ప్రైవేటీకరణపై చర్చను ప్రారంభించడానికి ఉపయోగించబడతాయి. ఆ కథనం కూడా సంపాదించడానికి ఎ.ఎస్.సి.కి, ఎఫ్.సి.ఐ.కి అయిన ఖర్చులను పోల్చి చూపించింది. కానీ ఎ.ఎస్.సి. ఉపయోగించిన మానవ శ్రమ కేవలం ఆహార సంపాదనలో మాత్రమే కాక ఇతర కార్యక్రమాలు, అంటే ప్రకృతి విపత్తులు సంభవించినపుడు సహాయ కార్యక్రమాలలో కూడా పాల్గొనడం జరిగింది.

భారతీయ సైన్యం రూపం మార్చడానికి అవసరమైన అధ్యయనం 2009లో జనరల్ వి.కె.సింగ్ తూర్పు ప్రాంతపు ఆర్మీ కమాండర్‌గా ఉన్న సందర్భంలోనే మొట్ట మొదటిసారిగా ప్రవేశపెట్టబడింది. వ్యూహాత్మక ఆజ్ఞలు, లేదా అధికారం, సైనికుల యొక్క ఎదుర్కొనే సామర్థ్యాన్ని కొంత పెంచడం, పరిపాలన సంబంధమైన, రవాణాకు చెందిన ఇతర విధులను బయటి ఏజెన్సీల (ఔట్‌సోర్సింగ్) ద్వారా నెరవేర్చడం లాంటివి ఆ ప్రతిపాదనలలో చోటు చేసుకున్నాయి. అంటే దీని ప్రకారం ప్రధానమైన యుద్ధం దేశ సైనికులు చేయడం, సైన్యంలోనే ఎ.ఎస్.సి.,

**"60,000 కోట్ల రూపాయల రక్షణ మంత్రిత్వశాఖ వార్షిక పెన్షన్ బిల్లే సైన్యం యొక్క సంఖ్యను తగ్గించడానికి ప్రధాన కారణం. ఒకప్పుడు భారతదేశానికి గర్వ కారణంగా ఉన్న పెద్ద సైన్యం, ఇప్పుడు అసహ్యంగా కనపడుతున్నది. సైన్యం పట్ల ఉన్న వినయం, దురదృష్టవశాత్తూ వారి పెన్షన్ల విషయం వచ్చేసరికి మాయమైంది."**

ఫిరంగులు, ఎలక్ట్రానిక్స్, మెకానికల్ ఇంజినీర్ల చేత చేయబడే విధులన్నింటిని ప్రైవేటీకరించడం. యుద్ధం చేసేవారు, యుద్ధం చేయని వారని సైన్యాన్ని చీల్చే క్రమం ఈ మధ్య ప్రభుత్వం చేసిన నిర్ణయాలలో స్పష్టంగా కనపడుతుంది. రక్షణశాఖ మంత్రి మనోహర్ పారికర్ యొక్క మొట్ట మొదటి నిర్ణయం ఏమంటే సైన్యం యొక్క న్యాయబద్ధంగా లేని ప్రమోషన్ విధానాన్ని (2009) నిర్వీర్యం చేస్తూ సాయుధ శక్తుల ట్రైబ్యునల్ (ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ట్రైబ్యునల్) చేసిన నిర్ణయాన్ని సుప్రీం కోర్టులో సవాల్ చేయడం. మార్చి 2, 2015న ఎ.ఎఫ్.టి. ఇచ్చిన తీర్పు ఈ విధంగా ఆదేశించింది. కల్నల్ స్థాయి వరకు ఇవ్వబడిన ప్రమోషన్లన్నీ పక్షపాతంగా, పదాతిదళాలకు, ఫిరంగిదళాలకు అనుకూలంగా ఇవ్వబడినాయి. 2009 విధానం 60 శాతం పదాతులు, ఫిరంగులను ఉపయోగించే సైన్యం లోని లెఫ్టినెంట్ కల్నల్‌లు కల్నల్‌గా మారడానికి ఉపయోగపడింది. సైన్యంలోని ఇతర విభాగాల అధికారులకు ప్రమోషన్ అవకాశాలను 30 శాతంకి తగ్గించి వేయడం జరిగింది. దాదాపు 200 మంది సైన్యాధికారులు ఎ.ఎఫ్.టి. నిర్ణ యాన్ని కొనసాగించాలని కోరుతూ సుప్రీంకోర్టుకు వెళ్ళినారు. ఈ సంవత్సరం ప్రారంభంలో సుప్రీంకోర్టు సైన్యం యొక్క 'కమాండ్ & ఎగ్జిట్' విధానాన్ని సమర్థిస్తూ తీర్పు చెప్పింది. అదే సమయంలో సైన్యం సేవలలో సహాయకారులుగా ఉపయోగపడే ఉద్యోగాలకు సంబంధించిన అదనపు ఖాళీలను భర్తీ చేసుకోవడానికి ఏర్పాటు చేసుకోవచ్చని ఆదేశించింది. ఈ తీర్పు ఆర్మీ నివాస కేంద్రంలో ఉపశమనం కలిగే విధంగా, ప్రమోషన్ విధానంలో ఏ విధమైన మార్పులు చేయకుండా, ఆర్మీలో అంతర్గతంగా విభజన లేకుండా చేయడం జరిగింది.

2015లో 'ఒకే ర్యాంక్, ఒకే పెన్షన్' ఆందోళన ఉచ్ఛస్థితిలో ఉన్న సందర్భంలో, ప్రభుత్వం పెన్షన్ల భారం చాలా ఎక్కువ అని నిరూపించడానికి కొన్ని అంకెలతో ముందు కొచ్చింది. మిలిటరీ పెన్షన్ బడ్జెట్ రు.75,000 కోట్లని, ఇది నావీ , ఎయిర్‌ఫోర్స్‌ల ఉమ్మడి బడ్జెట్ కన్నా చాలా ఎక్కువ అని ప్రభుత్వం చూపించింది. 'ఒకే ర్యాంక్, ఒకే పెన్షన్' వలన మిలిటరీని ఆధునీకరించడానికి విదేశీ వ్యాపారస్తుల నుండి అవసరమైన యుద్ధ పరికరాలు కొనుగోలు చేయడానికి తక్కువ నిధులు అందుబాటులో ఉంటున్నాయని ప్రభుత్వం చెబుతున్నది.

**వేగవంతమవుతున్న మిలిటరీ సంస్కరణలు**

2016 మేలో ప్రభుత్వం రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ డి.బి.షెకాట్కర్ నాయకత్వాన 11 మందితో ఒక కమిటీని ఏర్పాటుచేసి మూడు సర్వీసుల (మిలిటరీ ఆపరేషన్లలో పాల్గొనని) ను తగ్గించడానికి అవసరమైన సలహాలివ్వాలని సూచించింది. భారతీయ సాయుధ శక్తులను ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ చేయడానికి ఉపయోగించబడిన ఒక సుతిమెత్తని పదం ఆ కమిటీ. ఆర్మీలో ఉన్న అన్ని రకాల లోపాలను సవరించడానికి, 13 లక్షల పటిష్టమైన సైన్యాన్ని తగ్గించడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నానికి మద్దతుగా సోషల్‌మీడియా, ఎక్కువమంది ప్రజానీకంలో చర్చ జరుగుతున్నది. నయా ఉదారవాద సిద్ధాంతంలో వేళ్ళూనుకున్న వాదనలు పెన్షన్ల ఉద్దేశ్యాలను ప్రశ్నించాయి. 60,000 కోట్ల రూపాయల రక్షణ మంత్రిత్వశాఖ వార్షిక పెన్షన్ బిల్లే సైన్యం యొక్క సంఖ్యను తగ్గించడానికి ప్రధాన కారణం. ఒకప్పుడు భారతదేశానికి గర్వ కారణంగా ఉన్న పెద్ద సైన్యం, ఇప్పుడు అసహ్యంగా కనపడుతున్నది. సైన్యం పట్ల ఉన్న వినయం, దురదృష్టవశాత్తూ వారి పెన్షన్ల విషయం వచ్చేసరికి మాయమైంది.

విదేశీ యుద్ధాలు, యుద్ధ యంత్రాలకు పెద్ద మొత్తంలో డబ్బు అవసరం ఉండటం వలన సైనికుల సంఖ్యను తగ్గించాల్సిన పరిస్థితి ఉన్నది. భారతీయ రక్షణరంగ వ్యవస్థ ప్రైవేటీకరణకు మద్దతు తెలిపేవారి వాదనలలో స్పష్టమైన వర్గ పక్షపాతం కన్పిస్తుంది. ఒక మాజీ సీనియర్ ఆర్థికశాఖ అధికారి పెద్ద మొత్తంలో ఉన్న పెన్షన్ బిల్లు పట్ల గొణుగుతూ పాక్షిక దృక్పథంతో ఈ విధంగా వ్రాయడం జరిగింది.

సమకాలీన వక్కాణింపు ప్రస్తుతం చదువుకున్న సైనికులు ఆధునిక పరికరాలు, యంత్రాలతో సాంకేతికపరమైన యుద్ధాలు చేసే విధానంపై ఉన్నది. భారతీయ సైనికుడు అంటే గ్రామీణ ప్రాంతాలలోని గొప్పింటికి చెంది, ఉన్నత విద్యలేని వారు, సైన్యాన్ని సిద్ధం చేసుకొని సాంప్రదాయ పద్ధతులలో యుద్ధం చేసేవారు (సింగ్ 2016).

ఒక రక్షణరంగ సీనియర్ జర్నలిస్ట్ 'సమూల సంస్కరణలు' కు మద్దతు పలుకుతూ ఈ విధంగా వ్రాశాడు.

మిలిటరీ జీతాలు, జీవితకాలపు పెన్షన్లు బట్టలు ఉతికే, ఊడ్చే, వండే, జుట్టు కత్తిరించే పోరాట దళాల వారికి చెల్లించబడతాయి.

## పాఠకుల అభిప్రాయాలు

### సంపాదకీయం బాగుంది

భారత రాజ్యాంగంలోని 370 అధికరణకు బిజెపి ప్రభుత్వం వ్యతిరేకం. ఒక పథకం ప్రకారం కాశ్మీరు ప్రజలపై కేంద్ర ప్రభుత్వం యుద్ధం ప్రకటించింది. ఉగ్రవాదం పేరుతో కాశ్మీరు ప్రజలను వేర్పాటువాదులుగా పరిగణించి వారిపై అణచివేత, నిర్బంధం, దాడులు చేస్తున్నది. నిత్యం కర్ఫ్యూ కొనసాగుచున్నది. ఈ మధ్య జరిపిన కాల్పుల్లో అధికారికంగా 90 మంది చనిపోయారు. రాష్ట్రాన్ని జైలుగా మార్చేసారు. మీడియాపై ఆంక్షల వలన పూర్తి సమాచారం లభించడం లేదు. కాశ్మీరు ఒకప్పుడు ఒక దేశం. ఆ దేశానికి ఒక ప్రధానమంత్రి ఉండేవారు. బలవంతంగా మన దేశంలో విలీనం చేసుకొన్నాం. ఆచరణలో స్వయంప్రత్తి లేదు. వాళ్ళ ఆలోచనలు ఆకాంక్షలు పరిగణలోనికి తీసుకోవాలి.

– **తుంపాల శ్రీరామమూర్తి**, గాజువాక

ఎక్కువ ఆయుధ సామాగ్రి ఉన్న విభాగంలో ప్రతి ఆరవ పోరాటదళ సైనికుడు ఒక మెకానిక్. సాయుధ సైన్యంలో సభ్యుడు కాని వ్యక్తిచేసే పనిని అతడు తక్కువ ఖర్చుతో, నేర్పుగా చేస్తాడు. ఇతర సైనికులు రేషన్, బట్టలు, విడిభాగాలు, ఇంధనం సరఫరా చేస్తారు. ఆఖరికి సైనికాధికారుల భోజనశాలలో భోజనం సరఫరా చేసే వ్యక్తి కూడా పూర్తికాలపు సైనికుడే. వీరికి కూడా జీతాలు, జీవితకాలపు పెన్షన్లు చెల్లించాల్సిందే (శుక్లా 2014).

❝ ఒక ప్రైవేట్ మిలిటరీ కంపెనీగా రూపాంతరం చెందిన వ్యాపార సంస్థ ఈస్ట్ ఇండియా కంపెనీ చేతిలో భారతదేశం కొన్ని శతాబ్దాల పాటు బాధపడింది. ఇప్పుడు అమెరికా ప్రభుత్వ ఆధీనంలో పనిచేస్తున్న ఆయుధ బహుళజాతి సంస్థ భారతదేశంలో స్థావరం ఏర్పాటు చేయటానికి మనం మార్గం వేస్తున్నాం.❞

శుక్లా వాదనలో దాగివున్న భావం ఏమంటే, ప్రభుత్వం జీతాలను నిర్ణయించటం ద్వారా మార్కెట్లను దెబ్బతీయరాదు. పేదరికం నేపథ్యం నుండి వచ్చిన సైనికులకు సాయుధ సైన్యంలో సభ్యులు కానటువంటి వారికంటే ఎక్కువ చెల్లించరాదు. ఇలాంటి కొన్ని వర్గ పక్షపాతాలు బలంగా వ్యక్తం చేయబడుతున్నాయి. రోదిస్తున్న అమరవీరుల భార్యలు, కుమార్తెల చిత్రాలను మెచ్చుకుంటూ సోషల్ మీడియాలో షేర్‌చేసే జాతీయవాదులు, దీనికి విరుద్ధంగా సైన్యంలో పనిచేసే వంట మనిషి కుమారునికి ఇండియన్ మిలిటరి అకాడమి 'స్వోర్డ్ ఆఫ్ హానర్' అవార్డును ప్రకటిస్తే మౌనం వహిస్తారు.

**పెట్టుబడిదారులను ఒడ్డున వేయటం**

రక్షణరంగ మద్దతు ఉన్న సర్వీసులను ప్రైవేటీకరించడానికి రెండు పెద్ద కారణాలు న్నాయి. మొదటిది అప్పులపాలైన భారతీయ పెట్టుబడిదారులకు సహాయం చేయడం. రెండవది అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్ నుండి బహుళజాతి సంస్థలకు చెందిన ప్రైవేట్ మిలిటరీ కార్పొరేషన్లు భారతదేశంలోకి ప్రవేశించడానికి మార్గాలను సుగమం చేయడం. రక్షణ రంగంలోకి 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులతో భారతదేశ పారిశ్రామికవేత్తలు వారి ఉత్పత్తి నైపుణ్యానికి పదును పెట్టుకోవాలన్న కొద్ది ఆశ కూడా లేకుండా పోయింది. పెట్టుబడి ఖర్చులు విదేశీ ఆయుధ ఉత్పత్తిదారుల లాభాలను పెంచుతాయి. పోరాటంలో పాల్గొంటున్న వారికి



మనోహర్ పారికర్

సేవలను అందించగలిగిన భారతీయ కంపెనీలు సాయుధ దళాల సంఖ్యను తగ్గించడం వలన భారీగా లాభం పొందనున్నాయి.

భారతదేశం అమెరికాతో చేసుకున్న 'లాజిస్టిక్ సపోర్ట్ అగ్రిమెంట్' వలన భారతదేశ రక్షణరంగంలోకి విదేశాలకు చెందిన ప్రైవేట్ మిలిటరీ కార్పొరేషన్లు విస్తరించడానికి మార్గం సుగమం అవుతుంది.

కాంట్రాక్టర్లు కూడా కొలాబరేటివ్ సెక్యూరిటీ లొకేషన్స్ (సి.ఎస్.ఎల్) నిర్వహణకు ముఖ్యమే. ఆతిథ్యమిచ్చే దేశం యొక్క మిలిటరీ సౌకర్యాలను కాంట్రాక్టర్లు అద్దెకు ఇస్తారు. ఈ సైనిక కేంద్రాలను అమెరికా ఉపయోగించుకుంటుంది. అందుకుగాను అమెరికా నుండి కాంట్రాక్టర్లు కొంత ఫీజు వసూలు చేస్తారు.

ఒక ప్రైవేట్ మిలిటరీ కంపెనీగా రూపాంతరం చెందిన వ్యాపార సంస్థ ఈస్ట్ ఇండియా కంపెనీ చేతిలో భారతదేశం కొన్ని శతాబ్దాల పాటు బాధపడింది. ఇప్పుడు అమెరికా ప్రభుత్వ ఆధీనంలో పనిచేస్తున్న ఆయుధ బహుళజాతి సంస్థ భారతదేశంలో స్థావరం ఏర్పాటు చేయటానికి మనం మార్గం వేస్తున్నాం. జాతీయ ప్రాధాన్యత కలిగిన, భారతదేశ రక్షణ, వ్యూహాత్మకమైన అంశాలపై చర్చ లేకపోవడంఅనేది వాస్తవానికి విచారించదగిన విషయం.

సాయుధ శక్తులు ఒక స్వాతంత్ర్య దేశానికి గట్టి పునాది. వాటిపై వృధా ఖర్చులను తగ్గించాల్సిన అవసరాన్ని కాదనలేము. కానీ వాటియొక్క అనేక పనులు, అవి నిర్వహించే పాత్రలు అన్నీ కార్పొరేషన్లకు అప్పగించడం అంటే జాతిరాజ్యం అన్న భావనపై దాడి చేయడమే అవుతుంది. రక్షణరంగ ప్రైవేటీకరణ, జాతీయవాదం రెండూ కలిసి ఒకేచోట ఉండలేవు అని మితవాదులు అర్థం చేసుకోవాలి. ***"నీవు ఒక దేశ భక్తుడిగా ఉండొచ్చు లేదా ఒకలాభాపేక్ష పరుడిగా ఉండవచ్చు. కానీ రెండు విధాలుగా ఉండలేవు".***

**అనువాదం: బోడపట్ల రవీందర్**

**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,** 'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక,
ప్రజాశక్తి ప్రెస్,గవర్నరుపేట, విజయవాడ-2

ఇంటర్వ్యూ

# హిందూత్వవాదుల రాజకీయ జంతువు 'ఆవు'

**డి.ఎన్. ఝా**


రచయిత ప్రముఖ చరిత్రకారుడు

**ప్రముఖ చరిత్రకారుడు, ఢిల్లీ యూనివర్శిటీ విశ్రాంత ఆచార్యుడు, 'ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రిసెర్చ్' సభ్యుడు డి.ఎన్.ఝా భారతదేశ చరిత్రలో ఆవు యొక్క స్థానం గురించిన ఇంటర్వ్యూలో సుదీర్ఘంగా మాట్లాడాడు.**

**ఇంటర్వ్యూ వివరాలు**

***ఆవును ఒక రాజకీయ ఆయుధంగా ఉపయోగించడాన్ని మీరు ఏ విధంగా చూస్తారు? పవిత్రమైనదిగా చెప్పబడుతున్న జంతువు పేరుతో అనేక అపవిత్ర చర్యలు చెయ్యబడుతున్నాయి.***

ఆధ్యాత్మిక ఔన్నత్యం కొరకు ఆవు అసలు ఉపయోగించబడలేదు. 20వ శతాబ్దంలో ప్రతి ఒక్కరూ ఆవును ఒక రాజకీయ ఆయుధంగా ఉపయోగించుకున్నారు. 19వ శతాబ్దం చివరన, 20వ శతాబ్దం మొదట్లో దయానంద సరస్వతి హిందువులను కూడగట్టడానికి ఆవును ఉపయోగించుకున్నాడు. దీని ఫలితంగా అనేక హిందు-ముస్లిం కొట్లాటలు కూడా జరిగాయి. 1925 నుండి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్.ఎస్.ఎస్.) ఇదే విధంగా ఉపయోగించుకుంటున్నది. ఇది (ఆవు) రాజకీయాల కొరకు ఉపయోగించుకోబడుతున్నది. ఏదో మామూలు రాజకీయాల కొరకు కాకుండా, మతతత్వ రాజకీయాల కొరకు, భిన్నాభిప్రాయాలు కలిగిన ప్రజలను రెండు గ్రూపులుగా విడగొట్టే ప్రయత్నం ఇది. ఆధ్యాత్మికత, పవిత్రతతో ఆవు చేయగలిగింది కూడా ఏమీలేదు. ఇది కేవలం ఒక రాజకీయ జంతువు.

***గోరక్షణ పేరుతో రక్షక దళాలు ఈ మధ్య చేస్తున్న దాడుల తరువాత మైనార్టీలు, దళితులు ఐక్యం అయ్యే అవకాశాలు లేవా?***

"దళితులు, మైనార్టీ వర్గాలు ముఖ్యం. కాదు అనే అభిప్రాయాన్ని కలుగజేయడానికే ఆవు ఉపయోగించబడుతుంది."

ఇది చాలా ఆసక్తికరంగా ఉంది అంటే అర్థం ముస్లింలు గోమాంసాన్ని తినడం చాలా సాధారణ విషయమని, భారతదేశంలో దానిని ముందుగా వారే పరిచయం చేశారని మొట్టమొదట మితవాదులు చెప్పేవారు. ఇప్పుడు వారు దళితులపై నిందారోపణలు మోపుతున్నారు. ఒకవైపున మనకు అఖ్లాక్ (యు.పి. రాష్ట్రం, దాద్రి దాడిలో హత్యగావింపబడినాడు) లాంటి ఒక కేసు ఉన్నది. ఇప్పుడు మరొకవైపున ఉనా సంఘటన లాంటి కేసు ఉన్నది. దళితులు, మైనార్టీ వర్గాలు అంత ముఖ్యం కాదు అనే అభిప్రాయాన్ని కలుగజేయడానికే ఆవు ఉపయోగించబడుతున్నది. ముస్లింలను, దళితులను వదిలించుకోవడం అసలు ఉద్దేశ్యం. కానీ వారిరువురూ దగ్గరగా ఐక్యం అవుతున్నారు. ఆర్.ఎస్.ఎస్. కుల రాజకీయాలు చేయాలో లేక మత రాజకీయాలు చేయాలో నిర్ణయించుకోలేకపోతున్నది. వారు ముందు ముస్లింలను దూరం పెట్టాలనుకున్నారు. తరువాత దళితులను ప్రక్కకు పెట్టాలనుకున్నారు. కానీ అది జరగలేదు. దానికి విరుద్ధంగా జరిగింది.

***ముస్లింలు రావడానికి ముందు గోవధ జరగలేదని ఆర్.ఎస్.ఎస్. వాదిస్తుంది?***

అది ఎలా చెపుతుంది? ప్రజలు అంతటా గోమాంసాన్ని తింటూ వస్తూవున్నారు. కేరళలో నంబూద్రీలు తప్ప ప్రతి ఒక్కరూ గోమాంసాన్ని భుజిస్తారు. దేశంలో 72 శాతం కులాలకు చెందినవారు గోమాంసం తింటారు. వారు ఈ పనిని సాంప్రదాయకంగా చేస్తూ వస్తున్నారు. ఈశాన్య భారతదేశంలో ఇది చాలా సర్వసాధారణం. దేశంలో ఏమి జరుగుతుందో ఆర్.ఎస్.ఎస్.కు తెలియదు. ముస్లింలు, దళితులు మాత్రమే గోమాంసాన్ని తింటారని వారు అంటున్నారు. ఇదంతా అర్థం లేనిది. చరిత్రలో ఒకసారి వెనుకకు వెళ్తే, దేవతల అనుగ్రహం కొరకు పశువులను బలి ఇవ్వటం, గోవులను వధించడంలాంటి చర్యలుండేవి. ఆవులు చంపబడేవి, బ్రాహ్మణులు ఆవు మాంసాన్ని తినేవారు అనే దానిలో ఏ విధమైన సందేహం లేదు. ఈ అలవాటు వేదకాలం తరువాత కూడా కొనసాగింది. ఇది బుద్ధుని కాలంలో, మౌర్యుల కాలంలో కూడా ఉన్నది. చారిత్రక రుజువులు వారి యొక్క దృష్టి భావనలకు వ్యతిరేకంగా ఉన్నాయన్న వాస్తవాన్ని హిందూత్వవాదులు గ్రహించడం లేదు.

పెళ్ళిళ్ళు, వొడుగు కార్యక్రమాలు, అతిథుల రాక, చావులు, గృహ ప్రవేశాల సందర్భంగా గోవులను వధించారన్న విషయం ప్రతి ఒక్కరికి తెలుసు. శాస్త్ర సమ్మతమైన ఉదాహరణలు చాలా ఉన్నాయి. ఒక పెద్ద గౌరవనీయ అతిథి వచ్చాడంటే, అతనికి గోమాంసం వండి పెడతాం. వ్యవసాయక కుటుంబాలలో ఇది చాలా సర్వసాధారణం. ఆవుపట్ల వారి యొక్క దృష్టి కోణాన్ని మార్చుకోవడానికి బ్రాహ్మణులకు చాలా సమయం పట్టింది. తరువాత, తరువాత వారు ఆవు మాంసం తినడం మానివేశారు. వేదాలు, ధర్మ సూత్రాలను చూస్తే గోవధ ఒక మంచి పని. మౌర్యుల కాలం తరువాత, పాఠ్య పుస్తకాలలో గోవధకు సంబంధించిన అంశాలు చాలా వరకు తగ్గిపోయాయి. మొదటి మిలీనియం (ఎ.డి.) ప్రారంభంలో ఈ మార్పు ముఖ్యంగా ఉత్తర భారతదేశంలో జరిగింది. ఎవరూ ఖచ్చితమైన తేదీని చెప్పలేరు. ఇది కొన్ని శతాబ్దాల సమయం తీసుకుని ఉండవచ్చు. నా పరిశోధన సంస్కృత పాఠ్య పుస్తకాలకే పరిమితమైంది. తమిళ, మళయాళ పాఠ్య పుస్తకాలు కొన్ని మాత్రమే నాకు తెలుసు. దాని గురించి నేను ఏ విధమైన వివరణ ఇవ్వలేను. కానీ ఉత్తర భారతదేశంలో ఆవు ఒక భిన్నమైన హోదా సాధించడానికి చాలా సమయం పట్టింది. ఆ మార్పుకు ఒక కారణం ఆర్థికపరమైనది. ఎక్కువ భూమి సాగులోకి వచ్చినందు వల్ల, ఆవుకున్న ఆర్థికపరమైన ప్రాముఖ్యత పెరిగింది. బ్రాహ్మణులు ఈ విధంగా అన్నారు. సరే, మా ఆవులు చంపబడవు. కానీ ఆవులు చంపబడతాయి. అత్యంత దిగువ కులానికి చెందినవారు చంపుతారు, కానీ మేము చంపం. కాబట్టి వారు (బ్రాహ్మణులు) గోమాంసం తినడాన్ని దళితులకు

చేర్చారు. ఈ ప్రక్రియ నెమ్మదిగా, కొన్ని వందల సంవత్సరాల సమయం తీసుకుంది.

*ప్రాచీన భారతదేశంలో పూజారులకు పశువులను దానంగా ఇచ్చేవారని విన్నాం?*

ఔను! అది దక్షిణ. ఆ అవసరంలో నుండే ఆవులు వధించబడకూడదు అన్న భావం పుట్టి ఉండవచ్చు. వారి ఆవులు వధించబడవు అని మాత్రమే బ్రాహ్మణులు చెప్పారు. కులాలు కఠినతరం అయి, వ్యవసాయ విస్తరణ జరిగిన తరువాత కొంతకాలం గడిచాక దాని భావం అర్థం అయి ఉంటుంది.

*ఆ మార్పు ఆవుకు సంబంధించేనా లేక అన్ని రకాల పశువులకు సంబంధించి కూడానా?*

బహుశా అన్ని జంతువులకు. కానీ ఇప్పుడు ఆవు చర్చలో ఉన్నది కాబట్టి ప్రాచీన భారత దేశంలో వేదకాలం నుండి ఆవులు వధించబడి నాయన్న విషయం గుర్తుంచుకోవడం చాలా ముఖ్యం. ఎవ్వరూ, బ్రాహ్మణులు కూడా చాలా కాలంపాటు వాటిని పవిత్రమైనవిగా పరిగణించ లేదు.

*ఇంద్రుడు గోమాంసంతో అనుగ్రహింప బడేవాడని మీరు అన్నారు. పవిత్ర గ్రంథాలు చెప్పే విషయాలు సాధారణ మానవుడు ఎలా మరిచిపోయాడు?*

ఒక సమయంలో ఇంద్రుడు ముఖ్యమైన వాడు. నేడు సంతోషిమాత ముఖ్యమైన దేవత. పరశురాముడు ఒకానొక సమయం ప్రసిద్ధి చెందినవాడు. ఇప్పుడు ఎవ్వరికీ గుర్తు లేదు. దేవతల ప్రాముఖ్యతలలో వచ్చిన మార్పు పరిస్థితులను మారుస్తాయి. ఇది కేవలం ఆర్థిక పరమైన, కులపరమైన అంశాలలోనేకాదు, మతపరమైన అంశాల్లో కూడా ముఖ్యమైనవే. ఉత్తర భారతదేశాన కృష్ణుడు ప్రసిద్ధిచెందిన దేవుడుగా ఉన్నపుడు ఆవును కూడా పైకి తీసుకురావడం జరిగింది. అతడు ఆవులతో ఆడుకున్నాడు. కృష్ణుని పూజించే విధానం విస్తరించడానికి కూడా సమయం పట్టినది. నెమ్మదిగా కుల ఆధిపత్యం కఠినతరంగా మారింది. ఈ అంశాలన్నీ కలగలసిపోయాయి. 9, 10 శతాబ్దాల నాటికి బ్రాహ్మణులు గోమాంసం తినడం లేదు. గోమాంసం భుజించడమనే విషయాన్ని వారు దళితులకు అంటగట్టారు. కానీ ఏ బ్రాహ్మణవాద పాఠ్య పుస్తకాలు కూడా గోవధను పెద్ద నేరంగా చూపించలేదు. సాంప్రదాయ భారతీయ సాహిత్యంలో, నేరాన్ని పెద్ద, చిన్న నేరాలు (మహాపాతక, ఉపపాతక) గా వర్గీకరించడం జరిగింది. గోవధ అనేది ఉపపాతక నేరంగా ఉండేది. ఇది నీ వ్రేళ్ళతో పళ్ళు తోముకోవడం ఎంత చెడో, అంత చెడుగా

**"కానీ "ఆవు మాత్రమే" ఎందుకు? ఎద్దు సంగతేమిటి? ఎద్దును, నందిని పూజించే విధానం ఉన్నప్పటికీ, వాటి గురించి ఎవరూ ఏమీ మాట్లాడడం లేదు. ఆవుకు మన దేశంలో ఒక్క గుడి లేదు. కానీ సినిమా నటి మాధురీ దీక్షిత్‌కు జంషెడ్‌పూర్‌లో, ఎం.జి.ఆర్.కు తమిళనాడులో గుడులు ఉన్నాయి. పాపం! ఆవుకు మాత్రం గుడి లేదు."**


నకిలీ గో రక్షణ గూండాలు

చెప్పబడేది. అది అసలు నేరమేకాదు. ఈ మితవాదులు విషయాలన్నీ స్పష్టంగా వ్రాయబడిన ధర్మశాస్త్రాలు, ప్రవర్తనా నియమాలకు సంబంధించిన పాఠ్య గ్రంథాలను అధ్యయనం చేయాలి. నేడు వారు (మితవాదులు) గోవధను కఠినమైన శిక్షకు అర్హమైన తీవ్రమైన పెద్ద నేరంగా చెబుతున్నారు. ఒట్టి నేరారోపణలపై నీవు అరెస్ట్ చేయబడవచ్చు. అయినా ఇదంతా వారి సొంత శాస్త్రాలకు విరుద్ధమైనది.

*గోరక్షక సమితులను మీరు ఎలా చూస్తారు?*

గోరక్షణపై ఎంతో విశ్వాసంతో నమ్మకం ఉన్న కొంతమంది ఉండవచ్చు. నాకు కూడా పశువుల రక్షణపై, వాస్తవానికి అన్ని జంతువుల రక్షణపై నమ్మకం ఉన్నది. జంతువులు చంపబడడం నాకు ఇష్టం ఉండదు. కానీ "ఆవు మాత్రమే" ఎందుకు? ఎద్దు సంగతేమిటి? ఎద్దును, నందిని పూజించే విధానం ఉన్నప్పటికీ, వాటి గురించి ఎవరూ ఏమీ మాట్లాడడం లేదు. ఆవుకు మన దేశంలో ఒక్క గుడి లేదు. కానీ సినిమా నటి మాధురీ దీక్షిత్‌కు జంషెడ్‌పూర్‌లో, ఎం.జి.ఆర్.కు తమిళనాడులో గుడులు ఉన్నాయి. పాపం! ఆవుకు మాత్రం గుడి లేదు. అయినా దీనిని గురించి పెద్ద గొడవ చేస్తున్నారు.

*అయితే ఆవు బ్రహ్మకన్నా నిరుపేద స్థితిలో లేదా?*

అవును నాకు తెలిసినంతవరకు ఆవుకు భారత దేశంలో గుడిలేదు. వాస్తవానికి ఎద్దులు గుడుల చుట్టూ తిరుగుతుంటాయి. శివుని కారణంగా దేశంలోని కొన్ని ప్రాంతాలలో నందిని పూజించే విధానం ఉన్నది. కానీ ఆవుకు కేవలం ఒక్క గోపాష్టమి మాత్రమే ఉంటుంది. ఆరోజున ఆవుకు కుంకుమ జల్లి పూలదండలు వేస్తారు.

*ఆవుకు పూలదండలు వేయడం ఎప్పుడు ప్రారంభమైంది?*

దీనికి సంబంధించి ప్రాచీన పాఠ్య పుస్తకాలలో ఏ విధమైన సమాచారం నాకు దొరకలేదు. బహుశా ఈ మధ్యే అయివుంటుంది. బహుశా 18వ లేక 19వ శతాబ్దంలో అయివుండవచ్చు. ధర్మశాస్త్రాలు ఆవుకు దండలు వేసే విషయం గురించి ఏమీ తెలుపలేదు.

*మధ్య యుగాల భారతదేశంలో యుద్ధాలలో రక్షణ కోసం ఆవులు ఉపయోగించబడేవనేది నిజం కాదా?*

ఆ సమయానికే ఆవు చాలా ప్రాముఖ్యమైన జంతువుగా ఉన్నది. కానీ ఆవులు, ఇద్దరు హిందూ పాలకుల మధ్య పోరాటం జరిగినపుడు రక్షణకు ఉపయోగించబడేవి. కానీ మధ్యయుగ భారతదేశంలో యుద్ధాలు సాధారణంగా ముస్లింలకు, స్థానిక హిందూ పాలకులకు మధ్యన జరిగేవి. 19వ శతాబ్దం చివరిలో సిక్కుల కుకాస్‌కు సంబంధించి, దాదాపు అటు, ఇటుగా అదే సమయంలో దయానంద సరస్వతి గురించి నేను చెప్పాను. కానీ కుకాలు బ్రిటిష్ వారిని వ్యతిరేకించడానికి ఆవును ఉపయోగించారు. దయానంద సరస్వతికి వేరొక భిన్నమైన లక్ష్యం ఉన్నది. ఆయన హిందువులను కూడగట్టడానికి, శుద్ధి చేసుకోవడానికి గోవును వినియోగించాడు. ఇరువురికి గోవును రక్షించాలనే ఉద్దేశ్యం ఉన్నది. జైనులు కూడా అదే చేశారు. వాస్తవానికి జైనుల జనాభా ఎక్కువగా ఉన్న రాజస్థాన్, గుజరాత్‌లలో గోశాలలు ఎక్కువ సంఖ్యలో

> **"గోరక్షణ దళాల పేరుతో ముస్లింలు, దళితులపై జరిగే ఈ దాడులే వారిని ఐక్యం చేస్తాయి. గోవు అప్పుడు 'గ్లూ' గా (జిగురు) పనిచేస్తుంది. గోరక్షక దళాల దాడులు వారికే వ్యతిరేకంగా పరిణమిస్తాయి. ఇప్పుడు ఒక మదింపు జరుగుతున్నట్లు అనిపిస్తున్నది. దానివల్ల వచ్చే నష్టం ఏమీలేదు. దీనంతటికి అవసరమైనదల్లా ప్రజలతో మమేకం కావడం, జనంలో పనిచేయడం."**

ఉన్నాయి. నేడు గోశాలలో మరణించిన ఆవును తీసివెయ్యడానికి ఎవరూ లేరన్న విషయం చూస్తే ఈ మొత్తం విషయం ఒక జోక్‌గా అనిపిస్తున్నది.

***నేడు ఆవు జీవించి ఉంటే ఆమె తల్లి, ఆవు మరణిస్తే...?***

అయినప్పటికీ దళితులు చనిపోయినఆవు చర్మం తీస్తుంటే వారు దాడి చేస్తున్నారు లేక చంపుతున్నారు. జైపూర్ నుండి 20 కిలోమీటర్ల దూరంలో రాజస్థాన్‌లోని ఒక పెద్ద గోశాలలో రోజుకు 20 ఆవులు చనిపోతున్నాయి. కానీ ఆ జంతు కళేబరాలను తొలగించడానికి ఏ ఒక్కరూ లేరు. ఇప్పుడు ఉనాలో జరిగిన సంఘటనతో ఈ సమస్య మరింత జటిలం అవుతుంది. తిరుగుబాటు ఫలితంగా దళితులు చనిపోయిన జంతువుల చర్మం తీయడానికి సిద్ధంగా లేకపోవడాన్ని సమర్థించవచ్చు. ఆవును రక్షించడం అనేది ఒక జోక్. ఒకవేళ ఆమె తల్లి అయినా రోడ్డు మధ్యలో కూర్చుంటుంది, లేదా చెత్త తింటుంది లేదా చెత్త కుప్పలోని ప్లాస్టిక్‌ను తింటుంది. ఆవుకు ఏ రకమైన రక్షణ ఇస్తున్నారు? ఆవుచే ముట్టబడిన ఆహారం అపరిశుద్ధమైనదని ధర్మశాస్త్రాలు స్పష్టంగా తెలుపుతున్నాయి. అది పరిశుద్ధం చేయబడాలి. బ్రాహ్మణులు ఆ ఆహారాన్ని తినరు. కాబట్టి ఆమె (ఆవు) ఏ రకమైన తల్లి అవుతుంది?

***స్వాతంత్ర్య పోరాట కాలంలో 19వ శతాబ్దం చివరన, 20వ శతాబ్దం మొదట్లో హిందీ ప్రెస్‌లో అచ్చువేయబడిన వ్యాసాలలో ఆవు ఒక గొప్ప జంతువుగా వర్ణించబడేది. గీతా ప్రెస్ కూడా అలాంటి చాలా వ్యాసాలను ప్రచురించింది?***

గీతా ప్రెస్ ఎల్లప్పుడూ సనాతన భావాలను పునరుద్ధరించేదిగా ఉంది. ఇది జాతీయ ఉద్యమంలో ప్రతీఘాతక పాత్రను పోషించింది. గీతా ప్రెస్‌లో అచ్చువేయబడిన 'కళ్యాణ్' పత్రికను విద్యావంతులైన ఒక తరానికి చెందిన కొందరు హిందువులు మత ప్రాతిపదికన చదివేవారు. మా తండ్రి ఉదారవాది అయినప్పటికీ, దానిని చదవడానికి ఇష్టపడేవారు. కానీ అది చాలా మందిపైన ప్రతీఘాతక ప్రభావాన్ని కలుగజేసింది.

***సావర్కర్ లాంటి నాయకుని గురించి ఏమంటారు? అతను గోరక్షణలో అంతగా లేడు.***

సావర్కర్ గోరక్షణకు అనుకూలంగా లేడు. కొంతకాలం గడిచిన తరువాత ఆవును రక్షించడంలో అర్థంలేదని అంటాడు అతడు. వారి యొక్క మతపరమైన భావాలను గాయపరుస్తున్నారని నేరారోపణ చేసే కపట వ్యక్తులను సావర్కర్ ఎగతాళి చేస్తాడు. "ఆవు మూత్రాన్ని వినియోగించే దాని గురించి ఏమీ పట్టించుకోరు కానీ అదే సమయంలో కొంత మందిని దూరం పెడతారు". అని ఒకసారి సావర్కర్ అంటాడు. వీరు వారియొక్క సొంత చరిత్రను చదవరు. ఇది సౌకర్యవంతమైన అజ్ఞానం. సమాచారంతో కూడుకున్న, న్యాయబద్ధమైన లేదా హేతుబద్ధమైన విషయాలు వారికి అక్కరలేదు. వారికి గుడ్డి విశ్వాసం ఉంది. బహుశా గుడ్డి వ్యతిరేకత కూడా ఉండవచ్చు.

***దళితులకు, ముస్లింలకు దీనినుండి తప్పించుకునే మార్గం ఏమిటి? దీనిని వారు ఎలా ఎదుర్కోవాలి?***

ఇక్కడ వామపక్షాల అవసరం ఉంది. సమాజంలోని ఈ రెండు భాగాలను వామపక్షాలు ఐక్యం చేయాలి. వామపక్షం కూడా ఎక్కువగా బ్రాహ్మణ నాయకత్వం కలిగి ఉంటూ వస్తున్నది. అది ఆ నేపథ్యాన్ని వదిలివేసి వీరిని (దళితులు, ముస్లింలు) ఐక్యం చేయాలి.

***మాయావతి తన పాత్రను పోషించాలని కోరడం జరిగింది. బహుశా ఉత్తరప్రదేశ్‌లో రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొనేనా?***

ఆమె తన స్వంత ప్రయత్నం చేయవచ్చు. కానీ వామపక్షం తన పాత్రను పోషించాలి. మాయావతికి విషయాలను చర్చించటం ఇష్టం లేదు. వామపక్షం విషయాలను న్యాయబద్ధంగా తర్కించగలదు. ఆవును వధించే కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో వారికి గట్టి పునాదులున్నాయి. వారు అది చేయగలరు. వామపక్షాలు పునరాలోచించుకోవాలి. ముస్లింలు, దళితులు దగ్గరవుతున్నారు. ఈ భావన పట్ల వామపక్షానికి ఏ విధమైన ప్రతికూల అభిప్రాయం లేదు.

కానీ అవసరమైతే వారు నాయకత్వ పాత్రను పోషించాలి. సీతారాం ఏచూరి లాంటి వ్యక్తి ముందుకు రావాలి. మీరు బెంగాల్ లో కాంగ్రెస్, వామపక్ష కూటమికి అనుకూలంగా వాదించగలిగినపుడు, మీరు దళితులను, ముస్లింలను ఎందుకు ఐక్యం చెయ్యలేరు? ఈ పార్టీలలో చాలా తక్కువ సంఖ్యలో ముస్లింలు, దళితులు ఉన్నారు. అది మారాలి. ఎంతైనా బెంగాల్‌లో ముజఫర్ అహ్మద్ చేత స్థాపించబడిన పార్టీలో ఎక్కువమంది (దళితులు, ముస్లింలు) ఉండాలి. నాకొక భావం ఉంది. గోరక్షణ దళాల పేరుతో ముస్లింలు, దళితులపై జరిగే ఈ దాడులే వారిని ఐక్యం చేస్తాయి. గోవు అప్పుడు 'గ్లూ' గా (జిగురు) పనిచేస్తుంది. గోరక్షక దళాల దాడులు వారికే వ్యతిరేకంగా పరిణమిస్తాయి. ఇప్పుడు ఒక మదింపు జరుగుతున్నట్లు అనిపిస్తున్నది. దానివల్ల వచ్చే నష్టం ఏమీలేదు. దీనంతటికి అవసరమైనదల్లా ప్రజలతో మమేకం కావడం, జనంలో పనిచేయడం. ఆ విధంగా చేయడానికి ఎంతమంది ఇష్టపడతారో నాకు తెలియదు.

***ఈ ఆవు రాజకీయాలు 2019 వరకు కొనసాగుతాయనుకుంటారా, లేక కేంద్రంలో హిందూత్వ శక్తులు ముఖ్యమైన పాత్ర పోషించినంతకాలం కొనసాగుతాయా?***

ఆవు రాజకీయాలు ఆర్.ఎస్.ఎస్. వరం. ఆర్.ఎస్.ఎస్. నిలదొక్కుకునే విధానం, ప్రభుత్వంపై ప్రభావాన్ని నెరపినంత కాలం (రాజకీయాలలో పైచేయి సాధించటానికి) ఎన్ని ఘర్షణలు ఉన్నప్పటికీ ఆవు కొనసాగుతుంది.

***మనం ఒక వివాదం నుండి వేరొక వివాదంలోకి అంటే 'భారత్‌మాతా' నుండి 'గోమాతా' కు జారిపోయినట్లు అనిపిస్తుంది. మీరు దీనిని ఎలా చూస్తారు?***

గోమాత, భారత్‌మాత చాలా దగ్గరి సమకాలీనులు. భారత్‌మాతా అనే భావం దాదాపు 100 సంవత్సరాల (కొద్దిగా ఎక్కువే) క్రితమే వచ్చింది. దానియొక్క దృష్టి సంబంధమైన చిత్రం అభనీంద్రనాథ్ ఠాగూర్ యొక్క చిత్రలేఖనం 1905 తరువాత వచ్చింది. గోమాత కూడా అదే కాలంలో వచ్చింది. రానున్న కాలంలో భారతదేశంలో రాజకీయ, సాంస్కృతిక అంశాలను భ్రష్టు పట్టించడానికి అవి కొనసాగుతాయి.

**అనువాదం : బోడపట్ల రవీందర్**

సందేహాలు సమాధానాలు



- బి.వి.రాఘవులు

# బిజెపి టిడిపి వ్యతిరేక వైఖరి ఎవరు తీసుకున్నా సమర్థించాలి

కామ్రేడ్ రాఘవులు గారికి,

**18.9.2016 న ఆంధ్రజ్యోతిలో కొత్త పలుకు శీర్షికలో ఆర్.కె గారు కమ్యూనిస్టులకు గద్దుకాలం అను ఉపశీర్షికలో కాకినాడ సభలో పవన్‌కళ్యాణ్ "సి.పి.ఎం పోరాటాలకు తాను దాసోహం అయ్యానని కమ్యూనిస్టులంటే తనకెంతో గౌరవమని అనడంతో కమ్యూనిస్టుల్లో ఆశలు చిగురించాయి. ఇంతకాలానికి జనాకర్షణ నాయకుడు తోడు దొరికాడని సంబరపడి పోతున్నారని, సి.పి.ఎం నాయకుడు రాఘవులు ఒకడుగు ముందుకేసి పవన్‌కళ్యాణ్ తన పోరాట కార్యక్రమం ప్రకటించాలని, కలిసి నడిస్తే సహకరిస్తామన్నారని చెప్పుకొచ్చారు. పెద్ద వ్యాసంలో కమ్యూనిస్టులను సున్నితమైన వ్యంగ్యంతో విమర్శించారు. ఆ వ్యాసం చదివిన నాబోటి వాళ్ళల్లో బూర్జువాలను బలపరిచే వ్యాసాలు ఇలా ఉంటాయనుకోటం సహజమేనా? పవన్‌కళ్యాణ్ మీద మీకు అంత నమ్మకం ఉందా? దయచేసి విశదపరచకోరుతున్నాను.**

**మీ**

**ఆర్. రోశయ్య, మధిర**

**ఖమ్మంజిల్లా**

ఆంధ్రజ్యోతిలో రాధాకృష్ణగారి వ్యాఖ్యానం గురించి తర్వాత ప్రస్తావిస్తాను. ముందు పవన్ కళ్యాణ్ గురించి నేను చేసిన ప్రస్తావన గురించి వివరిస్తాను. పవన్‌కళ్యాణ్ తన ప్రసంగాలలో స్పెషల్ స్టేటస్ మరియు ఇతర సమస్యల గురించి ప్రస్తావిస్తూ బిజెపి గురించి గట్టిగా తెలుగుదేశం గురించి మెత్తగా విమర్శించారు. బిజెపి చేసిన వాగ్దానాలకు భిన్నంగా స్పెషల్‌స్టేటస్. రైల్వేజోన్, స్టీల్‌ప్లాంట్ ఇంకా అనేక విషయాలలో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జేసిన నేపథ్యంలో పవన్‌కళ్యాణ్ బిజెపిని తప్పు పట్టడాన్ని ఎవరైనా ఆహ్వానించాల్సిందే. 2014 ఎన్నికల్లో బిజెపి టిడిపి కూటమికి గట్టిగా మద్దతు ఇచ్చిన ఆయన ఇప్పుడు విమర్శకు దిగడాన్ని ప్రోత్సహించాలే తప్ప. సంశయాల పేరుతో తిరస్కరించడం సరైంది కాదు. తెలుగుదేశం తరపున, దాన్ని ఇరకాటం నుండి తప్పించడానికే పవన్‌కళ్యాణ్ విమర్శలకు పూనుకున్నాడని, ఆయన విమర్శల్లో చిత్తశుద్ధి లేదని కొందరు విమర్శించారు. వేమూరి రాధకృష్ణగారికి అటువంటి భావం ఉండొచ్చు. వీరి అంచనాలు నిజం కూడా కావచ్చు. కానీ పవన్‌కళ్యాణ్ ఉద్దేశ్యాలేమైనా, చేసిన విమర్శ సరైన దయినప్పుడు ఆక్షేపించడం సరికాదు.

భవిష్యత్తులో పవన్‌కళ్యాణ్ ఏమి జేస్తాడో అన్నది ఆయన తేల్చుకోవాల్సిన విషయం. భవిష్యత్తులో కూడా ఆయన రాజకీయంగా బిజెపి, టిడిపి కూటమికి వ్యతిరేక వైఖరి తీసుకుంటే తప్పకుండా ఆహ్వానించాలి. 2014లో లాగా అనుకూలంగా వ్యవహరిస్తే ఖచ్చితంగా వ్యతిరేకించాలి. ఆయన ఏంచేస్తాడా అని సిపిఐ(ఎం) ఊహాగానాలు చెయ్యదు. ఆయా సందర్భాలను బట్టి స్పందిస్తుంది. సిపిఐ(ఎం) ఎవరి మీద అనవసర భ్రమలు పెట్టుకోదు. ప్రస్తుత దేశ పరిస్థితులలో మతోన్మాదాన్ని పెంచి పోషిస్తూ, సామాజిక న్యాయానికి, ప్రజల జీవన ప్రమాణాలకు విఘాతం కల్గిస్తున్న బిజెపికి, దానికి మిత్రుడుగా వ్యవహరిస్తున్న తెలుగుదేశానికి వ్యతిరేకంగా సరైన వైఖరిని ఎవరు తీసుకున్నా సమర్థించటానికి సిపిఐ(ఎం) వెనకాడదు. పాలకవర్గాల మేధావులు కమ్యూనిస్టుల ప్రకటనల పట్ల ప్రశంసా పూర్వకమైన వైఖరులు తీసుకుంటారన్న భ్రమలు సిపిఐ (ఎం)కు లేవు. కమ్యూనిస్టు వ్యతిరేక వాతావరణం సృష్టించటానికి అనుకూలమైన అంశాలు వచ్చినప్పుడు పచ్చి విషాన్ని కక్కుతారు. కమ్యూనిస్టుల ను విమర్శజేస్తే ప్రజలు అపార్థం జేసుకుంటారనుకున్న విషయాలొస్తే వ్యంగ్యోక్తులతోనో లేక ప్రశంసిస్తున్నట్లు కన్పిస్తూనే ఉద్దేశ్యాలను అంటగడుతూనో కమ్యూనిస్టులను చులకన, పలచన జేయాలని ప్రయత్నిస్తారు. రాధాకృష్ణగారి వ్యాఖ్యానాలలో ఈ ధోరణిని పుష్కలంగా జూడవచ్చు.

**ఫేస్‌బుక్ కోసం 27 9 16న బివి రాఘవులు గారు చేసిన ప్రసంగం విన్న తర్వాత శ్రోతల నుండి వచ్చిన ప్రశ్నలు**

**నితీష్‌కుమార్ నాయకత్వంలో మూడవ ఫ్రంట్ ఏర్పాటు కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. మూడవఫ్రంట్ పట్ల సిపియం వైఖరి ఏమిటి?**

**చంద్రశేఖర్**

అఖిలభారతి స్థాయిలో అప్పుడప్పుడు తృతీయ ఫ్రంటు ఏర్పాటు గురించి వార్తలు వస్తున్నాయి. ఊహగానాలు తప్ప నిర్దిష్టమైన రూపురేఖలేమి కన్పించడం లేదు. తృతీయ ఫ్రంటు స్పష్టమైన రూపం తీసుకున్నప్పుడు ఆ ఫ్రంటు యొక్క విధానాలు, దానిలోని భాగస్వాముల స్వభావాన్ని బట్టి తన వైఖరిని నిర్ణయించుకుంటానని సిపిఐ (ఎం) ఇప్పటికే స్పష్టం చేసింది. అఖిలభారత స్థాయిలో వామపక్ష, ప్రజాతంత్ర సంఘటనను నిర్మించేందుకు కృషిజేయాలి. ఎన్నికల దృష్టితోనే కాకుండా, ప్రస్తుత బిజెపి, కాంగ్రెస్, ఇతర బూర్జువా పార్టీలు అనుసరిస్తున్న విధానాలకు భిన్నమైన విధానాల కోసం ఆ ఫ్రంటు పనిజేయాలని సిపిఐ(ఎం) భావిస్తున్నది. అందువలన నితీష్‌కుమార్‌గాని, మరెవరైనా తృతీయ ఫ్రంటును నిర్మిస్తే, పైన పేర్కొన్న విధానానికి అనుగుణంగా సిపిఐ (ఎం) తన వైఖరిని నిర్ణయించుకుంటుంది.

**టిడిపి బిజెపితో తెగతెంపులు చేసుకొంటే ఆ పార్టీతో పొత్తు పెట్టుకుంటారా?**

**షేక్ రహీం**

టిడిపి బిజెపితో పొత్తును తెగదెంపులు జేసుకోవడం, టిడిపితో సిపిఐ (ఎం) పొత్తుపెట్టుకోవడం అనేవి రెండు వేర్వేరు అంశాలు. టిడిపితో తెగతెంపులు జేసుకుంటే

సిపిఐ(ఎం) ఆహ్వానిస్తుంది. దేశసమైక్యత, ప్రజా ప్రయోజనాలను కాక్షించేవారెవరైనా బిజెపి మతోన్మాద రాజకీయాలను తిరస్కరించాలని సిపిఐ(ఎం) కోరుకుంటున్నది. రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వడానికి బిజెపి తిరస్కరించిన తర్వాత కూడా టిడిపి దానితో అంటకాగుతున్నదంటే టిడిపికి రాష్ట్రం కన్నా తన అధికార అవసరాలే ముఖ్యం అన్నది తేటతెల్లం అవుతున్నది. బిజెపితో మిత్రుత్వం నెరపే శక్తులతో ఎన్నికలు పొత్తులుండవు. టిడిపి నేడు రాష్ట్రంలో అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఐ(ఎం), వామపక్షాలు పోరాడుతున్నాయి. ప్రత్యామ్నాయశక్తులను కూడగట్టాలని ప్రయత్నిస్తున్నాయి. ఆ కృషిని ఇంకా బలంగా కొనసాగించాలని సిపిఐ(ఎం) ప్రయత్నిస్తున్నది. ఎన్నికల పొత్తులు అన్న అజెండాకు, ఆలోచనలకు ప్రస్తుతం ఆస్కారం లేదు.

**పాకిస్థాన్‌కు చైనా నుండి పూర్తి సహకారం ఉంది. పాకిస్థాన్ భారత్‌పై ఉగ్రదాడి చేసింది. దీనిపై సిపియం వైఖరి ఏమిటి?**

**గిరిజనసంఘం**

**వైజాగ్**

ఉరిలోని మరో సైనిక స్థావరంపై ఉగ్రవాదులు దాడిచేసి అనేక మంది మన జవాన్లను హత్యజేశారు. మనసైన్యం ఉగ్రవాదులను మట్టుబెట్టింది. గతంలో పాకిస్తాన్ ప్రోత్సాహంతో, శిక్షణతో ఉగ్రవాద దాడులు జరిగినట్లుగానే ఈదాడి కూడా జరిగింది. ఈదాడిని ప్రపంచదేశాలన్ని ఖండించాయి.

సరిహద్దుకావల ఉగ్రవాదులు తలదాచుకునే కొన్ని కేంద్రాలపై మన బలగాలు 29 వ తేదిన ఆకస్మికంగా దాడి జేసి ధ్వంసం జేసి గట్టి సమాధానం చెప్పాయి.

అంతర్జాతీయంగా పలుదేశాలు ఉగ్రవాద చర్యలను ఖండిస్తూనే పాకిస్తాన్ ఇండియా రెండు దేశాలు సంయమనం పాటించాలని చెబుతున్నాయి. పాకిస్తాన్‌పై యుద్ధంజేసి కక్షతీర్చుకోవాలన్న దుందుడుకు వాదాన్ని ప్రచారం జేస్తున్న శక్తులు, ముఖ్యంగా సంఘపరివార్‌శక్తులు ఒకవైపు, పాకిస్తాన్‌ను దౌత్యపరంగా ఒంటరిని జేసి ఉగ్రవాదాన్ని అరికట్టే చర్యలు తీసుకోవాలనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్న శక్తులు మరోవైపు ఉన్నాయి. ఇప్పటికే సిపిఐ(యం) తనవైఖరి స్పష్టంజేసింది. ఉగ్రవాద దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టేందుకు చర్యలు తీసుకుంటూనే పాకిస్తాన్ ఇండియాల మధ్యపూర్తిస్థాయి యుద్ధం దాపురించే స్థితికి మనవైపునుండి అవకాశం లేకుండా వ్యవహరించాలని దౌర్యపరంగా, రాజకీయపరంగా ఉగ్రవాదాన్ని సమర్థించే పాకిస్తాన్‌ను ఒంటరి జేయడానికి కృషిచేయాలని చెప్పింది. అయితే ఉగ్రవాద చర్యలను ఖండించినప్పటికి అమెరికా, రష్యా, చైనా వంటి దేశాలు పాకిస్తాన్‌తో మిలటరీ సహకారాన్ని కొనసాగిస్తున్నారు. రష్యా పాకిస్తాన్‌తో కలిసి సైనిక విన్యాసాలను నిర్వహిస్తున్నది. చైనా ఆయుధ విక్రయం కొనసాగిస్తున్నది. బిజెపి కేంద్రప్రభుత్వం గతంలో అనుసరించిన అలీన విధానానికి స్వస్తిచెప్పి అమెరికాకు ఉపాగంగా వ్యవహరించే విధానాన్ని చేపట్టడంతో రష్యా, చైనాలు పాకిస్తాన్‌తో స్నేహాన్ని పటిష్టం చేసుకుంటున్నాయి. గతంలో మన దేశానికి గట్టి మిత్రునిగా నిలబడిన రష్యా కూడా పునరాలోచనలో పడ్డది. అందువలన బిజెపి అనుసరిస్తున్న అమెరికా అనుకూల విదేశాంగ విధానం ఉగ్రవాదులకు సహాయం చేస్తున్న పాకిస్తాన్‌ను అంతర్జాతీయంగా ఒంటరిని చేయడానికి ఆటంకంగా మారింది.

# దక్షిణ చైనా సముద్ర సమస్య అమెరికా

(11వ పేజీ తరువాయి)

చైనాకు కూడా దక్షిణ చైనా సముద్ర ప్రాంతం విషయంలో వివాదాలున్నాయి. అక్టోబర్ మొదటి వారంలో అమెరికాతో తమ దేశం జరిపే సంయుక్త సైనిక విన్యాసాలే చివరివనీ, ఈ మేరకు తాను అమెరికాకు నోటీసు ఇస్తున్నానని డ్యుటెర్టె చెప్పాడు. ఇకపై తమ దేశం చైనా, రష్యాలతో కొత్త వాణిజ్య, వ్యాపార సంబంధాలు పెట్టుకుంటుందని కరాఖండీగా ప్రకటించాడు. అంతే కాదు దక్షిణ చైనా సముద్రం నుండి అమెరికా వైదొలగాలని కూడా ఆయన ప్రకటించాడు. అంతకు ముందు చైనాకు డ్యుటెర్టె తన దూతను పంపించి సత్సంబంధాలు నెలకొల్పుకునేందుకు మార్గం సుగమం చేసుకున్నాడు. ఫిలిప్పీన్స్ వైఖరిలో మార్పుకు కారణం ఒకటే, ఈ ప్రాంతంలో అమెరికా ప్రయోజనాల కోసం పనిచేస్తే చైనా నుండి వచ్చే ఆర్థిక సాయం ఆగిపోతుంది. అది ఫిలిప్పీన్స్‌ను బాగా దెబ్బతీస్తుంది. ఇక్కడ ఉద్రిక్తతలు పెరిగితే ఏటా ఫిలిప్పీన్స్‌కు వచ్చే 80,000 మంది పర్యాటకులు రాకుండా ఆగిపోతారు. దీన్ని ఫిలిప్పీన్స్ ఆర్థిక వ్యవస్థ భరించలేదు. అలాగే మలేసియా కూడా చైనాతో చర్చలకు దిగి వచ్చింది. మలేసియాతో అతి పెద్ద వాణిజ్య భాగస్వామిగా చైనా ఉంది. దాన్ని మలేసియా వదులుకోలేదు. 'బెల్ట్ అండ్ రోడ్' పథకంలో భాగంగా చైనా ఈ దేశాల్లో అనేక రోడ్డు మార్గాలు, రైల్వే లైన్లు, పోర్టులు నిర్మిస్తోంది. అలాగే 4 లక్షల జనాభా ఉన్న బ్రూనీ చమురు వ్యాపారం ప్రధానంగా చైనాతో జరుగుతోంది. అందువల్ల ఈ ప్రాంతంలో దేశాలు చైనా పెట్టుబడులు, దానితో వ్యాపారాన్ని వదులుకోడానికి సిద్ధంగా లేవు. వియత్నాంతో కూడా ఇటీవల చైనా ప్రధాని ఈ సమస్యపై చర్చలు జరిపారు. ఏమైనా దక్షిణ చైనా సముద్రంలో చైనాను అమెరికా ఆయుధాలతో దెబ్బతీయాలని చూస్తుంటే చైనా వాణిజ్యంతో దాన్ని ఎదుర్కొంటోంది. అదే సమయంలో రెండు దేశాలూ ఈ ప్రాంతంలో తమ సైనిక బలగాలను సన్నద్ధం చేస్తున్నాయి. జపాన్, దక్షిణ కొరియాలతో కలిసి ఈ ప్రాంతంలో అమెరికా పెద్ద ఎత్తున సైనిక విన్యాసాలు నిర్వహించింది. ఉత్తర కొరియాకు వ్యతిరేకంగా తాము ఈ విన్యాసాలు నిర్వహిస్తున్నట్లు అమెరికా ప్రకటించినా వాస్తవానికి దాని లక్ష్యం చైనానే. అలాగే దక్షిణ చైనా సముద్రంపై చైనా సార్వభౌమత్వాన్ని ధిక్కరిస్తూ అది తన యుద్ధ నౌకను ఆ ప్రాంతానికి పంపింది. చైనా ఐక్యరాజ్య సమితి సముద్ర చట్టాన్ని ఉల్లంఘించిందని అమెరికా గగ్గోలు చేస్తోంది. కానీ వాస్తవానికి ఈ చట్టాన్ని వందకు పైగా దేశాలు ఆమోదించినా అమెరికా ఇప్పటికీ ఆమోదించ లేదు. అమెరికా, దాని మిత్రుల సైనిక విన్యాసాలకు ప్రతిగా ఇటీవల చైనా – రష్యాలు కలిసి దక్షిణ చైనా సముద్రంలో విన్యాసాలు నిర్వహించాయి.

మొత్తం మీద చూసినప్పుడు బరాక్ ఒబామా 'ఆసియా కేంద్రం' విధానం వల్ల నేడు ఆసియా ఖండం ఉద్రిక్త మయంగా మారింది. మొదటి ప్రపంచ యుద్ధం, రెండవ ప్రపంచ యుద్ధం యూరప్ కేంద్రంగా జరిగితే 'ఆసియా కేంద్ర' విధానం వల్ల ఇప్పుడు ఆసియా ఖండం యుద్ధ క్షేత్రంగా మారే ప్రమాదం ఏర్పడింది. దురదృష్టమేమంటే ఈ ఉద్రిక్తతల్లో భారత దేశం అమెరికాకు జూనియర్ భాగస్వామిగా మారి చైనా వ్యతిరేక వైఖరి తీసుకుంది. ఒకవైపు మన దేశంలో ప్రాథమిక సదుపాయాల నిర్మాణానికీ, పరిశ్రమల ఏర్పాటుకు చైనా సహకారాన్ని తీసుకుంటేనే మరోవైపు అమెరికా సైనిక వ్యూహంలో చిక్కుకోవడం వల్ల భారత దేశ ప్రయోజనాలకు భంగం వాటిల్లే ప్రమాదం ఏర్పడింది.

# మల్లు వెంకట నరసింహారెడ్డి

(2వ పేజీ తరువాయి)

పార్టీ నుంచి కబురొచ్చింది. ఆ మేరకు కరీంనగర్ జిల్లా మంథని ప్రాంతానికి పంపబడ్డారు. మంథని ఏరియా కమిటీలో ఆయనతోపాటు స్వరాజ్యం, ముకుందరావు మాత్రమే ఉన్నారు. ఇక్కడే మొదటిసారి వీఎన్ మిలటరీ బాధ్యతలు చేపట్టారు. మూడు దళాలకు ఆయన నాయకత్వం వహించవలసి వచ్చింది. తమ దళాల గురించి పోలీసులు సమాచారం రాబట్టిన విషయం తెలుసుకొని వారు రాకముందే శిబిరాన్ని ఖాళీ చేశారు. అయితే దళాలకు ఆయుధాలకూ, మందుగుండుకూ తీవ్ర కొరత ఏర్పడింది.

రాష్ట్ర కేంద్రం నుంచి వచ్చిన భీమిరెడ్డి నరసింహారెడ్డి కొరియా యుద్ధం సందర్భంగా కమ్యూనిస్టు సైన్యాలు అనుసరించిన ఎత్తుగడలు అనుసరించాలని చెప్పారు. దాంతో వీఎన్ దళం శత్రుసైనికులపై దాడి చేసే ఎత్తుగడలకు పదును పెట్టింది. ఆదిలాబాద్ జిల్లా చెన్నూరు ప్రాంతంలో రెండు దాడులు నిర్వహించి సైనికుల నుంచి మూడు రైఫిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఆనాడు ప్రతి బస్సుకూ ఇద్దరు, ముగ్గురేసి పోలీసులను నియమించేవారు. ఓసారి వీఎన్.. మందుగుండు సామగ్రికోసం చెట్ల మానులను రోడ్లపైకి దొర్లించి బస్సును ముట్టడించి పోలీసులను లొంగదీసుకొని వారి వద్ద ఆయుధాలు, తూటాలు తీసుకుపోవడంలోనూ, ఇల్లెందు బొగ్గుగనుల వాహనంపై దాడిచేసి పేలుడు సామగ్రిని స్వాధీనం చేసుకోవడం వంటి కార్యక్రమాలను రూపొందించడంలోనూ ముఖ్యమైన పాత్ర నిర్వహించారు. మిలటరీ పెద్దఎత్తున దాడికి తలపెట్టినట్లు తెలియడంతో ఓ రోజు రాత్రి అర్జెంటుగా గోదావరి నది దాటి ఆదిలాబాద్‌కు వెళ్లాల్సి వచ్చింది. అప్పటికప్పుడు ఆ నది ఒడ్డున ఉన్న పల్లెకారులను లేపి అర్జంటుగా పడవ కట్టమని కోరారు. పడవలు వాడుకలో లేకపోయినప్పటికీ వీరి ఒత్తిడి మూలంగా చివికిపోయిన తాళ్లతో అప్పటికప్పుడు కట్టిన ఒక పడవలో ఎక్కి బయలుదేరారు. అది కొంచెం దూరం వెళ్లకముందే తాళ్లు తెగిపోనారంభించాయి. దీంతో పడవలోంచి దిగి తిరిగి ఒడ్డుకు చేరుకుంటుండగా నాగమ్మ అనే మహిళ నీటి ప్రవాహంలో కొట్టుకుపోయింది. ఆ సమయంలో వీఎన్ సాహసంతో ఆమెను కాపాడారు. బెల్లంపల్లి, మంచిర్యాల ప్రాంతాల్లో పోలీసు దాడులను ఎదుర్కొంటూ పోరాటాన్ని ముందుకు తీసుకువెళ్లడంలో ఆయన ముఖ్యపాత్ర వహించారు. ఈ కాలంలో వారి ఇల్లు తగులబెట్టారు. తండ్రిని ఊరి నుంచి వెళ్లగొట్టారు. చిన్నపిల్లలైన తమ్ముళ్లు, చెల్లెళ్లు మునగాల పరగణా జగ్గుగూడెం, గోపాలపురంలో తలదాచుకున్నారు.

1951లో సాయుధ పోరాట విరమణ నిర్ణయాన్ని తెలపడానికి వస్తున్న చంద్ర రాజేశ్వరరావుగారిని తీసుకువచ్చేందుకు వీఎన్ భూస్వామి కొడుకు వేషంలో బెల్లంపల్లి రైల్వే స్టేషన్‌కు వెళ్లారు. వీఎన్‌ను చంద్ర రాజేశ్వరరావుగారు నిజంగానే భూస్వామి అనుకొని ఆయనతో వెళ్లడానికి నిరాకరించారు. వీఎన్ అందజేసిన చిట్టీ చూశాకగానీ ఆయనతో కలిసి వెళ్లలేదు. పోరాట ఉపసంహరణ తరువాత ఎన్నికల జరిగాక కూడా వీఎన్‌ను పోలీసులు అరెస్టు చేసి జైలులో పెట్టారు. గతంలో పోలీసులపై మెరుపుదాడి చేసి ఆయుధాలు లాక్కున్న కేసును పెట్టి జైలుకు పంపారు. అయితే కోర్టు కేసు కొట్టివేయడంతో జైలు నుంచి విడుదలయ్యారు. అప్పటివరకూ ఆయన ఆదిలాబాద్ జిల్లా బాధ్యతలను చూస్తున్నారు. పోరాట విరమణ తరువాత కూడా జన్నారెడ్డి భూస్వామి కక్షతో వీఎన్ కుటుంబాన్ని గ్రామానికి రానీయలేదు. దీంతో నకిరేకల్లు మండలంలో ఉంటున్న వీఎన్ తల్లి, మేనమామలు కొంతకాలం ఆశ్రయమిచ్చారు. ఈ దుర్భర పరిస్థితుల్లోనే వీఎన్ 11 ఏళ్ల చెల్లెలు భారతి జబ్బున పడి వైద్యమందక చనిపోయింది. పోరాట విరమణ జరిగినా వీఎన్‌పై ఇంకా అనేక కేసులున్నందున 1954 వరకూ ఆయన అజ్ఞాతవాసం చేయాల్సి వచ్చింది.

1954 మేలో హైదరాబాద్ ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని దేవులపల్లి వెంకటేశ్వరరావుగారి క్వార్టరులో బద్దం ఎల్లారెడ్డి, చంద్ర రాజేశ్వరరావు, దేవులపల్లి వెంకటేశ్వరరావు సమక్షంలో వీఎన్ వివాహం ఉద్యమ సహచరిణి, తన దళంలో పనిచేసిన స్వరాజ్యం(భీమిరెడ్డి నరసింహారెడ్డిగారి చెల్లెలు)తో జరిగింది. రెండు దండలతో ఆ పెళ్లి ఎంతో నిరాడంబరంగా జరిగింది. వీఎన్–స్వరాజ్యం దంపతులకు ఇద్దరు కుమారులు గౌతమ్, నాగార్జున, కుమార్తె కరుణ ఉన్నారు. నిరంతరం ఉద్యమాల్లో గడిపే వీఎన్ ఇంటికి అరుదుగా వెళ్లేవారు. ఆయన కుటుంబంతో కలిసి ఉన్న రోజులు వేళ్లమీద లెక్కపెట్టవచ్చు. ఎక్కడ ఉద్యమాలు ఉంటే అక్కడే ఆయన పూర్తిగా ఉండిపోయేవారు. నేనే ఆయన్ని చూసొచ్చేందుకు బంధువులా వెళ్లి వచ్చేదాన్నని మల్లు స్వరాజ్యంగారు ఓ సందర్భంలో చెప్పారు. 1964లో అవిభక్త కమ్యూనిస్టు పార్టీలో చీలిక ఏర్పడినప్పుడు ఆయన సిపిఎంవైపు నిలిచారు. చైనాతో యుద్ధం సమయంలో రహస్యంగా పార్టీ నిర్మాణానికి తోడ్పడ్డారు. 1965లో భీమిరెడ్డి నరసింహారెడ్డి అరెస్టయినప్పుడు పార్టీ కార్యదర్శిగా ఓ ఏడాదిపాటు వ్యవహరించారు. 1968లో సిపిఎం నుంచి నక్సలైట్లు చీలిపోయినప్పుడు అతివాదానికి వ్యతిరేకంగా దృఢవైఖరిని అవలంబించారు. చిన్నాభిన్నమైన పార్టీ శ్రేణులను కూడగట్టి నడపడంలో ఆయన ప్రధాన పాత్ర వహించారు. జిల్లాలో పార్టీని మార్క్సిస్టు లైనుపై నిలబెట్టడం ప్రధాన సమస్యగా మారింది. భీమిరెడ్డి జైల్లో ఉన్నారు. మరి కొంతమంది స్తబ్దతలో పడ్డారు. ఆ పరిస్థితుల్లో వీఎన్‌ను ఆదిలాబాద్ నుంచి నల్గొండ జిల్లా బాధ్యతల కోసం పార్టీ వెనక్కి పిలిపించింది. సుందరయ్యగారి సూచనపై జిల్లా పార్టీ సెంటరు సూర్యాపేట సెక్రటరీగా ఉంటూనే జిల్లా పార్టీని కూడగట్టే కార్యక్రమంలో ప్రధాన పాత్ర వహించారు. పోరాట కాలంలో కమ్యూనిస్టులు పంపిణీ చేసిన భూమిని కాంగ్రెస్ ప్రభుత్వం భూస్వాముల పక్షాన చేరి పోలీసు బలగాలతో ఆ భూములను భూస్వాములకు అప్పగించే కార్యక్రమం మొదలుపెట్టింది. గ్రామాలపై దాడులు – ప్రతిఘటన, క్యాడరుపై నిర్బంధ విధానం, హత్యలు పెరిగాయి. ఆ పరిస్థితుల్లో ప్రధాన గ్రామాలను ఎంచుకొని ప్రజా ప్రతిఘటన కొనసాగిస్తూనే పార్టీని కాపాడే బాధ్యతను వీఎన్ సమర్థవంతంగా నిర్వహించారు. సుందరయ్యగారి గైడెన్స్‌లో చక్కగా బాధ్యతలు నెరవేర్చి ఆయనకు అభిమానపాత్రుడయ్యారు.

నాగార్జున సాగర్ ప్రాజెక్టు కోసం జరిగిన పోరాటంలో ఆయన ప్రత్యక్షంగా పాల్గొన్నారు. తెలంగాణాలోని మూడు జిల్లాలకు నీరందించే శ్రీరాంసాగర్ రెండోదశ నిర్మాణం కోసం జరిగిన పోరాటంలోనూ పాల్గొన్నారు. 1968లో పార్టీ నల్గొండ జిల్లా కార్య దర్శిగా బాధ్యతలు చేపట్టి 1996 వరకూ కొనసాగారు. 68లోనే రాష్ట్ర కమిటీ సభ్యులయ్యారు. 1972లో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గా ఎన్నికయ్యారు. 1985 నుంచి కేంద్ర కమిటీ సభ్యులుగా ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగానూ, అధ్యక్షులుగానూ బాధ్యతలు నిర్వహించారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం కమిటీల్లోనూ పనిచేశారు. చివరి దశలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్షులుగా ఉన్నారు. వీఎన్ చైనా, సోవియట్ యూనియన్లలో కూడా పర్యటించారు.

పిల్లలను ప్రజాసేవలో సంబంధం ఉండే చదువులనే చదివించాలని వాళ్లకు ఇష్టం లేకున్నా పట్టుబట్టారు. లెక్కల్లో దిట్ట అయిన పెద్దకుమారుడు సివిల్ ఇంజినీరింగ్ చదువుతానంటే అది అరాచక జీవితమని, తాగుడు, కాంట్రాక్టు స్వభావం, లంచాలు ఉంటాయని మెడిసిన్ చదవాలని బలవంతంగా పంపారు. సీటు రాకుంటే హోమియో కోర్సులో చేర్పించారు. కాంగ్రెస్ దాడుల కారణంగా ఉద్యమ అవసరం కోసం లాయరే చదవాలని చిన్నకుమారుడిని పట్టుబట్టారు. 2004లో తీవ్రంగా జబ్బు పడ్డారు. ఆ యేడాదే డిసెంబర్ 4న కన్నుమూశారు. వీఎన్‌తో పనిచేసినవారూ, ఆయనతో పరిచయమున్నవారూ ఎవరైనా ఆయన నిబద్ధతకూ, ఆదర్శప్రాయ జీవితాన్ని ప్రత్యేకంగా గౌరవిస్తారు. ఆయన విరామమెరుగని విప్లవకారుడు.

# మహిళలు సమానత్వంతో పాటు సామాజిక విముక్తి కోసం కూడా పోరాడాలి



**ఆగస్ట్ బెబెల్**

గొప్ప సామాజిక మార్పులు స్థిరంగా జరుగుతున్న కాలంలో మనం ఉన్నాము. సమాజంలోని అన్నితరగతులలోనూ మానసికంగా స్థిరత్వం లేని, ఆందోళన కరమైన స్థితితో తీవ్రమైన, లోతైన మార్పులకు దారితీసే పరిస్థితిని మనం చూస్తున్నాం. వీటిలో మహిళల సమస్య అతి ముఖ్యమైన ప్రశ్నగా మరింత ప్రాధాన్యతను సంతరించుకొంటూ నిరంతరం చర్చకు వస్తున్నది. మహిళా సమస్యలపై ఎదురౌతున్న ప్రశ్న మన సామాజిక నిర్మాణంలో మహిళలు ఆక్రమించుకున్న స్థానాన్ని, సమాన హక్కులను అనుభవిస్తూ మానవ సమాజంలో ప్రయోజనకరమైన సభ్యురాలుగా ఉండటానికి, అత్యున్నతమైన సామర్థ్యంతో తన శక్తిసామర్థ్యాల్ని ఎక్కువ సమర్ధవంతంగా సమాజాభివృద్ధికి ఏ విధంగా వినియోగించగలదు అన్న అంశాలను పరిశీలిస్తుంది. మన దృక్పథం నుండి చూస్తే ఈ సమస్య మరో సమస్యతో ముడిపడి ఉంది: అణచివేతను, దోపిడీని, విచారాన్ని, లేనితనాన్ని అంతం చేయటానికి, వ్యక్తులకు, మొత్తంగా సమాజానికి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని సమకూర్చటానికి సమాజాన్ని ఏ విధంగా నిర్మించాలి? ప్రస్తుతం మేధావులందరి ఆలోచనలను ఆక్రమించుకొని ఉన్న సాధారణ సామాజిక సమస్యలలో మహిళల సమస్య ఒక అంశం మాత్రమే అవుతుంది. సామాజికంగా తీవ్రస్థాయికి చేరిన వైరుధ్యాలను, ఆ వైరుధ్యాల ఫలితంగా తలెత్తిన చెడుగులను నివారించటం ద్వారానే అంతిమ పరిష్కారం సాధ్యం అవుతుంది. అయినప్పటికీ మహిళల సమస్య మన ప్రత్యేక కేంద్రీకరణను కోరుతున్నది. ప్రాచీన సమాజంలో మహిళల హోదా ఏమిటి, ప్రస్తుతం ఆమె హోదా ఏమిటి, రానున్న నూతన సమాజంలో ఆమె హోదా ఏమిటి అనేవి మానవజాతిలో కనీసం సగభాగాన్ని తీవ్రంగా ఆందోళన పరుస్తున్న సమస్యలుగా ఉన్నాయి. యూరోపియన్ ప్రజానీకంలో మహిళలు మెజారిటీగా ఉన్నారు కాబట్టి అక్కడ సంఘటిత సమాజానికి ఇది ప్రాధాన్యతగల అంశం అవుతుంది. ప్రకృతి మహిళకు భార్యగా, తల్లిగా ఆమె కార్యకలాపాలను ఇంటికే పరిమితం చేసింది కాబట్టి మహిళల స్థితి ఎప్పుడూ ఇలాగే ఉంది, ఇకముందు కూడా ఇలాగే ఉంటుంది. కాబట్టి మహిళల సమస్య అనేదే లేదని కొందరు చెబుతున్నారు. గృహంలోని నాలుగు గోడలకు అవతల ఉన్న, గృహానికి సంబంధించిన బాధ్యతలతో సన్నిహితంగా ముడిపడిలేని విషయాలతో ఆమెకు సంబంధం లేదని చెబుతున్నారు.

మానవ సమాజంలో శ్రామికుని పరిస్థితి ఏమిటి అన్న ప్రశ్న వలెనే మహిళల సమస్యపై కూడా రెండు పరస్పర విరుద్ధమైన వాదనలు మనకు ఎదురవుతాయి. ప్రతి విషయాన్ని యధాతథంగా కొనసాగించాలనుకునే వారు మహిళలను ప్రకృతి సహజమైన పనులకే పరిమితం చేసి, తాము ఆ సమస్యను పూర్తిగా పరిష్కరించామని భావిస్తారు. మనం తర్వాత చర్చించబోయే అంశాలలో స్పష్టం కానున్నట్లు వివిధ కారణాల రీత్యా లక్షలాది మంది మహిళలు ప్రకృతి వారికి నిర్దేశించిన భార్య, తల్లి బాధ్యతలను నిర్వర్తించగలిగిన స్థితిలో లేరని వీరు గుర్తించరు. పెళ్ళివారికి భారం కావటం, బానిస స్థితిలోకి నెట్టటంతో లక్షలాది మంది మహిళలు తమ సహజమైన బాధ్యతలను నిర్వర్తించటంలో విఫలమయ్యారని, వారు తమ జీవితాలను వేదనతోనూ, నిరాశతోనూ గడుపుతున్నారని కూడా వీరు గుర్తించరు. పురుషుల వలెనే మహిళలు కూడా నాగరికత సాధించిన అభివృద్ధిని అనుభవించటాన్ని, తమ భారాలను తగ్గించుకోవటాన్ని, తమ పరిస్థితిని మెరుగుపరుచుకోవటాన్ని, శారీరక, మానసిక సామర్థ్యాలను అభివృద్ధి చేసుకోవటాన్ని వారు అంగీకరించరు. విముక్తి కోసం పిచ్చిగా ప్రయత్నాలు చేస్తున్నారని, పిదపకాలం వచ్చిందని దూషిస్తూ తిరస్కారంగా మాట్లాడతారు. వారు చీకట్లో సంచరించే మానవ గుడ్లగూబల్లాంటి వారు. తమ కాలం చెల్లిన భావాలపై ఏ మాత్రం వెలుగు ప్రసరించినా భయంతో కేకలు వేస్తారు.

రెండవ అభిప్రాయానికి ప్రాతినిధ్యం వహించేవారు ఈ భావాలను గుడ్డిగా అంగీకరించరు. మొత్తం సామాజిక అభివృద్ధితో పోల్చుకుంటే మహిళల పరిస్థితి ఇంత అధ్వాన్నంగా ఎప్పుడూ లేదని వారు అంగీకరిస్తారు. మహిళలకు సమాన విద్యావకాశాలు కావాలని, యూనివర్శిటీలతో పాటు అన్ని రంగాలలోనూ నేర్చుకోవటానికి వారికి అవకాశం కల్పించాలని వారు డిమాండు చేస్తారు. అమెరికాలో సాధించిన దానిని చూపుతూ మహిళలు ప్రభుత్వ పదవులలోకి కూడా రావాలని వారు కోరతారు. మహిళలకు సమాన రాజకీయ హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తారు. ఇప్పటి వరకు పురుషులు తమ స్వప్రయోజనాలకు అనుగుణంగా మహిళలను లొంగదీసుకోవటం కోసం చట్టాలను రూపొందించి అమలు చేశారని, ప్రభుత్వ కార్యకలాపాలలో మహిళలకు స్థానం కల్పించాల్సిన అవసరాన్ని ఇది తెలియజేస్తుందని వారు చెబుతారు. బూర్జువా మహిళా ఉద్యమ ఏకైక లక్ష్యంవలె మనలక్ష్యం ప్రస్తుత సామాజిక వ్యవస్థలో స్త్రీ, పురుషుల సమానత్వాన్ని సాధించటం మాత్రమే కాదు. మనం దానిని దాటి మరింత ముందుకుపోయి ఒక మనిషి మరో మనిషిపై ఆధారపడే, స్త్రీలు పురుషులపై ఆధారపడేలా చేసే అన్ని రకాలైన ఆటంకాలను తొలగించటానికి పూనుకోవాలి. మహిళల సమస్యకు, సామాజిక సమస్యకు చేసే పరిష్కారాలు ఒకే విధంగా ఉంటాయి. మానవజాతి సంక్షేమం కోసం సామాజిక సమస్యలను పరిష్కరించటం తమలక్ష్యంగా నిర్దేశించుకున్న వారితో మహిళల సమస్యలు పూర్తిగా పరిష్కారం కావాలని కోరుకొనేవారు తప్పనిసరిగా చేతులు కలపాలి.

**(ఆగస్ట్ బెబెల్ 1879లో రాసిన మహిళలు సోషలిజం పుస్తకానికి ముందుమాట నుండి ఈ భాగం గ్రహించబడింది)**

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed and Published at Hyderabad Prajasakti Printing Press, Plot Not. 21/1, Azamabad, Hyderabad-20. Phone : 040-27673787. Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.11, No.6. Published on October 1, 2016